
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



చిత్తూరు

బుధవారం, 2 ఆగస్టు 2017 | 16



భూమి కొనుగోలు పథకంలో

కదలిక

యూనిట్ ధర పెంపుతో మొదలైన దరఖాస్తులు

ఎస్సీ కార్పొరేషన్ పథకానికి అనేక అడ్డంకులు

సొంత భూమి లేని నిరుపేద దళితులకు వ్యవసాయ భూములు అందించేందుకు ప్రవేశపెట్టిన భూమి కొనుగోలు పథకం రెండు దశాబ్దాల విరామం తర్వాత కదలికకు నోచుకుంటోంది.అయితే యూనిట్ ధరను ఎంత గణనీయంగా పెంచినా యూనిట్ ధరకూ, మార్కెట్ ధరకూ నడుమ వ్యత్యాసం భారీగా వుండడమే పథకం అమలుకు అడ్డంకిగా మారుతోంది. దీనికి తోడు మార్గదర్శకాలు, నియమనిబంధనలు కూడా సంక్లిష్టంగా వుండడంతో పథకం అమలు ప్రశ్నార్థకమవుతోంది.

వివరాలు 2వ పేజీలో

కేపులే కారణమా?

నేలమట్టమైన గోడౌన్ లో దొరికిన కేపులు →



భారీ విస్ఫోటానికి కారణం ఎలక్ట్రికల్ ఈడీలని అనుమానం ?

గోడౌనులో బండరాళ్లను పగులగొట్టే కేపుల తయారీ

కాలేనాయక్ కోసం నాలుగు బృందాలతో వేట ముమ్మరం

తమిళనాడుపైనే పోలీసుల ప్రధాన దృష్టి



తిరుపతి శివారు ప్రాంతంలో ఆదివారం రాత్రి జరిగిన భారీ విస్ఫోటానికి అసలు కారణం బండరాళ్లను పగులగొట్టడానికి ఉపయోగించే ఎలక్ట్రికల్ ఈడీలనే అనుమానాలు బలపడుతున్నాయి.వ్యావహారికంలో కేపులని పిలువబడే ఇవి పేలడం వల్లే అంత పెద్ద శబ్దం రావడంతో పాటు భవనం కుప్పకూలిందని పోలీసులు భావిస్తున్నారు.

వివరాలు 15లో..



టీచర్లు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న బదిలీల కౌన్సెలింగ్ షెడ్యూలును విద్యాశాఖ అధికారులు మంగళవారం ప్రకటించారు.ప్రభుత్వ తాజా ఉత్తర్వుల ప్రకారం జిల్లాలో మూతపడే పాఠశాలల లెక్క తేలింది. దీంతో టీచర్ల సీనియారిటీ జాబితాతో పాటు కౌన్సెలింగ్ షెడ్యూలును ప్రకటించేందుకు మార్గం సుగమమైంది.

టీచర్ల కౌన్సెలింగ్‌కు

శ్రీకారం

- 8వరకు బదిలీల కౌన్సెలింగ్
- నాలుగు కేంద్రాల్లో ఏర్పాట్లు

వివరాలు 2లో..

రోడ్డు ప్రమాదాల కట్టడికి

మాస్టర్ ప్లాన్

14

- పోలీసు, ఆర్టీసీ, రవాణా శాఖలతో టాస్క్‌ఫోర్సు
- జాతీయ రహదారులు, ముఖ్య కూడలి ప్రాంతాల్లో లైట్ల ఏర్పాటు
- చిత్తూరు-నాయుడుపేట రోడ్డుకు తొందరలోనే విస్తరణ పనులు
- హెల్మెట్ వాడకం ఇక తప్పనిసరి : కలెక్టర్ ప్రద్యుమ్న వెల్లడి

ఏడ్పిస్తున్న

ఉల్లి

వారం వ్యవధిలో ధర రెట్టింపు

కొత్త పంట వచ్చేదాకా కష్టాలే

2



భూమి కొనుగోలు పథకం ముందుకు కదిలేనా?

యూనిట్ ధర పెంపుతో మొదలైన దరఖాస్తులు ● ఎస్సీ కార్పొరేషన్ పథకానికి అనేక అడ్డంకులు

(ఆంధ్రజ్యోతి - చిత్తూరు)

ఒకప్పుడు భూమిలేని నిరుపేద దళితులను భూమి యజమానులుగా మార్చి వారికి ఆదాయ వనరుతో పాటు సమాజంలో గౌరవం కూడా కల్పించిన ఎస్సీ కార్పొరేషన్ భూమి కొనుగోలు పథకం సుమారు రెండు దశాబ్దాల విరామం తర్వాత కదలికను నోచుకుంటోంది. చాలా ఏళ్ళ తర్వాత ఈ పథకం కింద లబ్ధి పొందేందుకు నిరుపేద దళితులు దరఖాస్తు చేసుకుంటున్నారు. అయితే యూనిట్ ధరను ఎంత గణనీయంగా పెంచినా యూనిట్ ధరకూ, మార్కెట్ ధరకూ నడుమ వ్యత్యాసం భారీగా వుండడం పథకం అమలుకు అడ్డంకిగా మారుతోంది. దానికి తోడు మార్గదర్శకాలు, నియమనిబంధనలు కూడా సంక్లిష్టంగా వుండడంతో పథకం అమలు ప్రశ్నార్థకమవుతోంది.

ఎస్సీ కార్పొరేషన్ ద్వారా సొంత భూమి లేని నిరుపేద దళితులకు వ్యవసాయ భూములు అందించేందుకు భూమి కొనుగోలు పథకం ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. దీని ద్వారా ప్రారంభంలో పెద్దఎత్తున పేద దళితులు లబ్ధి పొందారు. ఎస్సీ, ఎస్టీయేతర మెట్ట రైతుల నుంచి సెటిల్‌మెంట్ భూమిని ప్రభుత్వమే కొనుగోలు చేసి ఎస్సీలకివ్వడమే ఈ పథక ఉద్దేశం. అయితే విక్రయించడానికి దళితేతర మెట్ట రైతులు స్వచ్ఛందంగా ముందుకు రావాల్సివుంటుంది. అలాగే సంబంధిత భూమి వ్యవసాయ యోగ్యంగా వుండాలి. దాన్ని తీసుకుని సాగు చేసుకోవడానికి పేద దళితులు దరఖాస్తు చేసుకోవాల్సి వుంటుంది. 25 శాతం రుణం, 75 శాతం సబ్సిడీతో భూమిని ప్రభుత్వం మెట్ట రైతుల నుంచి కొని అర్హులైన దళితులకు కేటాయిస్తుంది. వారు సబ్సిడీ మినహాయించుకుని రుణ మొత్తాన్ని స్వల్ప వడ్డీతో వాయిదాలపై ప్రభుత్వానికి తిరిగి చెల్లించి భూమిపై శాశ్వత హక్కులు పొందాల్సి వుంటుంది. మెట్ట భూమి అయితే గరిష్ఠంగా రెండు ఎకరాలు, మాగాణి అయితే ఎకరా చొప్పున యూనిట్‌ను ప్రభుత్వం నిర్దేశించింది. మహిళల పేరిట పట్టాలు ఇవ్వడం జరుగుతుంది. ఇదీ స్థూలంగా పథక స్వభావం. కాకపోతే ప్రభుత్వం ఖరారు చేసిన యూనిట్ ధర ప్రారంభంలో ఇంచుమించు మార్కెట్ ధరతో సమానంగా వుండేది. దీనివల్ల పెద్ద సంఖ్యలో నిరుపేద దళితులు సొంత వ్యవసాయ భూములకు యజమానులుగా మారి ఆర్థిక స్థోమత పెంచుకోవడంతో పాటు సామాజిక అంతస్తును కూడా పెంచుకున్నారు. అయితే రెండు దశాబ్దాల నుంచి జిల్లాలో ఈ పథకం అమలు స్తంభించిపోయింది. తొలుత యూనిట్ ధర రూ. లక్ష మాత్రమే వుండేది. రాష్ట్రవ్యాప్తంగా 2000వ సంవత్సరం నాటికే రియల్ బూమ్ ప్రభావంతో మారుమూల ప్రాంతాల్లో కూడా భూముల ధరలు గణనీయంగా పెరిగిపోయాయి. 2004 తర్వాత రియల్ బూమ్ తారస్థాయికి చేరుకుంది. దీనివల్ల ఎంత మారుమూల ప్రాంతంలోనైనా రూ. 2 లక్షలకు లోపు ఎకరం భూమి దొరికే అవకాశం లేకుండా పోయింది. అయితే ఎస్సీ కార్పొరేషన్ భూమి కొనుగోలు పథకం యూనిట్ ధర మాత్రం 2013 వరకూ కూడా పెరగలేదు. అందువల్ల 1994 నుంచీ కూడా ఈ పథకం అమలు నిలిచిపోయింది. తక్కువ ధరకు భూములు విక్రయించడానికి రైతులు ముందుకు రాకపోవడంతో పేద దళితులు కూడా దరఖాస్తు చేసుకోలేదు. 2013లో ప్రభుత్వం యూనిట్ ధరను రూ. లక్ష నుంచీ రూ. 5 లక్షలకు పెంచింది. అయినా అప్పటి మార్కెట్ ధరలకు అనుగుణంగా లేనందున పథకం అమలు కాలేదు.

ఏడాది కిందట రూ. 15 లక్షలకు పెరిగిన యూనిట్ ధర

దీంతో క్షేత్రస్థాయి పరిస్థితులను గ్రహించిన ప్రభుత్వం గతేడాది డిసెంబరులో యూనిట్ ధరను గణనీయంగా పెంచింది. రూ. 5 లక్షల నుంచి ఏకంగా రూ. 15 లక్షలకు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. అలాగని జిల్లాలో ఎక్కడైనా ఎకరాకు రూ. 15 లక్షల వంతున చెల్లించరు. ఎక్కడ భూమి గుర్తించినా అక్కడి రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రభుత్వ ధరలకు అనుగుణంగానే చెల్లింపులు చేస్తుంది. సరిగ్గా ఇక్కడే చిక్కొచ్చి పడుతోంది. ఎక్కడైనా భూములకు ప్రభుత్వం నిర్ణయించే ధర, మార్కెట్‌లో వాస్తవ ధర వేర్వేరుగా వుంటున్నాయి. ప్రభుత్వ ధరకూ, వాస్తవ ధరకూ మధ్య తేడాను అనధికారికంగా లబ్ధిదారులు భరిస్తే తప్ప పథకం కింద భూములు పొందలేని పరిస్థితి వుంది. మారుమూల ప్రాంతాల్లోనే ఎంతోకొంత మేరకు ప్రభుత్వ, మార్కెట్ ధరల నడుమ వ్యత్యాసం కాస్తంత తక్కువ కనుక పథకం అలాంటి చోట్ల అమలయ్యే అవకాశం వుంది. ఇదిలా వున్నా యూనిట్ ధర పెంపుతో పేద దళితుల్లో భూమి కొనుగోలు పట్ల ఆశాభావం వ్యక్తమవుతోంది. ఈ ఏడాదిలో ఇప్పటివరకూ రామసముద్రం, కేవీబీపురం, పూతలపట్టు, శ్రీకాళహస్తి, చౌడేపల్లె, పుంగనూరు, గంగవరం, పెద్దపంజాణి, శాంతిపురం మండలాల నుంచీ మొత్తం 17 దరఖాస్తులందాయి.

అమలు ప్రక్రియ సంక్లిష్టం

భూమి కొనుగోలు పథకం అమలు చేయడానికి ప్రభుత్వం నిర్దేశించిన ప్రక్రియ సంక్లిష్టంగా వుంది. భూమి గుర్తింపు నుంచి ఆర్డీవో అధ్యక్షతన కమిటీ భూమి తనిఖీ చేయడం వరకూ, అలాగే పలు ధ్రువీకరణ పత్రాలు పొందడం వరకూ సుదీర్ఘ ప్రక్రియ చేపట్టాల్సివుంది. అదేవిధంగా ధరల ఖరారుకు విక్రేత, కొనుగోలుదారులతో చర్చలు జరపడంతో పాటు రిజిస్ట్రేషన్ కార్యాలయం ద్వారా మార్కెట్ ధరను తెలుసుకుని ఖరారు చేసే ప్రక్రియ కూడా చాలా సమయం తీసుకుంటుంది. నిర్దిష్ట వ్యవధిలోనే ఈ ప్రక్రియను పూర్తి చేయడానికి లబ్ధిదారుల పరంగా అధికారులపై ఒత్తిడి పెంచే పరిస్థితి లేదు. దీనివల్ల జిల్లా స్థాయి అధికారులు ఒత్తిడి తెస్తేనే సకాలంలో పథకం అమలై నిరుపేద దళితులు వ్యవసాయ భూములకు యజమానులవుతారు.

దరఖాస్తులకు ఎస్సీ కార్పొరేషన్ ఆహ్వానం

భూమి కొనుగోలు పథకానికి నిరుపేద ఎస్సీ, ఎస్టీలు దరఖాస్తు చేసుకోవాలని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ కనకనరసారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.రూ. 9 లక్షల విలువగల మూడెకరాల పుంజ భూమి లేదా రూ.12 లక్షల విలువ చేసే(ఒక పంట పండే) రెండెకరాల నంజ భూమిని లేదా రూ. 15 లక్షల విలువ చేసే రెండు పంటలు పండే రెండెకరాల భూమిని ప్రభుత్వం కొనిస్తుందన్నారు. ఇందులో 75శాతం సబ్సిడీ, 25 శాతం ఎన్ఎస్ఎఫ్‌డీసీ పథకం కింద రుణాన్ని మంజూరు చేస్తామన్నారు. భూమిలేని నిరుపేద స్త్రీలు అర్హులని, 18 సంవత్సరాలు నిండి దారిద్ర్యరేఖకు దిగువ వున్న వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. స్త్రీ కౌలు రైతులు కూడా ఈ పథకానికి అర్హులన్నారు. అర్హత, ఆసక్తి కలిగిన ఎస్సీ, ఎస్టీ మహిళలు దరఖాస్తులను, భూములను విక్రయించు రైతుల వివరాలను కలెక్టరేట్‌లోని కమాండ్ కంట్రోల్ కేంద్రంలో, జిల్లా ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ కార్యాలయాల్లో, తహసీల్దార్, ఎంపీడీవో, ఆర్డీవో,సబ్ కలెక్టర్ కార్యాలయాల్లో సమర్పించాలన్నారు.



ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయం

ఇక ఉల్లి ధర లొల్లి

వారం వ్యవధిలో ధర రెట్టింపు ● కొత్త పంట వచ్చేదాకా కష్టాలే



చిత్తూరు కలెక్టరేట్: ఉల్లి లేకుండా ఏ కూరా వండలేరు. వారం రోజుల వ్యవధిలో ఉల్లిధర రెండింతలయ్యింది. దీంతో వినియోగదారులు, గృహిణులు గగ్గోలు పెడుతున్నారు. అటు మహారాష్ట్ర రైతుల నిరసన, ఇటు కర్నూలులో వర్షాభావం ఉల్లి మార్కెట్‌ను దెబ్బ తీసింది. వీటి ప్రభావంతో రానున్న రోజుల్లో ధరలు మరింత పెరగవచ్చని వ్యాపారులు అంటున్నారు. కొత్త ఉల్లి అందుబాటులోకి రాగానే అంటే మరో 75 రోజులు ఆగితే ధరలు తగ్గే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. పది కిలోల ఉల్లిపాయలు రిటైల్ మార్కెట్‌లో గత వారం రూ.80కి అమ్మకాలు జరిగాయి. ఒక్కొక్క రోజు ఒక్కో ధరగా ఆదివారం వీటిధర అమాంతం పెరిగిపోయింది. గత గురువారం కిలో రూ.14, శుక్రవారం రూ.20, ఆదివారం మరో నాలుగు రూపాయిలు పెరిగి రూ.24కు చేరుకుంది. సోమ, మంగళవారాల్లో అదే ధర రూపాయి అటుఇటు కొనసాగింది. జిల్లా అంతటికీ మహారాష్ట్ర నాసిక్ నుంచి ఉల్లిపాయలు దిగుమతి అవుతుంటాయి. వారానికి చిత్తూరు, తిరుపతి, మదనపల్లె ప్రాంతాలకు రమారమి 15-20 లారీల సరకు వస్తుంది. ఇదిలా ఉండగా మహారాష్ట్రలో రైతులు రుణమాఫీ చేయాలంటూ ఉల్లి పంటను రహదారులపై పారబోశారు. ఇదే తరుణంగా అక్కడి హోల్‌సేల్ వర్తకులు ఉల్లిపాయలను భారీగా అతి తక్కువ ధరకు కొనుగోలు చేసి శీతలగిడ్డంగుల్లో నిల్వచేశారు. ప్రస్తుతం పంటపొలాల్లో ఉల్లి లేదు. దీంతో హోల్‌సేల్ వ్యాపారులు ధరలను తమ చేతుల్లో పెట్టుకొని అమాంతం పెంచేస్తున్నారు. కర్నూలు జిల్లాలో ఉల్లి పంట ఎక్కువగా ఉంది. ఈ జిల్లాలో పంట చేతికి రావడానికి మరో నెలన్నర రోజులు వేచివుండక తప్పదు. అక్కడ కూడా కేజీ ఉల్లి ధర సోమవారం రూ.22 పలికింది. అక్కడి నుంచి ఇక్కడికి సరకులు తెస్తే రవాణా చార్జీలు కేజీకి రూ.3 వడ్డింపు తథ్యం. మరోవైపు వర్షాభావం ఉల్లి రైతుల్ని ఏడిపిస్తోంది. ఉల్లి ధరలు పెరగడమే తప్ప తగ్గడం ఉండకపోవచ్చని స్థానిక వ్యాపారులు అంటున్నారు.

టీచర్ల కౌన్సెలింగ్ షెడ్యూలు విడుదల

చిత్తూరు సిటీ: టీచర్లు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న బదిలీల కౌన్సెలింగ్ షెడ్యూలును విద్యాశాఖ అధికారులు మంగళవారం ప్రకటించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో కౌన్సెలింగ్ ప్రక్రియ పూర్తికావస్తున్నా మన జిల్లాలో రేషనలైజేషన్‌పై రోజుకో మార్పు జరుగుతుండడంతో టీచర్ల కౌన్సెలింగ్ మరింత ఆలస్యమవుతూవచ్చింది. ప్రభుత్వ తాజా ఉత్తర్వుల ప్రకారం జిల్లాలో మూతపడే పాఠశాలల సంఖ్య లెక్క తేలింది. దీంతో టీచర్ల సీనియారిటీ జాబితాతో పాటు కౌన్సెలింగ్ షెడ్యూలును కూడా ప్రకటించేందుకు మార్గం సుగమమయ్యింది. విద్యాశాఖ అధికారులు ఈనెల 15వ తేదీవరకు షెడ్యూలును ఖరారు చేస్తూ విద్యాశాఖ కమిషనర్ సంధ్యారాణి అనుమతి కోసం పంపారు. అయితే మొదటివారంలోగానే పూర్తిచేయాలంటూ వాటిని ఆమె సవరించి పంపారు. దీంతో మంగళవారం ప్రారంభమైన ఫిజికల్ డైరెక్టర్లతో ప్రారంభమైన కౌన్సెలింగ్ ఈనెల 8వతేదీన ముగిసే విధంగా షెడ్యూలును ఖరారు చేస్తూ కమిషనర్‌కు పంపారు. కమిషనర్ ఓకే అంటే ఈ షెడ్యూలు ప్రకారమే కౌన్సెలింగ్ జరుగుతుంది. లేదంటే స్వల్ప మార్పులు చోటు చేసుకునే అవకాశముంటుంది.

చిత్తూరులోని నాలుగు కేంద్రాల్లో 8వరకు కౌన్సెలింగ్

జిల్లావ్యాప్తంగా 10,200 మంది టీచర్లు బదిలీలకు అర్హులు కావడంతో వీరందరి కౌన్సెలింగ్ ప్రక్రియ వీలైనంత త్వరగా ముగించాలని విద్యాశాఖ కమిషనర్ ఆదేశించడంతో చిత్తూరులోనే నాలుగు చోట్ల కౌన్సెలింగ్‌ను నిర్వహించే విధంగా ప్రణాళికలను తయారు చేస్తున్నారు.మంగళవారం ఫిజికల్ డైరెక్టర్ల కౌన్సెలింగ్‌ను డీఈవో కార్యాలయంలో నిర్వహించారు.

బుధవారం స్కూల్ అసిస్టెంట్స్(బయాలజికల్ సైన్స్, ఫిజికల్ సైన్స్, సోషల్ స్టడీస్)కు బాలాజీ కాలనీలోని మున్సిపల్ హైస్కూల్‌లోరెగ్యులర్, అడ్‌హక్ హెచ్ఎంలకు పీసీఆర్ ప్రభుత్వ పాఠశాలలో, స్కూల్ అసిస్టెంట్స్ (మ్యాథ్స్)కు పర్షన్ హైస్కూల్‌లో కౌన్సెలింగ్ నిర్వహిస్తారు.గురువారం స్కూల్ అసిస్టెంట్స్(హిందీ)కు బాలాజీ కాలనీలోని మున్సిపల్ హైస్కూల్‌లో, స్కూల్ అసిస్టెంట్స్ (ఉర్దూ, తమిళం, సంస్కృతం)కు డీఈవో ఆఫీస్‌లో,స్కూల్ అసిస్టెంట్స్(తెలుగు, ఇంగ్లీషు)కు పీసీఆర్ హైస్కూల్‌లో కౌన్సెలింగ్ నిర్వహిస్తారు.శుక్రవారం వరలక్ష్మీవ్రతం కావడంతో ఆ రోజు పదోన్నతి పొందిన భాషా పండితులకు డీఈవో కార్యాలయంలో నిర్వహించాల్సిన కౌన్సెలిం గును మంగళవారం అంటే 8వ తేది నిర్వహించనున్నారు. 5వ తేది ఎల్ఎఫ్ ఎల్‌హెచ్ఎంలకు, పీఈటీలకు, ఎల్‌పీలకు(తెలుగు, హిందీ, ఉర్దూ, తమిళం) డీఈవో కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తారు.ఎస్‌జీటీ(తెలుగు)లకు పర్షన్ హైస్కూల్‌లో నిర్వహిస్తారు. 6, 7 తేదీల్లో ఎస్‌జీటీ(తెలుగు, ఉర్దూ, తమిళం)లకు పర్షన్ హైస్కూల్‌లో కౌన్సెలింగ్ జరుగుతుంది.

రేషనలైజేషన్ ప్రక్రియ త్వరగా పూర్తి చేయండి : డీఈవో

రేషనలైజేషన్ ప్రక్రియను త్వరగా పూర్తిచేయాలని ఇన్‌చార్జి డీఈవో శామ్యూల్ ఆదేశించారు. తన కార్యాలయంలో అన్ని సెక్షన్ల సిబ్బందితో ఆయన మంగళవారం సమావేశమయ్యారు.జిల్లాలో మొన్నటి వరకు 51 పాఠశాలలు మూతపడే స్థితిలో వుండగా మంత్రి, కలెక్టర్ చొరవతో 38కి తగ్గాయన్నారు. ఇదివరకే జీరో శాతం హాజరుతో మూతపడిన ప్రాథమిక పాఠశాలలు 8 వుండగా ప్రాథమికోన్నత పాఠశాలలు 27, ఉన్నత పాఠశాలలు మూడు మొత్తం 38 మూతపడనున్నాయని వివరించారు. ఈ మార్పుల వల్ల కొత్తగా 200 మంది టీచర్లు రేషనలైజేషన్ కింద బదిలీలకు అర్హత పొందనున్నారన్నారు. అయితే వారందరినీ ప్రభుత్వం అనుమతించిన తర్వాతే జాబితాలో చేర్చాలని సూచించారు.జాబితా తయారీలో తేడాలొస్తే అంతా ఇబ్బంది పడాల్సివస్తుందని, అప్రమత్తంగా వుండాలని హెచ్చరించారు.

ఉమామహేశ్వర్‌కు వీలైనంత సాయం: కలెక్టర్

చిత్తూరు టౌన్: పెన్షన్ మంజూరు చేయలేదని వేదనకు గురై కలెక్టరేట్ భవనంపై నుంచీ సోమవారం సాయంత్రం కిందకు దూకేసి గాయపడ్డ పాలకూరి ఉమామహేశ్వర్‌కు ప్రభుత్వం తరపున అన్నివిధాలా సాయం చేస్తామని కలెక్టర్ ప్రద్యుమ్న తెలిపారు. మంగళవారం చిత్తూరులో కలెక్టర్ మీడియాతో మాట్లాడారు. ఆత్మహత్యలతో సమస్యలు పరిష్కారం కావన్న విషయాన్ని అందరూ గుర్తించాలని సూచించారు. గుర్రంకొండ మండలానికి చెందిన ఉమామహేశ్వర్ ఆత్మహత్యకు ప్రయత్నించడం కూడా క్షణికావేశంతోనే అన్నారు. గ్రామ , మండల, డివిజన్ స్థాయిల్లో సమస్యలు పరిష్కారం కాని పక్షంలో ప్రజలు నేరుగా తనను కలవవచ్చన్నారు. ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే గ్రీవెన్స్‌సెల్‌కు సుమారు 800 నుంచి 1000 మంది వరకు ప్రజలు వివిధ సమస్యలతో అర్జీలు సమర్పిస్తుంటారని, ఇలాంటి తరుణంలో అందరికి న్యాయం చేయలేకపోతున్నామన్నారు. అంతమాత్రాన సమస్యలు పరిష్కారం కావనే అభిప్రాయానికి ఎవరూ రాకూడదని సూచించారు.

సగం ధరకే అంటూ కుచ్చు టోపీ

రూ. కోటిన్నరకు పైగా వసూలు ● ఉడాయించిన దుకాణదారులు

సత్యవేడు: సగం ధరకే గృహోపకరణాలు అందిస్తామని 27 రోజులుగా నమ్మించి రూ.కోటిన్నరకు పైగా వసూలు రాత్రికిరాత్రే బోర్డు తిప్పేశాడు ఓ దుకాణదారుడు. ఈ సంఘటన సత్యవేడు పట్టణంలో మంగళవారం వెలుగు చూసింది. రెండు రోజులుగా దుకాణం తెరవకపోడంతో పోవడంతో గృహోపకరణాకు డబ్బు చెల్లించిన బాధితులు దుకాణం వద్ద గుమి గూడారు.

తమిళనాడుకు చెందిన కొందరు పట్టణంలోని మస్తాన్ కాంప్లెక్స్‌లో గృహోపకరణాల దుకాణాన్ని ప్రారంభించారు. ఇందులో టీవీలు, ఫ్రిజ్‌లు, వాషింగ్ మెషీన్లు, ఎల్ఈడీ టీవీలు, సెల్‌ఫోన్లు, డబుల్ కాట్ బెడ్లు, బీరువాలు తదితరాలను 40 శాతం ధరలకే అందిస్తామని పేర్కొన్నారు. దీంతో మండల పరిధిలోని వందలమంది నిర్వాహకులకు గృహోపకరణాలకు నగదు చెల్లించారు. వారికి ఆగస్టు 1నుంచి సంబంధిత వస్తువులను అందిస్తామని రసీదులు ఇచ్చారు. తమ దుకాణం


దుకాణం వద్ద ఎస్ఐతో గోడు వెల్ల బోసుకుంటున్న బాధితులు

సోమవారం అంటే జూలై 31న ఉండదని చెప్పారు. ఈక్రమంలో 1న మంగళవారం కూడా దుకాణం తెరవక పోవడం, దీనికి తోడు వారు ఇచ్చిన రసీదులో మొబైల్ నెంబర్లు పనిచేయక పోవడంతో నగదు చెల్లించిన వారందరూ దుకాణం వద్ద చేరుకున్నారు. సత్యవేడు దళిత వాడకు చెందిన ఓ మహిళ తన కుమార్తె వివాహం సందర్భంగా గృహోపకరణాలకు రూ.1.8 లక్షలు చెల్లించినట్టు లబోదిబోమంది. దీనిపై స్థానిక పోలీస్ స్టేషన్ లో వందల సంఖ్యలో ఫిర్యాదులు అందుతున్నాయి. ఎస్ఐ మల్లేష్ యాదవ్ సిబ్బందితో దుకాణం వద్దకు చేరుకుని నగదు చెల్లించిన వారి నుంచి వివరాలను సేకరించారు. విచారణ అనంతరం కేసు నమోదు చేస్తామన్నారు.

తిరుమల ఘాట్‌లో బస్సును ఢీకొన్న కారు

10 మంది ప్రయాణికులకు స్వల్ప గాయాలు

తిరుమల: తిరుమల రెండో ఘాట్‌లో మంగళవారం ఆర్టీసీ బస్సును ఓవర్‌టేక్ చేయబోయిన కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో 10 మంది ప్రయాణికులు స్వల్పంగా గాయపడ్డారు. తిరుపతి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఉదయం ఐదు గంటలకు ప్రయాణికులతో తిరుమలకు బయల్దేరింది. 12వ మలుపు వద్ద ఓ కారు ఓవర్‌టేక్ చేయబోయి అతివేగంగా బస్సును వెనుక వైపున ఢీకొంది. దీంతో కారు ముందు టైరు బరెస్ట్ కావటంతో ఆగిపోయింది.ఆర్టీసీ బస్సు మాత్రం అదుపుతప్పి పక్కనే ఉన్న చెట్టును ఢీకొంది.దీంతో బస్సులోని 10 మంది ప్రయాణికులు గాయపడ్డారు. గాయపడిన వారిలో


ముందుభాగం ధ్వంసమైన బస్సు

భక్తులతోపాటు ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు ఉన్నారు. వీరిని తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించి వైద్యం చేశారు.

మేయర్ దంపతుల హత్యకేసు 18కి వాయిదా

చిత్తూరు లీగల్: మేయర్ దంపతుల హత్య కేసును 9వ కోర్టు జడ్జి కపర్ధి ఈనెల 18కి వాయిదా వేశారు.మేయర్ దంపతులు కటారి అనురాధ, కటారి మోహన్ ఏడాదిన్నర క్రితం హత్యకు గురయ్యారు. ఈ ఘటనపై వన్‌టౌన్ పోలీసులు చింటూతో పాటు మరో 22 మం దిపై కేసు నమోదు చేసింది. ఇందులో 18 మందికి హైకోర్టు షరతుల తో కూడిన బెయిలు మంజూరు చేసింది.మిగిలిన వారు రిమాండ్‌లో ఉన్నారు. ఈ కేసు మంగళవారం 9వ కోర్టులో విచారణకు రాగా, నిందితులు నలుగురు హాజరుకాలేదు. దీంతో ఈనెల 18కి వాయిదా వేసినట్టు జడ్జి కపర్ధి తెలిపారు.

తిరుమలలో దొంగ అరెస్టు

● ఇన్నోవా కార్ల అద్దాలు పగులగొట్టి రెండేళ్లుగా చోరీలు
● కారు, 39 గ్రాముల బంగారు, రూ.12వేల స్వాధీనం



నిందితుడు వినోద్‌కుమార్ - పోలీసులు స్వాధీనం చేసుకున్న నగదు, బంగారు, సెల్‌ఫోన్

తిరుమల: తిరుమలలోని వాహనాల పార్కింగ్‌లో ఉన్న ఇన్నోవా కార్ల అద్దాలు పగులగొట్టి చోరీలకు పాల్పడుతున్న దొంగను తిరుమల క్రైం పోలీసులు అరెస్ట్ చేశారు. అతడి నుంచి కారు, 39 గ్రాముల బంగారు, రూ.12 వేలను స్వాధీనం చేసుకున్నారు. క్రైం సీఐ తులసీరామ్ మంగళవారం మీడియాకు వివరాలను తెలిపారు. తిరుపతిలోని కట్టకిందపల్లెకు చెందిన బి.వినోద్‌కుమార్ ఎనిమిదేళ్లుగా ట్యాక్సీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. వ్యసనాలకు బానిసవడంతోపాటు విలాసవంతమైన జీవితం కోసం చోరీలు మొదలు పెట్టాడు. డ్రైవర్ కావడంతో రూ.300 ఆన్‌లైన్ దర్శన భక్తులు తమ వాహనాలను పార్కింగ్ చేసే ఏటీసీ, మ్యూజియం, ఎంబీసీ-34 ప్రాంతాలను ఎంచుకున్నాడు. ఈ పార్కింగ్ ప్రదేశాల్లో ఇన్నోవా కార్ల పక్కనే ఏదో ఒక ట్యాక్సీని అద్దెకు తీసుకొచ్చి పార్కు చేసేవాడు. తన వాహనాన్ని పరిశీలిస్తున్నట్టు నటిస్తూ భక్తులకు సంబంధించిన ఇన్నోవా కారు సైడ్ మిర్రర్ వద్ద ఉన్న చిన్న అద్దాన్ని స్క్రూ డ్రైవర్‌తో పగులగొట్టి చోరీలు చేయటం ప్రారంభించాడు. ఇలా రెండేళ్లుగా సుమారు 15 నుంచి 20 చోరీలకు పాల్పడి నగదు, బంగారు అపహరించుకెళ్లాడు. కొద్ది రోజులుగా ఇన్నోవా కార్లలోనే చోరీలు జరుగుతుండటంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ప్రత్యేక నిఘా పెట్టి వినోద్‌కుమార్‌ను మంగళవారం అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి ఓ కారును, 39 గ్రాముల బంగారు, సెల్‌ఫోన్, రూ.12వేలను స్వాధీనం చేసుకున్నారు.అలాగే దొంగతనాల్లో లభించిన విదేశీ కరెన్సీ సుమారు రూ.2లక్షల వరకు హైదరాబాద్ శంషాబాద్‌లోని కరెన్సీ ఎక్స్ఛేంజ్ సంస్థ ద్వారా మార్చినట్టు విచారణలో తేలింది.

నిందితుడిని పట్టుకోవటంతో ప్రతిభ చూపిన కానిస్టేబుల్ రామచంద్రారెడ్డికి సీఐ రూ.5వేల నగదు రివార్డును ప్రకటించారు. అలాగే సీఐ తులసీరామ్, ఎస్ఐలు రమేష్, శివాజీలను పోలీసు ఉన్నతాధికారులు అభినందించారు.

తాళాలు పగులగొట్టి ఇంట్లో చోరీ

రూ.4లక్షల బంగారు నగలు, నగదు అపహరణ

మదనపల్లె అర్బన్: గుర్తుతెలియని దుండగులు తాళాలు పగులగొట్టి ఇంట్లోకి చొరబడ్డారు. ఇంట్లో బీరువా ధ్వంసం చేసి అందులో వున్న రూ.4లక్షలు విలువ చేసే బంగారు ఆభరణాలు, నగదు అపహరించుకుపోయారు. ఈసంఘటన సోమవారం రాత్రి మదనపల్లెలో జరిగింది. పట్టణ శివారులోని అమ్మచెరువు మిట్టకు చెందిన కె.మల్లికార్జుననాయుడు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారు. ఆయన తల్లి నారాయణమ్మ సోమవారం అనారోగ్యంతో మృతిచెందడంతో స్వగ్రామం ములకలచెరువు మండలం చౌడసముద్రం పంచాయతీ చుంచువారిపల్లెకు వెళ్లారు. ఇదే అదనుగా భావించిన దొంగలు అదేరోజు రాత్రి ఇంటి తాళాలు పగులగొట్టి లోనికి ప్రవేశించారు. ఇంట్లో బీరువా ధ్వంసం చేసి నగలు, నగదు అపహరించుకుపోయారు. కాగా మంగళవారం ఉదయం వీరంతా ఇంటికి చేరుకున్నారు. ఇంటి తలుపులు తెరిచే ఉండటం..ఇంట్లోని సామగ్రి చిందరవందరగా పడేసి ఉండటం, బీరువా తెరిచి ఉండటాన్ని గమనించారు. బీరువాలోని 100గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.లక్ష నగదు చోరీకి గురైనట్లు గుర్తించి టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. చిత్తూరు నుంచి క్లూస్‌టీం సిబ్బంది వచ్చి వేలిముద్రలు సేకరించారు.పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



దుండగులు తెరిచివుంచిన బీరువా - ఇంట్లో చిందరవందరగా పడివున్న సామగ్రి

ఏనుగు దాడిలో ఇల్లు ధ్వంసం

పలమనేరు : పలమనేరు మండలం ఇందిరానగర్ కాలనీ వద్ద మంగళవారం తెల్లవారుజామున ఓ ఏనుగు దాడి చేయడంతో చంద్రశేఖర్ అనే రైతుకు చెందిన ఇల్లు ధ్వంసమైంది.ఇందిరానగర్ కాలనీ సమీపంలోని అటవీ ప్రాంతం నుంచి వచ్చిన ఏనుగు చంద్రశేఖర్ ఇంటిని ధ్వంసం చేసి ఇంట్లోని బియ్యం, గడ్డి స్వాహా చేసి వెళ్లిపోయింది. ఇంటి పైకప్పుకు వేసిన సిమెంటు షీట్లను సైతం ధ్వంసం చేసింది. మంగళవారం ఉదయం చంద్రశేఖర్ పొలం వద్ద ఉన్న ఇంటికి వెళ్లి చూడగా పైకప్పు ధ్వంసం కావడంతో రైతు చంద్రశేఖర్ తీవ్ర ఆవేదనకు గురయ్యాడు.


ఏనుగు దాడిలో ధ్వంసమైన ఇల్లు

బెల్టుషాపు నిర్వాహకుడి అరెస్టు

చంద్రగిరి: చంద్రగిరి మండలం ఎం.కొత్తపల్లెలో బెల్టు షాపు నిర్వహిస్తున్న వెంకటేష్‌ని మంగళవారం రాత్రి స్పెషల్ బ్రాంచ్ పోలీసులు అరెస్టు చేశారు. కొన్ని రోజులుగా ఇతడు బెల్టుషాపు నిర్వహిస్తున్నట్లు స్పెషల్ బ్రాంచ్ పోలీసులకు సమాచారం అందింది. దీంతో మంగళవారం రాత్రి వీరు వెంకటేష్ షాపులో దాడులు చేయగా 20 మద్యం సీసాలు దొరికాయి. దీంతో వెంకటేష్‌ని అరెస్ట్ చేసి పోలీసులకు అప్పగించారు.

అమ్మమ్మ ఒడి చేరిన రోహిత్

తిరుమల: తిరుమలలో నాయనమ్మ వదిలేసి వెళ్లిన పసిబిడ్డను మంగళవారం పోలీసులు అమ్మమ్మ ఒడికి చేర్చారు. అనారోగ్యంతో ఉన్నాడనే కారణంతో నాయనమ్మ లక్ష్మి ఏడాదిన్నర వయసున్న రోహిత్‌ను ఆదివారం వేకువజామున రెండు గంటలకు తిరుమలలో వదిలిపెట్టి వెళ్లిన విషయం తెలిసిందే. టీవీల్లో ఈ వార్తను చూసిన అమ్మమ్మ సుమతి సోమవారం తిరుమలకు చేరుకున్నారు. ఆమె నుంచి పూర్తి వివరాలను పోలీసులు సేకరించారు. మంగళవారం ఉదయం తిరుపతి రుయాస్పత్రిలో రోహిత్ ను ఆమెకు అప్పగించారు. మనవడు తన ఒడి చేరడంతో సుమతి ఆనంద భాష్పాలతో పోలీసులకు, మీడియాకు కృతజ్ఞతలు తెలిపారు. కాగా, బిడ్డను తిరుమలలో వదిలిపెట్టి వెళ్లిన వారిని పోలీసులు విచారించనున్నారు.


బిడ్డతో అమ్మమ్మ సుమతి

సప్తగిరి గ్రామీణ బ్యాంకు మార్పు

పాలసముద్రం: మండల కేంద్రమైన పాలసముద్రంలోని సప్తగిరి గ్రామీణ బ్యాంకును స్థానిక బస్‌స్టాప్ వద్ద నూతన భవనంలోనికి మార్చుతున్నట్లు బ్యాంకు మేనేజర్ ప్రభాకరరెడ్డి తెలిపారు. నూతన భవనాన్ని ప్రారంభించడానికి సప్తగిరి గ్రామీణ బ్యాంకు చైర్మన్ సూరిబాబు, రీజినల్ మేనేజర్ జయరామ్‌నాయక్ విచ్చేయనున్నట్లు ఆయన తెలిపారు. బ్యాంకు ఖాతాదారులందరు ఈ విషయాన్ని గుర్తించి సహకరించాలని ఆయన కోరారు. బ్యాంకును బుధవారం ఉదయం 10 గంటలకు ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు.

మరుగుదొడ్ల నిర్మాణాన్ని శరవేగంగా పూర్తి చేస్తాం

గంగాధరనెల్లూరు: మండలంలో మరుగుదొడ్ల నిర్మాణాన్ని వేగవంతంగా పూర్తి చేయించడానికి ప్రత్యేక దృష్టిసారించామని ఎంపీడీవో షైల తెలిపారు. ఆమె మంగళవారం ఆమె మాట్లాడుతూ స్వచ్ఛభారత్‌లో భాగంగా మండలంలోని అగరమంగళం, ఆత్మకూరు, బంగారెడ్డిపల్లె, చిన్నవేపంజేరి, కలిజవేడు, కొత్తవెంకటాపురం, కొట్రకోన, మహదేవమంగళం, పాపిరెడ్డిపల్లె, వేపంజేరి పంచాయతీలను ఓడీఎఫ్ (ఓపెన్ డెఫికేషన్ ఫ్రీ) కింద ఎంపిక చేశామన్నారు. ఇప్పటికే పాతపాళ్యంలో ఇంటింటికీ మరుగుదొడ్ల నిర్మాణం పూర్తిచేసి ఓడీఎఫ్ పంచాయతీగా ప్రకటించామన్నారు. జూలైకు మాత్రం స్పెషల్ క్యాంపెయిన్‌తో బెంచ్ మార్క్ దాటి నిర్ణయాలద్వారా 406 మరుగుదొడ్ల నిర్మాణం లక్ష్యంకాగా 126 పూర్తిచేశామశామన్నారు. ఉపాధి పథకం ద్వారా 900 మందికి మరుగుదొడ్లు నిర్మించాలని లక్ష్యం నిర్ణయించుకొన్నామన్నారు. జూలైకు మాత్రం 225 మరుగుదొడ్ల నిర్మాణం పూర్తి చేశామన్నారు.

రైతు ఆర్థికాభివృద్ధే లక్ష్యం



రైతులకు ఎరువుల పంపిణీ

గుడిపాల: రైతు ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని జడ్పీటీసీ సుమతి, ఎంపీపీ దీపాశ్రీ అన్నారు. రైతులకు ఎరువులు, టార్పాలిన్లు వారు మంగళవారం అందజేశారు. వ్యవసాయాధికారి హిమబిందు పాల్గొన్నారు.

యాదమరి ఎంపీడీవోగా పారిజాతం



పారిజాతాన్ని అభినందిస్తున్న సిబ్బంది

యాదమరి: యాదమరి ఎంపీడీవోగా పారిజాతం నియమితులయ్యారు. ఇక్కడ సూపరిండెంటెంట్‌గా పనిచేస్తున్న మూడేళ్లుగా ఇన్‌చార్జి ఎంపీడీవోగా వ్యవహరిస్తున్నారు. పదో న్నతిపై ఎంపీడీవోగా నియమిస్తూ జడ్పీ సీఈవో రవికుమార్‌నాయుడు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆమెను కార్యాలయ సిబ్బంది, మండల ప్రముఖులు అభినందించారు.









గుడిపాల మండలం నరహరిపేట పాఠశాలలో పిల్లలకు వ్యాక్సిన్ వేస్తున్న డీఎంహెచ్‌వో విజయగౌరి - యాదమరిలో టీకా కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ రాధమ్మ - పెనుమూరులో వ్యాక్సిన్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ హరిబాబు, జడ్పీటీసీ రుద్రయ్య నాయుడు - తవణంపల్లెలో టీకాల కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ సరళకుమారి

ఎంఆర్ వ్యాక్సిన్ తో పిల్లల ఆరోగ్యానికి రక్షణ

గుడిపాల: ప్రాణాంతకమైన తట్టు, రూబెల్లాల వ్యాధుల నుంచి పిల్లలను ఎంఆర్ వ్యాక్సిన్ వేయించి ఆరోగ్యాన్ని రక్షించవచ్చని డీఎంహెచ్‌వో విజయగౌరి అన్నారు. మండలంలోని నరహరిపేట హైస్కూల్లో ఎంఆర్ వ్యాక్సిన్ కార్యక్రమాన్ని ఆమె మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎంఆర్ వ్యాక్సిన్‌ను 9 నెలల నుంచి 15 సంవత్సరాలలోపు చిన్నారులకు తప్పక వేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు లావణ్య, సీహెచ్‌వో నరసింహమూర్తి, సూపర్‌వైజర్ పెరుమాళ్, వైద్య సిబ్బంది వెంకటరామరాజు, ద్రాక్షాయణి, శాంతి, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

యాదమరిలో 948 మందికి ఎంఆర్ టీకాలు

యాదమరి: మండలంలోని పాఠశాలల్లో 948 మందికి ఎంఆర్ టీకాలు వేశామని యాదమరి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ తనూజ తెలిపారు. టీకాలు వేసే కార్యక్రమాన్ని ఎంపీపీ రాధమ్మ మంగళవారం ప్రారంభించారు. మొదటి రోజు మండలంలో 1078 మంది పిల్లలకు ఎంఆర్ టీకాలు వేయాలని నిర్ణయించగా 948 మందికి వేశమని డాక్టర్ తనూజ చెప్పారు.

ఎంఆర్ వ్యాక్సిన్ విధిగా వేయించండి

పెనుమూరు: ఎంఆర్ వ్యాక్సిన్‌ను 9 నెలల నుంచి 15 ఏళ్ల పిల్లలందరికీ విధిగా వేయించాలని ఎంపీపీ హరిబాబు నాయుడు, జడ్పీటీసీ రుద్రయ్య నాయుడు సూచించారు. పెనుమూరు అంగన్‌వాడీ కేంద్రంలో వ్యాక్సిన్ వేసే కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. సర్పంచ్ కృష్ణమూర్తి నాయుడు, పీహెచ్‌సీడీ చైర్మన్ పరమేశ్వరరెడ్డి, వైద్యాధికారి కె.విజయకుమార్, ఎంపీడీవో పార్వతమ్మ పాల్గొన్నారు.

తవణంపల్లెలో 843 మంది వ్యాక్సిన్

తవణంపల్లె : మండలంలో 8 కేంద్రాల్లోలో 843 మంది పిల్లలకు వ్యాక్సిన్ వేశామని మండల వైద్యాధికారి దిలీప్ కుమార్ తెలిపారు. కార్యక్రమాన్ని దిగువతడకర ప్రాథమిక పాఠశాలలో ఎంపీపీ సరళకుమారి ప్రారంభించారు. గిరిబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దామలచెరువులో 1400 మందికి వ్యాక్సిన్

దామలచెరువు: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఎంఆర్ టీకా కార్యక్రమాన్ని పాకాల ఎంపీపీ చాముండేశ్వరి, జడ్పీటీసీ సురేశ్ ప్రారంబించారు. 1400 మంది పిల్లలకు టీకాలు వేసినట్లు వైద్యాధికారి కృష్ణచైతన్య తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పురుషోత్తం, పీహెచ్‌సీ చైర్మన్ చలపతి, ఎంపీహెచ్‌ఈవో శ్రీధర్, హెచ్ఎం శివశంకర్, జగన్మోహన్‌రావు, వెంకటసిద్ధులు, విజయాఈశ్వర్‌నాయుడు, రఫి, వెంకటరమణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఐరాలలో..

ఐరాల: ఎంఆర్ వ్యాక్సిన్‌తో చిన్నారులకు వ్యాధులు దూరమవుతాయని జిల్లా టీబీ నివారణాధికారి రమేశ్, జడ్పీటీసీ లత, ఎంపీపీ శాంతమ్మ అన్నారు. ప్రతి ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులకు వ్యాక్సిన్ వేశారు. కాణిపాకం సర్పంచ్ మధుసూదనరావు, డాక్టర్లు లీలా, వినిలా, శ్రీనివాస్, ఆసుపత్రి చైర్మన్ లక్ష్మణ్,ఆరోగ్య సిబ్బంది ఈశ్వరయ్య, శివయ్య, సిరాజ్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాలసముద్రంలో..

ఎంఆర్ వ్యాక్సిన్‌ను పాలసముద్రం మండలంలోని పాఠశాలలో విద్యార్థులకు వేశారు. జడ్పీటీసీ చిట్టిబాబు, డాక్టర్ వినాయకబాబు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

పాకాలలో..

పాకాల: ఎంఆర్ వ్యాక్సిన్‌ను పిల్లలకు తప్పక వేయించాలని ఎంపీపీ చాముండేశ్వరి అన్నారు. పీహెచ్‌సీలో ఎంఆర్ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ కనకరాజన్, డాక్టర్ సురేఖ తదితరులు పాల్గొన్నారు.



దామలచెరువులో ఎంఆర్ టీకా కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ చాముండేశ్వరి, జడ్పీటీసీ సురేశ్



పాలసముద్రం పాఠశాలలో వ్యాక్సిన్ వేస్తున్న డాక్టర్ వినాయకబాబు



కాణిపాకంలో వ్యాక్సిన్ వేస్తున్న వైద్యులు

పూతలపట్టులో..

పూతలపట్టు :మండలకేంద్రమైన పూతలపట్టు ఉన్నత పాఠశాలలో రూబెల్లా మీజెల్స్ కార్యక్రమాన్ని ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ మురళీ నాయుడు, డాక్టర్లు పద్మజ, జశ్వంత్ ప్రారంభించారు. కార్యక్రమంలో సిబ్బంది మునిరత్నం, మోహన్ శెట్టి, చిన్నమ్మ పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి



వార్డెన్ హేమలతకు ఇన్వర్టర్ అందజేస్తున్న సీఐ చంద్రశేఖర్

గంగాధరనెల్లూరు: విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని సీఐ చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. గంగాధరనెల్లూరు బాలికల హాస్టల్‌ను ఎస్పీ రాజశేఖర్‌బాబు సూచన మేరకు ఎస్ఐ విశ్వనాథరెడ్డి దత్తత తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ మంగళవారం హాస్టల్‌కు రూ.30వేలు విలువ చేసే ఇన్వర్టర్‌ను ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్నామని విద్యార్థులు బాధపడకూడదని, కష్టపడి చదివి తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచిపేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో వార్డెన్ హేమలత తదితరులు పాల్గొన్నారు.

‘రైతుల సేవలో రెవెన్యూ శాఖ’ కార్యక్రమం ప్రారంభం



డీకే చెరువు గ్రామంలో రైతుల సమస్యలు వింటున్న తహసీల్దార్

యాదమరి: ‘రైతుల సేవలో రెవెన్యూ శాఖ’ కార్యక్రమానికి తహసీల్దార్ రె డ్డెప్ప శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలో మండలంలోని డీకే చెరువు గ్రామంలో ఆయన మంగళవారం పర్యటించి రైతుల సమస్యల్ని అడిగి తెలుసుకున్నారు. ఐదుగురు రై తులకు పట్టాదార్ పాసుపుస్తకాలకు దరఖాస్తు చేసుకోవాలని, ఇద్దరికి భూమి సర్వే చేసుకోవాలని సూచించారు. డీకేటి భూములు అమ్మిన వారిపై చట్ట రీత్యాచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వారానికి ఒక రోజు ఒక రెవెన్యూ గ్రామంలో కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ ప్రవీణ్‌కుమార్, సర్వేయర్ రవి, వీఆర్వోలు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

చిత్తూరులో వడ్డెర సంక్షేమ సంఘం కార్యాలయం ప్రారంభం

చిత్తూరు క్రైం: జిల్లా కేంద్రంలో జిల్లా వడ్డెర సంక్షేమ సంఘం జిల్లా కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ట్లు ఆసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రవీంద్రరాజు చెప్పారు. ప్రెస్‌క్లబ్‌లో ఆయన మంగళవారం మాట్లాడారు. జిల్లాలోని వడ్డెరుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామన్నారు. ఈనెల 4న గిరింపేటలోని పాత కలెక్టర్ కార్యాలయం ఎదురుగా వున్న మునిసిపల్ కాంప్లెక్స్‌లో కార్యాలయం ప్రారంభోత్సవం జరుగుతుందన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వడ్డెర ఫెడరేషన్ రాష్ట్ర చేర్మన్ రేవళ్ళ మురళి, రాష్ట్ర డైరెక్టర్లు హాజరవుతారని తెలిపారు. ఈసందర్భంగా రైల్వే స్టేషన్ నుంచి గిరింపేట వరకు బైక్ ర్యాలీ నిర్వహిస్తారని చెప్పారు. విలేకరుల సమావేశంలో నాయకులు సెందిల్, రుద్రయ్య, హరి, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న రవీంద్రరాజు

మహిళలు ఆభరణాలు జాగ్రత్తగా భద్రపరుచుకోవాలి

చిత్తూరు అర్బన్: మహిళలు ఆభరణాలను ఇళ్ళలో జాగ్రత్తగా భద్రపరుచుకోవాలని క్రైం డీఎస్పీ రామకృష్ణ మంగళవారం ఓ ప్రకటనలో సూచించారు. శ్రావణ మాసంలో లక్ష్మీ దేవి విగ్రహాన్ని బంగారు ఆభరణాలతో అలంకరించి వారం రోజుల పాటు పూజలు నిర్వహిస్తారు. నిర్లక్ష్యంగా ఉన్న మహిళలు ఇళ్ళను దొంగలు గుర్తించి ఆభరణాల అపహరించిన సంఘటనలు ఇటీవల జిల్లాలో కొన్ని చోట్ల చోటు చేసుకున్నాయని తెలిపారు. అనుమానితులు సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

సబ్సిడీ రుణాలను సద్వినియోగం చేసుకోండి

చిత్తూరు కల్చరల్: ప్రభుత్వం అందించే సబ్సిడీ రుణాలను సద్వినియోగం చేసుకోవాలని జడ్పీ చైర్‌పర్సన్ గీర్వాణి సూచించారు. సబ్సిడీ రుణాలపై ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన అవగాహనా సదస్సులో ఆమె మాట్లాడారు. వెనుకబడిన తరగతుల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీ రుణాలను అందజేస్తున్నదన్నారు. మండలంలో పంట సంజీవని పనులకు అధిక ప్రాధాన్యమివ్వాలన్నారు. ప్రతి పంచాయతీ వంద మంది కూలీలకు తక్కువ కాకుండా ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులు చేపట్టాలన్నారు. కొన్ని పంచాయతీల్లో కూలీల సంఖ్య తగ్గిందని అధికారులు చొరవచూపాలని ఆమె అన్నారు. మండలానికి మంజూరైన సీసీ రోడ్ల త్వరితగతిన పూర్తిచేయాలని సర్పంచులను, అధికారులను ఆదేశించారు. ఉపాధి హామీ పనులు గ్రామాల అభివృద్ధికి తోడ్పడతాయన్నారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్ళాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు సూచించారు. సదస్సులో ఎంపీడీవో శ్రీనివాసన్, టీడీపీ నేత చంద్రప్రకాశ్, వైస్ ఎంపీపీ రాజేంద్రన్, సర్పంచులు మోహన్ రాజ్, నీలకంఠం నాయుడు, తులసీపతి నాయుడు, రఘు, ఎంపీటీసీ మేషాక్, అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ గీర్వాణి-గాంధీ విగ్రహం వద్ద రోడ్డు పనులను పరిశీలిస్తున్న మేయర్, తదితరులు

రోడ్డు పనుల పరిశీలన

చిత్తూరు రూరల్: నగరంలోని గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన తారురోడ్డు పనులను నగర మేయర్ కటారి హేమలత, కార్పొరేటర్లు మంగళవారం పరిశీలించారు. గాంధీ విగ్రహం సుందరీకరణలో భాగంగా విగ్రహం చుట్టూ తారు రోడ్డు పనులు చేపట్టారు. నాణ్యతలో రాజీపడకుండా పనులు చేయాలని మేయర్ సూచించారు. కార్యక్రమంలో టీడీపీ నేత కటారి ప్రవీణ్, టీపీవో నాగేంద్ర, కార్పొరేటర్ కోలా కిరణ్‌కుమార్, సర్వేయర్ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కోదండరామస్వామికి ప్రత్యేక పూజలు


హోమాలు నిర్వహిస్తున్న రుత్విక్కులు

చిత్తూరు కల్చరల్: నగర రంగాచ్చారి వీధిలో నూతనంగా నిర్మించిన శ్రీకోదండరామస్వామి ఆలయ కుంభాభిషేకంలో భాగంగా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం విఘ్నేశ్వర పూజతో ప్రారంభించి స్వస్తివాచనం, కలశ ఆవానం, కలశ స్థాపన, గణపతి, శ్రీరామరక్ష, నవగ్రహ, అష్టదిక్పాలక హోమాలు నిర్వహించారు. సాయంత్రం తిరుమంజనం చేసి శ్రీరామరక్ష, లక్ష్మి, నారాయణ, శ్రీరామ హోమాలు చేశారు. బుధవారం ఆలయ మహాకుంభాభిషేకం, అన్నదానం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

కంటైనర్ ఢీకొని యువకుడి మృతి


మాధవన్ మృతదేహం

గుడిపాల: మండలంలో సీఎంసీ సమీపంలోని లక్ష్మీపురం వద్ద మోటార్ బైక్‌ను కంటైనర్ ఢీ కొనడంతో మంగళవారం రాత్రి ఓ యువకుడు మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు.. వసంతాపురం గ్రామానికి చెందిన సురేశ్ కుమారుడు మాధవన్ (21), అతని స్నేహితుడు లక్ష్మణుడు సొంత పనుల నిమిత్తం బైక్‌పై చిత్తూరు వెళ్లారు. తిరిగి వస్తుండగా సీఎంసీ సమీపంలోని లక్ష్మీపురం వద్ద వేలూరు నుంచి చిత్తూరు వెళ్తున్న కంటైనర్ వెనుక నుంచి ఢీకొనడంతో మాధవన్ అక్కడికక్కడే మృతి చెందాడు. లక్ష్మణుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పట్టెం జయచంద్రుడుకి డాక్టరేట్



చిత్తూరు రూరల్: నగరంలోని పీవీకే ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకుడు పట్టెం జయచంద్రుడుకి ఎస్వీయూ డాక్టరేట్ ప్రదానం చేసింది. చిత్తూరు కథ(సంకలనం-అనుశీలన) అనే అంశంపై తెలుగు విభాగంలో డాక్టర్ పేట శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షణలో పరిశోధన చేశారు. ఈ సందర్భంగా ఆయన్ని కళాశాల ప్రిన్సిపాల్ ఆనంద రెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

జీవో 279 రద్దు చేసేవరకూ పోరాటం


కాంట్రాక్టు పారిశుద్ధ్య కార్మికుల మానవహారం

చిత్తూరు రూరల్: మున్సిపల్ పారిశుద్ధ్యం కాంట్రాక్టు కార్మికులకు నష్టం కలిగించే జీవో 279ను ప్రభుత్వం రద్దు చేసే వరకు పోరాటం చేస్తామని జిల్లా సీఐటీయూ గౌరవాధ్యక్షుడు ఎస్.నాగరాజన్ హెచ్చరించారు. రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు కార్మికులు చిత్తూరులోని గాంధీ విగ్రహం వద్ద మానవహారం నిర్వహించారు. కాంట్రాక్టు కార్మికులకు నష్టం కలగడమే కాకుండా వీధిపాలు చేసే ప్రమాదకర జీవోను 279ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 151 జీవోను అమలు చేయాలన్నారు. ఏఐటీయూసీ నగర అధ్యక్ష, కార్యదర్శులు వీసీ గోపీనాథ్, ఎం.విజయ్‌కుమార్, ఏఐటీయూసీ నగర కార్యనిర్వాహక అధ్యక్షుడు ఆరుముగం, నాయకులు గణపతి, గజేంద్రబాబు, హెచ్.బాలాజీరావు, వాసు, వీఎన్ వినాయక తదతరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌ను అరికట్టండి

చిత్తూరు సిటీ : కళాశాలల్లో ర్యాగింగ్‌ను అరికట్టాలని వైసీపీ విద్యార్థి విభాగం నాయకులు ప్రభుతేజ, ధరణీశ్ రెడ్డి ఏఎస్పీ రాధిక విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆమెకు వారు మంగళవారం వినతి పత్రం అందజేశారు. 1997లో ర్యాగింగ్ నిరోధక చట్టం పటిష్టంగా అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు జయచంద్ర, సత్తార్, గౌతమ్ పాల్గొన్నారు.

ఇళ్ళ నిర్మాణాల పరిశీలన


ఇళ్ళ నిర్మాణాలను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రీకాంత్

చిత్తూరు లీగల్: ఇందిరమ్మ కాలనీలో చేపట్టిన ఇళ్ళ నిర్మాణాన్ని కార్పొరేటర్ శ్రీకాంత్ మంగళవారం పరిశీలించారు. 1వ డివిజన్ పరిధిలోని పునేపల్లె ఎస్సీ, ఎస్టీ కాలనీలకు 30 ఇళ్ళు ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. వీటిని స్థానిక కార్పొరేటర్ పరిశీలించారు. బిల్లులు సక్రమంగా అందుతున్నాయా లేదా లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు.

యాచకులకు, మతిస్థిమితం లేనివారికి అండ

చిత్తూరు కల్చరల్: నగరంలో యాచకులు మతిస్థిమితం లేకుండా తిరుగుతున్న వారికి అండగా ఉంటామని ఆశ్రమ నిర్వాహకుడు పద్మనాభ నాయుడు అన్నారు. మంగళవారం నగరంలో పలు ప్రాంతాల్లో తిరుగుతున్న యాచకులకు, మతిస్థిమితం లేని వారికి స్నానం చేయించి, గుండు చేయించి, బట్టలు తొడిగి అన్నం పెట్టారు. ఆయన మాట్లాడుతూ ప్రతి మంగళవారం నగరంలోని ఇలా తిరుగుతున్న వారికి గుండ్లు, స్నానం చేయించి భోజనం పెట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా డీఎస్పీ గిరిధర్ ఆయన సిబ్బందితో పాల్గొన్నారు. అలాగే అమ్మఒడి సిబ్బంది పాల్గొన్నారు.


మతిస్థిమితం లేని వ్యక్తికి స్నానం చేయిస్తున్న పద్మనాభ నాయుడు

విలువలు పెరుగుతున్నా రిజిస్ట్రేషన్లకు స్పందన కరువు

వారం రోజుల్లో రాబడి రూ.8.35 కోట్లు మాత్రమే



చిత్తూరు జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయం

చిత్తూరు కలెక్టరేట్: స్థిరాస్తి విలువలు పెరుగుతున్న నేపథ్యంలో జనం క్యూలు కట్టి రిజిస్ట్రేషన్లు చేసుకుంటారన్న ఆశలు అడియాశలయ్యాయి. చివరి రోజైన సోమవారం ఒక్కరోజే 2500 రిజిస్ట్రేషన్లు జరుగుతాయని అధికారులు అంచనావేస్తే వారి అంచనాలను తారుమారు చేస్తూ చివరి వారం అంతా కలిసి కేవలం 2500 రిజిస్ట్రేషన్లు మాత్రమే జరిగాయి. భూమి విలువల పెంపుతో భూములు, స్థలాలు, భవనాలు, ఫ్లాట్ల రిజిస్ట్రేషన్లు అధిక సంఖ్యలో జరగవచ్చని స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ అంచనావేసింది. జిల్లాలోని తిరుపతి శ్రీ బాలాజీ రిజిస్ట్రేషన్ జిల్లాలో తుడా పరిధిలో మార్కెట్ విలువలు 25 శాతం, ఇతర ప్రాంతాల్లో 10-20 శాతం, చిత్తూరు కార్పొరేషన్, శ్రీకాళహస్తి, నగరి, పుత్తూరు, పలమనేరు, పుంగనూరు, మదనపల్లె మున్సిపాలిటీల్లో,గ్రామీణ ప్రాంతాల్లో 5-10 శాతం వరకు పెంచాలని మార్కెట్ వాల్యూ రివిజన్ కమిటీలు తీర్మానించాయి. దీంతో భయపడి పాత విలువలతో భారీగా రిజిస్ట్రేషన్లు చేసుకుంటారని భావించారు. కానీ జూలై 24-31 తేదీల మధ్య రెండు జిల్లాల్లోని 25 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో 7 రోజుల్లో 2500 రిజిస్ట్రేషన్లు మాత్రమే జరిగి రూ.8.35 కోట్లు ఆదాయం ప్రభుత్వ ఖజానాకు సమకూరింది. కాగా గత ఏడాది అనగా 2016 జూలై 24-31 తేదీ మధ్య 1942 రిజిస్ట్రేషన్లు జరగ్గా రూ.6.16 కోట్లు ఆదాయం సమకూరింది. రెండు రిజిస్ట్రేషన్ జిల్లాల్లో 25 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రమారమి రోజుకు 100-150 మధ్య వివిధ రకాల రిజిస్ట్రేషన్లు జరుగుతుంటాయి. ఆ లెక్కన గత వారం రిజిస్ట్రేషన్లు జరిగాయి తప్పితే ఏదో జరుగుతుందని ఆశించిన మేర జరగలేదని రిజిస్ట్రేషన్ అధికారులు అభిప్రాయపడుతున్నారు.

కొత్త ధరలు నమోదు....

మార్కెట్ విలువలు పెంపు, మార్కెట్ వాల్యూ రివిజన్ కమిటీ తీర్మానించి పంపిన ప్రతిపాదనలకు ప్రభుత్వం సోమవారం ఆమోద ముద్ర వేసింది. దాని ప్రకారం మార్కెట్ విలువల సవరణ కమిటీల ఆమోద ముద్రతో పెరిగిన స్థిరాస్తి విలువలను స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు కంప్యూటర్ ఎయిడెడ్ అడ్మినిస్ట్రేషన్ ఆఫ్ రిజిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్(కార్డ్)లో సోమవారం రాత్రి నమోదు పూర్తిచేసారు. మంగళవారం నుంచి పెరిగిన విలువల వర్తింపు ప్రారంభమైంది.

జేబు దొంగను వెంటాడి పట్టుకున్న టీటీడీ విజిలెన్X్స



భక్తుడికి పర్స్‌ను అప్పగిస్తున్న ఏవీఎస్వో చిరంజీవి

తిరుమల: భక్తుడి వద్ద పర్సును అపహరించుకెళుతున్న జేబు దొంగను టీటీడీ విజిలెన్X్స సిబ్బంది వెంటాడి పట్టుకున్నారు. కర్ణాటకకు చెందిన సిద్ధు అనే భక్తుడు తలనీలాలు సమర్పించటానికి కల్యాణకట్ట వద్దకు వెళ్లాడు. ఆ సమయంలో తమిళనాడు తిరువణ్ణామలైకు చెందిన పట్టాభిరామన్ అనే వ్యక్తి సిద్ధు బ్యాగులోని పర్సును తస్కరించి పరుగు పెట్టాడు. గమనించిన బాధితుడు దొంగా.. దొంగా అంటూ అరిచాడు. అక్కడే విధుల్లో ఉన్న నాలుగో సెక్టార్ విజిలెన్స్ సిబ్బంది వెంటాడి మరీ దొంగను పట్టుకున్నారు. పర్సును ఏవీఎస్వీ చిరంజీవి తిరిగి భక్తుడికి అప్పగించారు. పర్సులో రూ.8వేలు ఉన్నాయని సిద్ధు తెలిపారు.

తాగునీటి సరఫరాలో మహా రింగర్లు!!

ఒక శాతం కూడా కాదు..అంచనా రేటుకే..నెలలోనే రూ.75 లక్షలకు టెండరింగ్

మదనపల్లె: మదనపల్లె మున్సిపాలిటీ నీటి సరఫరాలో కాంట్రాక్టర్లను రింగ్ చేయడం, టెండర్లు పిలవడం, నీటి సరఫరా వరకూ పురపాలిక ఖజానాను దోపిడీ చేస్తున్నారు. నెలకు రూ.60లక్షల నుంచి రూ.75 లక్షల వరకూ కేవలం నీటికే కేటాయిస్తూ..జేబులు నింపుకుంటున్నారు. నీటి కాంట్రాక్టర్లు మహారింగర్లుగా మారిపోయారు. మదనపల్లె మున్సిపాలిటీలో నీటి సరఫరా కాంట్రాక్టర్లు రింగ్..! ఒక శాతం లెస్‌కు టెండర్ కోట్ చేశారంటూ ఆంధ్రజ్యోతిలో మంగళవారం కథనం వెలువడింది. ఒక శాతం కూడా లెస్ వేయలేదు. అంచనా రేటుకే టెండర్లు వేసి, తమకు ఎదురే లేదని నిరూపించారు..రింగర్లు. సాధారణంగా మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు చేపట్టాలన్నా..నీటి సరఫరా చేయాలన్నా.. ఆహ్వానించే టెండర్లలో పోటీ ఉంటుంది. రింగయినా..అదే కాంట్రాక్టర్లు ఒకరికి ఒకరు పోటీ పడినట్లు భావిస్తూ కనీసం టెండర్లు దాఖలు చేయాలి. ఒక పనికి ఒకరే పోటీ పడితే..సింగల్ టెండర్‌గా భావిస్తూ దాన్ని రద్దు చేసి, రెండో సారి టెండర్‌కు వెళ్లడం సహజం. కానీ ఇక్కడ ఒకే సంపునకు ఒకరే పోటీ పడ్డారు..అందులోనూ ఏ మాత్రం లెస్‌కు వేయకుండా అధికారులు నిర్ణయించిన అంచనా రేటుకే టెండర్ కోట్ చేయడం చూస్తే..ఏ స్థాయిలో వ్యూహరచన చేశారో అర్థం చేసుకోవచ్చు.

తొమ్మిది సంపులు..తొమ్మిది మంది కాంట్రాక్టర్లు

మున్సిపాలిటీలోని తొమ్మిది సంపులకు నీటి సరఫరా చేయడానికి 9మంది కాంట్రాక్టర్లు పోటీ పడ్డారు. ఒక్కో సంపును రెండుగా విభజించి రూ.10లక్షల అంచనాతో టెండర్లు పిలిచారు. ఇందులో ఇద్దరు కాంట్రాక్టర్లు రూ.4,98,800 చొప్పున అంచనాతో టెండర్లు దాఖలు చేశారు. కృష్ణానగర్, వడ్డిపల్లె సంపు, అమ్మచెరువుమిట్ట, రామిరెడ్డిలేఅవుట్, రామారావుకాలనీ, పీ అండ్ టీకాలనీ, ఎ.వి.నాయుడు కాలనీ, వారపుసంత, మున్సిపల్ కార్యాలయం సంపులు ఉన్నాయి. మొత్తం రూ.75 లక్షలకు టెండర్లు పిలిచారు. వీరిలో కాంట్రాక్టర్లు ఎం.పుష్పలత, ఆర్.లక్ష్మిపతి నాయుడు, పట్నం ఫజురుల్లా, బి.సందీప్, టి.హరినాథరెడ్డి, బి.శ్రీనివాసులునాయుడు, పి.వేణుగోపాల్, ఆర్.రమేష్‌నాయుడు, ఆర్.నాగరాజులు టెండర్లలో పాల్గొనగా, పీ అండ్ టీ కాలనీ సంపునకు టి.హరినాథరెడ్డి, బి.శ్రీనివాసులునాయుడు పోటీ పడ్డారు. ఇక్కడ పోటీ అనడం కంటే..ఈ సంపును ముందుగా కేటాయించిన బి.శ్రీనివాసులునాయుడుకు కేటాయించగా, ఆయన అందరిలాగే అంచనా రేటుకే టెండర్ కోట్ చేశారు. ఈయనకు తెలియకుండా టి.హరినాథరెడ్డి రంగంలోకి దిగడంతో ఇక్కడే కథ అడ్డం తిరిగింది. బి.శ్రీనివాసులునాయుడు కంటే హరినాథరెడ్డి 12శాతం లెస్‌కు టెండర్ కోట్ చేయగా, టెండర్ ఆయకే దక్కడంతో ఎల్-2 గుత్తేదారుడు ఖంగుతిన్నాడు.



మదనపల్లె మున్సిపల్ కార్యాలయం

రింగ్‌తో మున్సిపల్ ఖజానాకు రూ.5లక్షలు నష్టం

మున్సిపాలిటీకి నీటి సరఫరాలో కాంట్రాక్టర్ల మధ్య పోటీ లేకపోవడంతో మున్సిపల్ ఖజానాకు నెలకు సుమారు రూ.5 లక్షలు నష్టం వాటిల్లుతోంది. ప్రస్తుతం పిలిచిన టెండర్లను పరిశీలిస్తే..ట్యాంకర్ నీటికి ప్రభుత్వం చెల్లిస్తున్న ధర రూ.430. 15 సంపులకు గాను మొత్తం 1160 ట్రిప్పులు నీరు తోలాలని సూచించారు. రింగ్ కాకుండా నీటి సరఫరాకు కాంట్రాక్టర్లు పోటీ పడివుంటే కనీసం ఆరు శాతం లెస్‌కు కోట్ చేసేవారు. కానీ ప్రస్తుతం పోటీ లేకపోవడంతో అంచనా రేటుకే (రూ.430) కోట్ చేశారు. ఆరు శాతం చొప్పున లెక్కిస్తే..ట్రిప్పునకు రూ.30 చొప్పున నీటిని నింపే 15 పనులకు గాను నెలకు సుమారు రూ.5లక్షలు మున్సిపాలిటీకి ఆదాయం వచ్చేది. కాంట్రాక్టర్లను రింగ్ చేయడం ద్వారా ఆ మొత్తాన్ని అటు పాలకులు, ఇటు అధికారులు పంచుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఇది తక్కువ మాత్రమే పీ అండ్ టీ కాలనీ సంపునకు కాంట్రాక్టర్ హరినాథరెడ్డి 12శాతం లెస్‌కు టెండర్ కోట్ చేసినట్లు..మిగిలిన వాటికీ పోటీ పడినట్లు భావిస్తే..పురపాలిక ఖజానాకు నెలకు రూ.10 లక్షలు లాభం వచ్చే అవకాశముంది. రెండు నెలల క్రితం ఇదే మున్సిపాలిటీ సంపులకు నీటి సరఫరాకు ప్రజారోగ్యశాఖ(తిరుపతి) అధికారులు టెండర్లు ఆహ్వానించగా, ఆరు శాతం లెస్‌కు ఇదే కాంట్రాక్టర్లు పోటీ పడగా, అదే సంపులకు, అదే కాంట్రాక్టర్లు మున్సిపల్ అధికారుల ఆధ్వర్యంలో పిలిచిన టెండర్లకు అంచనా రేటుకు టెండర్లు దాఖలు చేయడం చూస్తే..ఏ స్థాయిలో అవినీతి జరిగిందనేది స్పష్టమవుతోంది.

రెయిన్‌గన్ల ద్వారా నీటి సౌకర్యం కల్పిస్తేనే

వేరుశనగను కాపాడుకుంటాం



రెయిన్‌గన్‌లను ఏర్పాటు చేయాలని కలెక్టర్‌ను కోరుతున్న రైతులు

విద్యుదాఘాతానికి మహిళా రైతు మృతి

వెదురుకుప్పం: పొలానికి నీళ్లు పెట్టడానికి వెళ్లిన మహిళా రైతు విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. ఈ సంఘటన వెదురుకుప్పం మండలంలోని తాటిమాకులపల్లెలో జరిగింది. తాటిమాకులపల్లెకు చెందిన జరీనాబీ తన పొలంలో చెరకు సాగు చేస్తోంది. మంగళవారం మోటరు వేయడానికి బోరు బావి వద్దకు వెళ్లింది. స్టార్టర్ బటన్X నొక్కడంతో విద్యుదాఘాతానికి గురై అపస్మారక స్థితికి చేరుకుంది. అటుగా వెళ్తున్న రైతులు గమనించి ఆమెను చికిత్స నిమిత్తం తిరుపతికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మరణించింది. మృతురాలికి భర్త, ముగ్గురు పిల్లలు ఉన్నారు.



జరీనాబీ (పాతచిత్రం)

కలెక్టరు ఎదుట రైతుల ఆవేదన

పెద్దతిప్పసముద్రం/బి.కొత్తకోట: వేరుశనగ ఎండిపోతోంది..ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తే తప్ప పంట కాపాడుకోలేం.. ఇప్పటికైనా రెయిన్X గన్X ల ద్వారా నీటి సౌకర్యం కల్పించాలని కలెక్టరుకు రైతులు మొరపెట్టుకున్నారు. మంగళవారం పీటీఎం మండలంలోని పులికల్లు పంచాయతీ కమ్మవారిపల్లె వద్ద వ్యవసాయ అధికారులు ఏర్పాటు చేసిన రెయిన్X గన్X ను కలెక్టర్ పరిశీలించారు. ఈసందర్భంగా మండలంలో 1500 ఎకరాలు సాగులో ఉందని 75గన్X లు అందుబాటులో ఉన్నాయని ఏవో నవీన్X కుమార్ కలెక్టర్‌కు వివరించారు. దీనిపై కలెక్టర్ మాట్లాడుతూ వారానికి 4500 ఎకరాలు తడిపేలా చర్యలు తీసుకోవాలని ఎన్ని రెయిన్X గన్X లు కావాలన్నా ఏపీఎంఐపీ ద్వారా సమకూరుస్తామన్నారు. ఆర్థిక స్థోమత గల రైతులు రూ.11వేలు సబ్సిడీతో రెయిన్X గన్X లను కొనుగోలు చేసేలా చైతన్యవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ములకలచెరువు మార్కెట్ యార్డులో టమోటా రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని, వందబాక్సులకు 20బాక్సులు కోత విధిస్తున్నారన్నారు. పైగా తక్కువ ధరకు పాడుకుని అందులోనూ పదిశాతం కమీషన్X తీసుకుని రైతులను ముంచుతున్నారని కలెక్టర్‌కు పలువురు వివరించారు. దీనిపై వ్యవసాయ శాఖ, మార్కెటింగ్ జేడీలతో మాట్లాడతారని కలెక్టర్ పేర్కొన్నారు. ఆయన వెంట తహసీల్దార్ హనుమంతు, ఎంపీడీవో వేణయ్య, ఏవో నవీన్X , జేఈలు తిరుపాల్‌నాయక్, షఫావుల్లా, ఈవోఆర్డీ పద్మారాణి, తదితరులు ఉన్నారు.

ఎకరం కూడా ఎండనివ్వం

జిల్లాలోని పడమటి మండలాల్లో వర్షాభావంతో ఎండుతున్న వేరుశనగకు రెయిన్X గన్లతో నీటిని అందించి కాపాడుతామని కలెక్టర్ పీఎస్ ప్రద్యుమ్న పేర్కొన్నారు. ఎక్కడా ఎకరం వేరుశనగను కూడా ఎండనివ్వమని స్పష్టం చేశారు. మంగళవారం బి.కొత్తకోటకు వచ్చిన కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 1.40లక్షల హెక్టార్లలో వేరుశనగ సాగు చేయాలని లక్ష్యం కాగా, అందులో లక్ష హెక్టార్లలో రైతులు వేరుశనగ సాగు చేసినట్లు చెప్పారు. బీడు భూముల్లో కాయ గింజల సాగును ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 10 నుంచి రాగులు, కందులు, జొన్నలు, ఇతర విత్తనాలను సబ్సిడీతో పంపిణీకి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. తహసీల్దార్ కార్యాలయం ప్రహరీగోడకు రూ.16లక్షలు, అదనపు భవనాల పనులకు రూ.14లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట తహసీల్దార్ నరసింహులునాయుడు, ఆర్ఐ లక్ష్మీ, వీఆర్వో, వీఆర్ఏ, భవన నిర్మాణ కాంట్రాక్టర్ పప్పు రాజారెడ్డి, తదితరులు ఉన్నారు.

మంత్రి లోకేశ్ నేతృత్వంలో గ్రామీణాభివృద్ధి జోరు

జడ్పీ చైర్‌పర్సన్ గీర్వాణి

ఆంధ్రజ్యోతి,చిత్తూరు: పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి నారా లోకేశ్ నాయకత్వంలో ఆ శాఖల పనితీరు సమూలంగా మారిపోయిందని, ఆయన చొరవ కారణంగా గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి జోరందుకుందని జడ్పీ ఛైర్‌పర్సన్ శ్రీరామనేని గీర్వాణి అన్నారు. మంగళవారం ఆమె జడ్పీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు.మౌలిక సదుపాయాలపరంగా పట్టణాలు, నగరాలకు తీసిపోకుండా గ్రామీణ ప్రాంతాలు వుండాలనేది లోకేశ్ ఆశయమని, అందుకోసం ఆయన ప్రత్యేకించి కొన్ని అంశాలపై దృష్టి కేంద్రీకరిస్తున్నారని వివరించారు. కేవలం ఆయన చొరవతోనే అందుబాటులో వున్న నిధులలో సింహభాగం గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి కేటాయించడం జరిగిందన్నారు. 14వ ఆర్థిక సంఘం, ఉపాధి హామీ పథకం, పంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్ నిధులలో ఎక్కువ శాతం రోడ్లకే వినియోగిస్తున్నామన్నారు. 5 వేల జనాభా దాటిన ప్రతి గ్రామంలోనూ భూగర్భ మురికినీటి పారుదల వ్యవస్థ ఏర్పాటు చేస్తామన్నారు.దానికోసం ఇప్పటికే ప్రణాళిక రూపొందించామన్నారు. నీరు-ప్రగతి కింద చెరువుల పూడిక తీత, కట్టల పటిష్టీకరణ, తూముల మరమ్మతులు, ఫీడర్ ఛానెళ్ళు, పంట కాలువల పనులను చేపట్టడం జరిగిందని, వీటిని అధికారులు వేగంగా పూర్తి చేయాల్సి వుందన్నారు. వర్షాకాలం మొదలైనందున అధికారులు అటవీ శాఖ యంత్రాంగంతో సంప్రదించి గ్రామ, మండల పరిధిలోని ప్రతి ప్రభుత్వ కార్యాలయం, విద్యాసంస్థల ఆవరణల్లోనూ, అలాగే సీసీ రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటాలని ఆదేశించామన్నారు. ఇన్‌ఛార్జి సీఈవో రవికుమార్ నాయుడు, టీడీపీ నేత ఎస్.చంద్రప్రకాష్ పాల్గొన్నారు.



ఎంపీడీవోలకు నియామక పత్రాలను అందజేస్తున్న గీర్వాణి

8 మందికి ఎంపీడీవోలుగా పదోన్నతి

పంచాయతీరాజ్ శాఖలో ఈవోఆర్డీ, సూపరింటెండెంట్ హోదాల్లో పని చేస్తున్న ఎనిమిదిమందికి ప్రభుత్వం ఎంపీడీవోలుగా పదోన్నతి కల్పించింది. వారికి మంగళవారం జడ్పీ ఛైర్‌పర్సన్ గీర్వాణి వివిధ మండలాలకు కేటాయిస్తూ పోస్టింగు ఉత్తర్వులు జారీ చేశారు. జడ్పీ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న పి.ప్రభాకర్‌రెడ్డిని వి.కోటకు, డి.యుగంధర్‌ను పెద్దమండ్యానికి, తిరుపతి విజిలెన్స్ మానిటరింగ్ సెల్ సూపరింటెండెంట్ ఎస్.ఖలీల్ సాహెబ్‌ను నాగలాపురానికి, సోమల ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ ఎం.శంకరయ్యను చౌడేపల్లెకు, యాదమరి ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ పారిజాతాన్ని యాదమరికి, నారాయణవనం ఎంపీడీవో కార్యాలయం సూపరింటెండెంట్ పి.ఉషాసుందరిని పిచ్చాటూరుకు, మదనపల్లె పంచాయతీరాజ్ ఈఈ కార్యాలయ సూపరింటెండెంట్ కె.బాలగణేష్‌ను విజయపురానికి, బి.కొత్తకోట ఎంపీడీవో కార్యాలయ ఈవోఆర్డీ సి.గంగయ్యను నిమ్మనపల్లె ఎంపీడీవోగా నియమించారు.వీరంతా జడ్పీ ఛైర్‌పర్సన్ గీర్వాణితోపాటు సీఈవో రవినాయుడులను సన్మానించారు.

ఏడుగురికి ప్రధాని సహాయక నిధి నుంచి ఆర్థిక సాయం

ఆంధ్రజ్యోతి - చిత్తూరు: జిల్లాకు చెందిన ఏడుగురికి ప్రధానమంత్రి సహాయక నిధి నుంచి రూ. 10.80 లక్షలు మంజూరైనట్లు ఎంపీ మిథున్ రెడ్డి తెలిపారు. తాను చేసిన అభ్యర్థనకు స్పందించిన ప్రధానమంత్రి ఈ నిధులు మంజూరు చేశారన్నారు.పీలేరు వాసి సుబ్రమణ్యం కుమార్తె బేబీ ధనశ్రీకి కాక్లియర్ ఇంప్లాంట్ సర్జరీ కోసం రూ. 3 లక్షలు, పుంగనూరు మండలం నెల్లూరిపల్లె వాసి కిషన్‌రెడ్డి కుమారుడు మహీధర్‌రెడ్డికి సర్జరీకి రూ.3 లక్షలు, తంబళ్ళపల్లెకు చెందిన పవన్‌కుమార్‌రెడ్డికి అప్లాస్టిక్ అనీమియా కోసం రూ.3 లక్షలు, కురబలకోట మండలం మల్‌రెడ్డిపల్లెకు చెందిన బి.చంద్రశేఖర్‌కు గుండె ఆపరేషన్‌కోసం రూ.50 వేలు, తిరుపతి రూరల్ మండలం తిమ్మినాయుడుపాళెం పంచాయతీ పూలవానిగుంటకు చెందిన కె.స్వాతికి గుండె ఆపరేషన్ కోసం రూ. 50 వేలు, ఎర్రావారిపాళెం మండలం ఎల్లమందకు చెందిన మల్‌రెడ్డి కుమారుడు రాజేష్‌కుమార్‌రెడ్డికి రూ.50 వేలు, గుర్రంకొండ కొత్తపేటవీధికి చెందిన నజీర్ అహ్మద్‌కు రూ.30 వేలు మొత్తం రూ. 10.80 లక్షలు మంజూరయ్యాయని తెలిపారు.

మఠం భూములకు 1బీ సాధ్యం కాదు

పంట రుణాలు రెన్యువల్ అయ్యేలా చూస్తాం - కలెక్టర్ ప్రద్యుమ్న

పెద్దతిప్పసముద్రం: వ్యాసరాయ మఠం భూములు సెటిల్‌మెంటు భూములు కాదు... వాటి వ్యవహారం కోర్టు పరిధిలో ఉన్నందున ఆన్ లైన్ లో 1బి ఇవ్వడం సాధ్యం కాదని కలెక్టర్ ప్రద్యుమ్న స్పష్టం చేశారు. మంగళవారం పీటీఎంకు వచ్చిన కలెక్టర్‌ను కుక్కలపల్లె మఠం భూముల రైతులు కలిశారు. 20ఏళ్ల క్రితమే తాము కొనుగోలు చేసి పట్టాదారు పాసుపుస్తకాలు పొందామని ఇంత కాలం 1బిలు ఇచ్చి ఇప్పుడు ఇబ్బంది పెడుతున్నారని, బ్యాంకులో రుణాలు రెన్యువల్ చేసుకోలేకపోతున్నామని కలెక్టర్‌కు విన్నవించారు. దీనిపై కలెక్టర్ స్పం దిస్తూ 1బిలు ఇచ్చేందుకు అవకాశం లేదని మీ రుణాలు రెన్యువల్ అయ్యే ఏర్పాట్లు చేస్తామనిహామీ ఇచ్చారు. వ్యవసాయ శాఖ ద్వారా సాగు ధ్రువీకరణ సర్టిఫికెట్లను సంబంధిత రైతులకు అందజేస్తామన్నారు. వాటి ద్వారా బ్యాంకుల్లో కొత్త రుణాలు, పాత రుణాల రెన్యువల్ చేసుకోవచ్చన్నారు. ఆయన వెంట తహసీల్దార్ హనుమంతు ఉన్నారు.



రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రద్యుమ్న

పంట పొలాలపై ఏనుగుల విధ్వంసకాండ

తృటిలో తప్పించుకున్న కాపలాదారులు

బంగారుపాళ్యం :మండలంలోని మోతుకుంట సమీపంలో పంట పొలాలపై ఏనుగుల విధ్వంసకాండ కొనసాగుతూనే ఉంది. తాజాగా సోమవారం రాత్రి నుంచి మంగళవారం వేకువజామువరకు ఉమ్మర్‌సాహెబ్, వాహిద్, దొరస్వామినాయుడు, రవీంద్రనాయుడులకు చెందిన మామిడి తోటలపై ఏనుగులు దాడులు చేసి మామిడి కొమ్మలు విరిచి ధ్వంసం చేశాయి. ఉమ్మర్‌సాహెబ్‌కు చెందిన బోరు మోటారును, స్టార్టర్, విద్యుత్ కేబుల్‌ను, పైపులను, నీటి ట్యాంకులను ధ్వంసం చేశాయి. సుమారు రూ.1.50 లక్షలు నష్టం వాటిల్లినట్లు బాధితులు వాపోయారు. దొరస్వామినాయుడుకు చెందిన మామిడి తోటలో కాయలు తిని రాల్చివెళ్లాయి. ఉమ్మర్ సాహెబ్ మామిడి తోటలో కాపలాగా ఉన్న గోపాల్, హంసమ్మ రేకుల షెడ్‌లో ఉండగా ఏనుగుల మంద చుట్టూ నిలబడింది. దంపతులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బిక్కుబిక్కుమంటూ గడిపారు. ప్రస్తుతం ఏనుగుల మంద కొంకోనిబావి వద్ద ఉన్నట్లు పశువుల కాపర్లు తెలిపారు.



గుడిసె ముందు హంసమ్మ, గోపాల్

ప్రాణాల మీద ఆశ వదులుకున్నాం

మామిడి తోటలోని రేకులషెడ్‌లో నేను, నా భర్త గోపాల్ ఉన్నాము. శబ్దం రావడంతో మేలుకున్నాం. పరిశీలించగా షెడ్ చుట్టూ నాలుగు ఏనుగులు నిలబడి ఉన్నాయి. దోమతెర కట్టి ఉండడంతో మమ్మల్ని గుర్తించలేకపోయాయి. కేవలం మూడు అడుగుల దూరంలో ఏనుగులు నిలబడి ఉండడంతో ప్రాణాలమీద ఆశ వదులుకొని దైవ ప్రార్థనలు చేస్తూ గడిపాం. అరగంట తరువాత ఏనుగులు అటవీ ప్రాంతం వైపు వెళ్లడంతో ప్రాణాలు కాపాడుకున్నాం.

\- హంసమ్మ

సూక్తి

లక్ష్య సాధనలో ఎన్నిసార్లు ఓడినా సరే.. మరోసారి ప్రయత్నించు.



వావ్.. చార్లెస్ వంతెన

స్విట్జర్లాండ్‌లోని ఆల్ప్స్ పర్వతాల్లో పచ్చదనం పరుచుకున్న అందాలతో, ప్రకృతి శోభతో అలరారే రెండు కొండ ప్రాంత గ్రామాలే.. జెర్మట్, గ్రెచెన్. వాటి మధ్యలో లోతైన గ్రాబెంగూఫర్ లోయ. గ్రెచెన్ నుంచి జెర్మట్‌కు చేరుకోవాలంటే ఆ లోయతో పాటు, చిన్న చిన్న కొండలూ ఎక్కి దిగాల్సిందే. మొత్తంగా మూడు గంటల సమయం పడుతుంది. అక్కడి ప్రజలకు ఇప్పుడు ఆ సమస్య తీరిపోయింది. కేవలం పది నిముషాల్లోనే ఇరు గ్రామాలకు చకచకా వెళ్లిపోవచ్చు. ఎలానో తెలుసా? ప్రపంచంలోనే అతి పొడవైన పాదచారుల వంతెన అక్కడ ప్రారంభించారు.



ఆల్ప్స్‌పర్వతాల్లోని రెండు కొండల మధ్య ఓ పొడవాటి వంతెన నిర్మించారు. దాని పేరు "చార్లెస్ కువోనెన్'. గాలికి ఊగుతూ, తూగుతూ ఉండే ఆ వంతెనను చూస్తుంటే.. కొందరికి కొండల మధ్య వెండి ఊయల్లా తోస్తుంది. ఇంకొందరికి నడిచే రోలర్ కోస్టర్‌లా కనిపిస్తుంది. ఇది సస్పెన్షన్ మోడల్ బ్రిడ్జి. వంతెనపై నడుస్తుంటే కాస్త ఊగుతూ ఉంటుంది.

జూలై 29న ప్రారంభమైన ఈ వంతెన ప్రపంచంలోనే అతి పొడవైన పాదచారుల వంతెనగా రికార్డుల్లోకి ఎక్కింది. దీని పొడవు 494 మీటర్లు.

ఈ వంతెన భూ ఉపరితలానికి 85 మీటర్ల ఎత్తులో ఉంది.


ఇప్పటివరకు జర్మనీలోని 'టైటాన్ -ఆర్‌టీ' వంతెనను అతి పొడవైనదిగా పేర్కొనేవారు.

ప్రపంచంలోనే అతి పొడవైన పాదచారుల వంతెనల్లో రష్యాలోని 'స్కైపార్క్ బ్రిడ్జ్' మూడో స్థానంలో ఉంది. 2016 సోచి ఒలింపిక్స్ సందర్భంగా దీన్ని నిర్మించారు.


ఎత్తయిన ప్రదేశాలను చూసి భయపడేవారు, 'చార్లెస్ కువోనెన్' వంతెన దాటాలంటే కళ్లు మూసుకోవాల్సిందేనని జెర్మట్ ట్రావెల్ బోర్డు ప్రతినిధి అంటున్నారు.

రోడ్డు మార్గంలో వంతెన కట్టాలంటేనే ఓ నెల రోజుల సమయం పడుతుంది. కానీ రెండు కొండల మధ్యలో నిర్మించిన ఈ బ్రిడ్జిని కేవలం 10 వారాల్లోనే పూర్తి చేయడం విశేషం.

రంగులు వేయండి



బొమ్మ గీయండి



టంగ్ ట్విస్టర్స్

1. I would if I could, and if I could-n't, how could I?You couldn't, unless you could, could you?
2. The crow flew over the river with a lump of raw liver.
3. National Sheepshire Sheep Association


ఒకే అక్షరం

1. TOTAL	మొ	
2. BUD	మొ	
3. PLANT	మొ	

నవ్వుల్ నవ్వుల్

రాహుల్ : కుట్టేముందు దోమలు ఎందుకు శబ్దం చేస్తాయి?
రోహిత్ : దాడి చేయబోతున్నాను అని వర్తమానం ఇవ్వడం యుద్ధనీతిలో భాగం.

చుక్కలు కలపండి



దారి కనుక్కోండి



ఔనా!



వందలో డెబ్బై శాతం మంది 'హైపనిక్ జెర్క్' ఎదుర్కొన్నవారే. ఇదేదో కొత్త వ్యాధి అని అనుకుంటున్నారా? అదేం కాదు. మాంచి నిద్రలో ఉన్నప్పుడు ఎక్కడ నుంచో కింద పడుతున్నట్లు అనిపించి చటుక్కున మెలకువ వస్తుంది. అదే 'హైపనిక్ జెర్క్'.

మీకుతెలుసా?

మీకు చెట్లతో కూడిన అరణ్యాలే తెలుసు.. మరి శిలలతో ఉన్న అడవి తెలుసా? చైనాలోని యునాన్ ప్రావిన్స్‌లో ఉన్న పొడవైన శిలల సముదాయాన్నే 'స్టోన్ ఫారెస్ట్' అని పిలుస్తారు.



చెప్పగలరా?

జాలిలో ఉన్నా కానీ గాలిలో లేను
బిరుదులో ఉన్నా కానీ అరుదులో లేను
లిపిలో ఉన్నా కానీ తాపిలో లేను
అయితే ఇంతకీ నేనెవర్నో చెప్పగలరా?

జంతర్‌మంతర్

ఈ కింది పదాలను సరిచేయండి
1. ఐత్యంకమ ▸ ....
2. సందనపా ▸ ....
3. పిగూడుట్ట ▸ ....

- పత్తిపాక అంకిత, కోరుట్ల

జంబ్లింగ్ వర్డ్స్

ఈ కింది పదాలను సరిచేయండి
1. IRAN ▸ ....
2. IDWE ▸ ....
3. DMBU ▸ ....

- గుర్రాల సాయిసుధ, మెట్‌పల్లి

జవాబులు

1.RAIN 2.WIDE 3.DUMB
జంబ్లింగ్ వర్డ్స్ : మత్యం 2. సంపాదన 3. పిట్ట గూడు
జంతర్‌మంతర్ : 1. ఐక
చెప్పగలరా? : జాబిలి
మొగ్గ 3. మొక్క
ఒకే అక్షరం : 1. మొత్తం 2.

ఆంధ్రజ్యోతి
యువ







అతడు కొన్ని పల్లెలకు పండగలా వచ్చాడు. మూడు రోజులపాటు చవితి సంబరాలకు నోచుకోలేని ఎన్నో గ్రామాలకు అండగా నిలిచాడు. జైజై గణేశా అంటూ పాటలు పాడిస్తున్నాడు. ఉండ్రాలయ్యా అంటూ నైవేద్యం పెట్టిస్తున్నాడు. అడిగినోళ్లందరికీ వినాయక విగ్రహాలను వితరణగా అందిస్తూ ఆధ్యాత్మిక మిత్రుడయ్యాడు. పల్లెల్లో ఆధ్యాత్మిక పరిమళాలు వెల్లివిరియాలని కలలు కన్నాడు. ఒకటి కాదు, రెండు కాదు వెయ్యి గ్రామాలకు పైగా వినాయక విగ్రహాలను అందిస్తున్న అతడు.. జాతీయ టూరిజం బోర్డు డైరెక్టర్ సురేంద్రకుమార్‌రెడ్డి.

- తిరుపతి అర్బన్

పండగలా దిగి వచ్చాడు

పల్లెల్లో చవితి సంబరాలు నింపుతున్న ఆధ్యాత్మిక మిత్రుడు

'మాది బీఎన్ కండ్రిగ మండలం వెస్ట్‌వరత్తూరు గ్రామం. నేను కాలేజీ చదువుకునే రోజుల్లో వినాయక చవితి పండగొచ్చింది. చందాల కోసం యువత ఇళ్లిళ్లు తిరుగుతున్నారు. కొందరికి చందా ఇవ్వాలని ఉన్నా స్థోమత లేక ఇవ్వలేకపోవడం.. మరికొందరు మీకేం పనిలేదా అంటూ తిడుతూ ఇవ్వడం.. గమనించాను. ఇంతమందిని ఇబ్బంది పెట్టి వినాయక చవితి చేయడమెందుకని ఉత్సవ కమిటీ యువకులు అనుకుంటుండగా విన్నాను. కాలేజీ చదువుల కోసమని ఇంట్లో వాళ్లిచ్చిన కొంత పాకెట్ మనీని విరాళంగా ఇచ్చేశాను. అయినా నాకు సంతృప్తి కలగలేదు. ఏమీ చేయలేని స్థితి. మరుసటి ఏడాది మళ్లీ చవితి వచ్చింది. ఇంట్లోవాళ్లు నాకు కానుకగా ఇచ్చిన బంగారు ఉంగరాన్ని కుదువ పెట్టి విగ్రహం తీసిచ్చాను. కొన్నిరోజులు ఇంట్లో తెలియకుండా మేనేజ్ చేసినప్పటికీ అసలు విషయం తెలిసిపోయింది. ముందు మందలించినా తర్వాత నా అభిరుచికి ఆనందించారు. ఆ ఏడాది నేను చెన్నైలో చదువుకుంటుండగా చిన్న వ్యాపార అవకాశం వచ్చింది. డబ్బులు బాగా వచ్చాయి. ఇదంతా వినాయక స్వామి ఆశీర్వాదంగా భావించా. కుదువ పెట్టిన ఉంగరం తీసేసుకున్నా. మరో పది విగ్రహాలకు వితరణ చేసే శక్తి వచ్చింది. 'వినాయక సిమెంట్స్' పేరిట చిన్నతరహా పరిశ్రమను స్థాపించా. ఆర్థికంగా కాస్త నిలదొక్కుకోవడంతో వెనుదిరిగే అవసరం కనిపించలేదు. ఐదు, పది విగ్రహాలనుంచి నేడు వెయ్యి విగ్రహాలు ఇచ్చే స్థాయికి ఎదిగా. శ్రీకాళహస్తి, సత్యవేడు, సూళ్లూరుపేట, వెంకటగిరి, నగరి, చంద్రగిరి, గంగాధరనెల్లూరు నియోజక వర్గాల్లోని పలు గ్రామాలకు విగ్రహాలు అందిస్తున్నా. దాదాపు ఏడాదికి రూ.పాతిక లక్షలు విగ్రహాల కోసమే ఖర్చుపెడుతున్నా.

ఇలా చేయిస్తాం : మంగళంలోని బొమ్మల క్వార్టర్స్‌లో ఒక కుటుంబం వినాయక విగ్రహాలను తయారుచేసేందుకు జీవనం సాగిస్తోంది. వినాయక విగ్రహాల తయారీ నిపుణుడు గణేష్ నేతృత్వంలో వారి కుటుంబసభ్యులు సుమారు పదిమంది విగ్రహాల కోసమే పనిచేస్తుంటారు. ఆరునుంచి 12 అడుగుల వరకు సిద్ధమైన విగ్రహాలను వినాయక చారిటబుల్ ట్రస్టు ద్వారా అవసరమైన గ్రామాలకు అందజేస్తుంటా. వినాయక చవితికి మూడు నెలల ముందు విగ్రహం కావాలనుకున్న గ్రామాల నుంచి ట్రస్ట్‌కు దరఖాస్తు చేసుకుంటే సరిపోతుంది.ట్రస్ట్ నుంచి మేము ఒక నెంబరు ఇస్తాం. ఆ సంఖ్య ఆధారంగా చవితి ముందురోజు బొమ్మల క్వార్టర్స్‌లో కొలువైన వినాయక విగ్రహాలను నిర్వాహకులు తీసుకెళ్లొచ్చు.

గణేశుడే నాకు గాడ్ ఫాదర్

వినాయక స్వామి అనుగ్రహం ఉంటే రాష్ట్రవ్యాప్తంగా ఇవ్వాలనుంది. విగ్రహాలే కాదు చవితి సందర్భంగా జరిగే సాంస్కృతిక ప్రదర్శనలకు ఇప్పటికే తోచిన స్థాయిలో అందిస్తున్నాం. ఇంకా చేయూత ఇవ్వాలని ఉంది. పేద విద్యార్థులకు ఆర్థిక సాయం, ఉచిత వైద్య శిబిరాల ఏర్పాటు వంటివి చేస్తుంటాం. గణపతి ఆశీస్సులతోనే జాతీయ టూరిజం డైరెక్టర్ పదవి దక్కిందని భావిస్తా. ఒక్క మాటలో చెప్పాలంటే గణేశుడే నాకు గాడ్ ఫాదర్.'



రెనగేడ్ బైక్‌పై డాక్టర్ యుగంధర్

రెనగేడ్ కమాండో

● తిరుపతి వీధుల్లో నయా బైక్

తిరుపతి రోడ్లపై మోడరన్ బైక్ షికారు కొడుతోంది. అదే.. అమెరికాలోని యునైటెడ్ మోటార్స్ (యుఎం)కు చెందిన రెనగేడ్ కమాండో. తిరుపతికి చెందిన డెర్మటాలజిస్ట్ యుగంధర్.. ద్విచక్రవాహనాల్లో కొత్తదనం ఉండాలని ఈ బైకును కొనుగోలు చేశారు. విజయవాడ, హైదరబాద్‌లో మాత్రమే రెనగేడ్ బైక్స్ షోరూమ్‌లున్నాయి. డిఫరెంట్ లుక్‌తో ఉండడం వల్ల కొనగోలు చేసినట్టు చెప్పారు. దీని ఆన్ రోడ్ ధర రూ2.25 లక్షలు. తిరుపతిలో ఇదే తొలిబైక్ అని డాక్టర్ యుగంధర్ అన్నారు. 279.5 సీసీ గల బైక్‌లో అనేక అడ్వాన్స్‌డ్ ఫీచర్స్ ఉన్నాయని, లీటరు పెట్రోలుకు 30 నుంచి 40 కిలోమీటర్ల మైలేజ్ వస్తుందని కంపెనీ ప్రకటించిందన్నారు. మూడు రంగుల్లో ఈబైక్ దొరుకుతుంది.

- తిరుపతి అర్బన్


ఫ్యాషన్ గురూ..!

ఒకప్పుడు చిన్న రంధ్రమున్న ప్యాంటు వేయాలంటే సిగ్గుపడేవారు. కొత్త ప్యాంటు కొనలేని పేదలే చిరిగినవి వేసుకునేవారు. మరిప్పుడు ప్యాంటుకు ఎన్ని రంధ్రాలు ఎక్కువగా ఉంటే అంతగా యువత ఇష్టపడుతోంది. దీన్ని ట్రెండుగా భావిస్తోంది. ధర కూడా అదే స్థాయిలోనే ఉంటోంది. యువత అభిరుచికి అనుగుణంగా చిత్తూరు నగరంలో స్టైల్ జోన్ వంటి పలు వస్త్ర దుకాణాలు వెలిశాయి. కాగా.. క్రషింగ్ జీన్స్ రూ.700 నుంచి 1400 వరకు ధర పలుకుతోంది. జాగ్వార్ జీన్స్ రూ.800 నుంచి రూ.2000 వరకు.. టోన్ జీన్స్ రూ.800 నుంచి 4000 వరకు.. వింకెల్ జీన్స్ రూ.900-రూ.5000.. బాటమ్ జీన్స్ రూ.700- రూ.1200.. కాటన్ జీన్స్ రూ.700- రూ.1500.. బ్రాండెడ్ జీన్స్‌ల్లో పెయింటెడ్ నైట్ జీన్స్ రూ.1500- రూ.4000.. హ్యాండ్ డ్రాయింగ్ జీన్స్ రూ.2000- రూ.4000.. హోలో అవుట్ ఫేక్ జిప్పర్ జీన్స్ రూ.2000- రూ.4000.. జామెట్రీ పేటర్న్ జీన్స్ రూ.1500- రూ.2000.. బెలూన్ జీన్స్ రూ.600 నుంచి రూ.1800 వరకు అందుబాటులో ఉన్నాయి.

- చిత్తూరు కల్చరల్



స్లిమ్ ఫిట్ ప్రింటెడ్ జీన్స్



హోల్ కవర్ జీన్స్



స్ట్రయిట్ లెగ్ జీన్స్



జామెట్రీ పేటర్న్ జీన్స్

ఆలోచన విధానం, సునిశిత దృష్టి.. ప్రధానం

పోలిక పరీక్ష

ఈ విభాగానికి సంబంధించిన ప్రశ్నల్లో పదం, దానికి ఒక సంబంధం ఇస్తారు. మరో పదం ఇచ్చి ఆ పదానికి కూడా అలాంటి సంబంధాన్నే తెలపమని అడుగుతారు. ఈ విభాగంలోని ప్రశ్నల్లో జనరల్ నాలెడ్జ్ ప్రశ్నలు కూడా ఉంటాయి. అభ్యర్థి ఆలోచన విధానం, విజ్ఞానం, సునిశిత దృష్టి, పరిశీలనాత్మకతను అంచనా వేయడమే ఈ పరీక్ష ముఖ్యోద్దేశం. ఇందులో మూడు రకాల ప్రశ్నలు ఉంటాయి. అవి..

1. పదాల పోలిక పరీక్ష
2. వర్ణమాల అక్షరాల పోలిక పరీక్ష
3. సంఖ్యలతో పోలిక పరీక్ష


Panditi Meenakshi Pavan
Senior Faculty

Competitive Exams Special

మోడల్ - 1

1. **చాక్‌పీస్: నల్లబల్ల:: ---- : పలక**
ఎ) కలం బి) పెన్సిల్ సి) బలపం డి) ఏదీకాదు
సమాధానం: సి
వివరణ: నల్లబల్లపై చాక్ పీస్‌తో రాస్తారు. అదేవిధంగా పలకపై బలపంతో రాస్తారు.

2. **విటమిన్ ఎ : రేచీకటి : ----- : రికెట్స్**
ఎ) విటమిన్ బి బి) విటమిన్ సి
సి) విటమిన్ డి డి) ఏదీకాదు
సమాధానం: సి
వివరణ: విటమిన్ ఎ లోపంతో వచ్చే వ్యాధి రేచీకటి. అదేవిధంగా విటమిన్ డి లోపంతో వచ్చే వ్యాధి రికెట్స్

3. **పత్రం: క్లోరోఫిల్ :: రక్తం : -----**
ఎ) కొటిన్ బి) జాంథోఫిల్
సి) హిమోగ్లోబిన్ డి) ఏదీకాదు
సమాధానం: సి
వివరణ: పత్రాల ఆకులు పచ్చగా ఉండటానికి కారణం క్లోరోఫిల్. అదేవిధంగా రక్తం ఎర్రగా ఉండడానికి కారణం హిమోగ్లోబిన్

4. **థర్మామీటర్: ఉష్ణోగ్రత :: అమ్మీటర్ : -------**
ఎ) విద్యుత్ బి) ఉష్ణం సి) తేమ డి) వేగం
సమాధానం : ఎ
వివరణ: ఉష్ణోగ్రతను కొలిచే సాధనం థర్మామీటర్. అలాగే విద్యుత్ ను కొలిచేది అమ్మీటర్

5. **రైతు : పొలం :: శాస్త్రజ్ఞుడు: -------**
ఎ) కర్మాగారం బి) పాఠశాల
సి) ప్రయోగశాల డి) రంగస్థలం
సమాధానం: సి
వివరణ: రైతు పనిచేసే ప్రదేశం పొలం. అదేవిధంగా శాస్త్రవేత్త పనిచేసే ప్రదేశం ప్రయోగశాల

6. **పక్షులు : ఆర్నిథాలజీ::గుండె: ------**
ఎ) హెమటాలజీ బి) కార్డియాలజీ
సి) సెమన్ టిక్స్ డి) ఏదీకాదు
సమాధానం: బి
వివరణ: పక్షులను గురించి వివరించే శాస్త్రం ఆర్నిథాలజీ. అదేవిధంగా హృదయ స్పందన గురించి వివరించే శాస్త్రం కార్డియాలజీ

7. **రైతు : నాగలి :: సైనికుడు: ---------**
ఎ) తుపాకి బి) కత్తి సి) సూది డి) ఏదీకాదు
సమాధానం: ఎ
వివరణ: నాగలిని ఉపయోగించే వ్యక్తి రైతు. అదేవిధంగా తుపాకిని ఉపయోగించే వ్యక్తి సైనికుడు

8. **పాల స్వచ్ఛత: లాక్టోమీటర్ :: భూకంపాలు: ---**
ఎ) బారోమీటర్ బి) అనిమోమీటర్
సి) ఆడో మీటర్ డి) సిస్మోగ్రాఫ్
సమాధానం: డి
వివరణ: పాల స్వచ్ఛతను కొలిచే పరికరం లాక్టోమీటర్. అలాగే భూకంప తీవ్రతను కొలిచే సాధనం సిస్మోగ్రాఫ్

9. **బలం: వాట్ :: విద్యుత్ : --------**
ఎ) జౌల్ బి) డిగ్రీ సి) ఆంపియర్ డి) సెకండ్స్
సమాధానం: సి
వివరణ: బలానికి ప్రమాణం వాట్ అలాగే విద్యుత్ కు ప్రమాణం ఆంపియర్

10. **ముఖేష్: హాకీ :: చెస్ : -------**
ఎ) గగన్ నారంగ్ బి) హరి కృష్ణ
సి) లక్ష్మణ్ డి) ఎవరూకాదు
సమాధానం: బి
వివరణ: ముఖేష్ హాకీ క్రీడాకారుడు. అలాగే హరికృష్ణ చెస్ క్రీడాకారుడు

11. **కొలంబో : శ్రీలంక :: ------- : ఆఫ్ఘనిస్థాన్**
ఎ) ఇస్లామాబాద్ బి) కాబూల్ సి) తింపు డి) ఏదీకాదు
సమాధానం: బి
వివరణ: శ్రీలంక రాజధాని కొలంబో. అలాగే ఆఫ్ఘనిస్థాన్ రాజధాని కాబూల్

12. **హస్తినాపురం : న్యూఢిల్లీ :: మద్రాస్ : -----**
ఎ) చెన్నై బి) పనాజి సి) కోల్‌కతా డి) ముంబై
సమాధానం: ఎ
వివరణ: హస్తినాపురానికి కొత్త పేరు న్యూఢిల్లీ, అలాగే మద్రాస్‌కు కొత్త పేరు చెన్నై

13. **భరతనాట్యం: తమిళనాడు :: యక్షగానం: -------**
ఎ) కేరళ బి) మహారాష్ట్ర సి) కర్ణాటక డి) ఏదీకాదు
సమాధానం: సి
వివరణ: తమిళనాడు శాస్త్రీయ నృత్యం భరత నాట్యం. కర్ణాటక శాస్త్రీయ నృత్యం యక్షగానం

14. **న్యూజిలాండ్ జాతీయ పక్షి : కివి :: మన జాతీయ పక్షి : --------**
ఎ) నెమలి బి) పావురం సి) చిలుక డి) ఏదీకాదు
సమాధానం: ఎ
వివరణ: న్యూజిలాండ్ జాతీయ పక్షి కివి అదేవిధంగా మన జాతీయ పక్షి నెమలి.

15. **చార్మినార్: హైదరాబాద్ :: తాజ్‌మహల్:-------**
ఎ) న్యూఢిల్లీ బి) ఆగ్రా సి) మీరట్ డి) ఔరంగాబాద్
సమాధానం: బి
వివరణ: చార్మినార్ హైదరాబాద్‌లో ఉంది. తాజ్‌మహల్ ఆగ్రాలో ఉంది.

16. **ఇండియా : రూపాయి :: జపాన్ : -------**
ఎ) డాలర్ బి) ఫ్రాంక్ సి) యన్ డి) దీనార్
సమాధానం: సి
వివరణ: ఇండియా కరెన్సీ రూపాయి. జపాన్ కరెన్సీ యన్

17. **గ్రహాలు : ఖగోళ శాస్త్రం :: నాణేలు : -----------**
ఎ) సిస్మోగ్రాఫ్ బి) పేలియోగ్రఫీ
సి) పాథాలజీ డి) న్యూమిస్‌మాటిక్స్
సమాధానం: డి
వివరణ: గ్రహాల గురించి వివరించే శాస్త్రం ఖగోళశాస్త్రం. అలాగే నాణేల గురించి వివరించే శాస్త్రం న్యూమిస్‌మాటిక్స్

18. **ఆర్య సమాజం: దయానంద సరస్వతి:: రామకృష్ణ మిషన్: ---------**
ఎ) అనిబిసెంట్ బి) స్వామి వివేకానంద
సి) నివేదిత డి) ఎవరూకాదు
సమాధానం: బి
వివరణ: ఆర్య సమాజ స్థాపకుడు దయానంద సరస్వతి. అదేవిధంగా రామకృష్ణ మిషన్ స్థాపకుడు స్వామి వివేకానంద

19. **స్వామి వివేకానంద: నరేంద్రదత్:: దయానంద సరస్వతి: -------**
ఎ) గదాధరుడు బి) మూల శంకర్
సి) రామచందర్ డి) ఏదీకాదు
సమాధానం: బి
వివరణ: స్వామి వివేకానంద అసలు పేరు నరేంద్ర దత్ . దయానంద సరస్వతి అసలు పేరు మూల్ శంకర్

20. **మెగస్తనీస్: ఇండికా:: పాణిని: -----------**
ఎ) అష్టాధ్యాయి బి) హర్ష చరిత్ర
సి) చరక సంహిత డి) ఏదీకాదు
సమాధానం: ఎ
వివరణ: మెగస్తనీస్ రచించిన గ్రంథం ఇండికా, అదేవిధంగా పాణిని రచించిన గ్రంథం అష్టాధ్యాయి.

21. **పాస్కల్: ఒత్తిడి:: ఆంపియర్: -------**
ఎ) విద్యుత్ బి) బలం సి) శక్తి డి) స్వచ్ఛత
సమాధానం: ఎ
వివరణ: పాస్కల్ అనేది ఒత్తిడికి ప్రమాణం. అలాగే ఆంపియర్ అనేది విద్యుత్ కు ప్రమాణం

22. **కన్నడం: కర్ణాటక:: మరాఠీ: -------**
ఎ) మధ్యప్రదేశ్ బి) మహారాష్ట్ర
సి) గుజరాత్ డి) రాజస్థాన్

23. **హాంకాంగ్: చైనా:: వాటికన్: --------**
ఎ) నార్వే బి) డెన్మార్క్
సి) నెదర్లాండ్ డి) రోమ్
సమాధానం: డి
వివరణ: చైనాలోని ఒక నగరం హాంకాంగ్. అలాగే రోమ్‌లోని నగరం వాటికన్ సిటీ

24. **ఇన్సులిన్: హార్మోన్::ట్రిప్సిన్: -------**
ఎ) ఎంజైమ్ బి) విటమిన్ సి) హార్మోన్ డి) గ్రంధి
సమాధానం: ఎ
వివరణ: ఇన్సులిన్ అనేది హార్మోన్ . అలాగే ట్రిప్సిన్ అనేది ఒక ఎంజైమ్

25. **వినడం: చెముడు:: మాట్లాడడం: --------**
ఎ) నిశ్శబ్దం బి) మూగ సి) శాంతి డి) ఏదీకాదు
సమాధానం: బి
వివరణ: వినలేకపోవడం చెముడు అలాగే మాట్లాడలేకపోవడం మూగ

26. **భాక్రానంగల్: సట్లెజ్:: హీరాకుడ్ : -------**
ఎ) గోదావరి బి) కృష్ణ సి) కావేరి డి) మహానది
సమాధానం: డి
వివరణ: భాక్రానంగల్ డ్యామ్ సట్లెజ్ నదిపై ఉంది అలాగే హీరాకుడ్ డ్యామ్ మహానదిపై ఉంది.

27. **హరిత విప్లవం: మొక్కలు:: నీలి విప్లవం: ------**
ఎ) చేపలు బి) పాలు సి) నూనె గింజలు డి) ఏదీకాదు
సమాధానం: ఎ
వివరణ: మొక్కల అధికోత్పత్తికి చేపట్టిన కార్యక్రమం హరిత విప్లవం. అలాగే చేపల అధిక దిగుబడికి చేపట్టిన కార్యక్రమం నీలి విప్లవం

28. **తూర్పు: వాయవ్యం:: నైరుతి: ----**
ఎ) ఈశాన్యం బి) తూర్పు సి) ఆగ్నేయం డి) ఉత్తరం
సమాధానం: బి
వివరణ: తూర్పునకు 135 డిగ్రీల అపసవ్యదిశ వాయవ్యం. నైరుతికి 135 డిగ్రీల అపసవ్య దిశ తూర్పు

29. **సత్యజిత్ రే: సినిమా:: పికాసో: ------**
ఎ) రచయిత బి) నాటక కర్త
సి) చిత్రకారుడు డి) ఏదీకాదు
సమాధానం: సి
వివరణ: సినిమా రంగానికి చెందిన ప్రముఖుడు సత్యజిత్ రే. అలాగే సుప్రసిద్ధ చిత్రకారుడు పికాసో

30. **రెస్టారెంట్: మెను:: లైబ్రరీ: -----**
ఎ) చదువు బి) పుస్తకాలు సి) విద్య డి) క్యాటలాగ్
సమాధానం: డి
వివరణ: మెను అనేది ఐటమ్స్ లిస్ట్. కేటలాగ్ అనేది బుక్స్ లిస్ట్

31. **ఓనం: కేరళ:: బిహూ: ------**
ఎ) కర్ణాటక బి) మిజోరాం సి) అస్సాం డి) ఒడిశా
సమాధానం: సి
వివరణ: కేరళ ప్రజలు చేసుకొనే పండుగ ఓనం. అస్సాం ప్రజలు చేసుకొనే పండుగ బిహూ

32. **ప్రమాదం: అజాగ్రత:: వ్యాధులు: -------**
ఎ) అపరిశుభ్రత బి) వైద్యుడు
సి) మందులు డి) వైద్యం సమాధానం: ఎ
వివరణ: అజాగ్రత్తతో ప్రమాదం లభిస్తుంది. అలాగే అపరిశుభ్రత వల్ల వ్యాధులు ప్రబలుతాయి.

33. **శిల్పం: రూపం:: పాట ------**
ఎ) సంగీతం బి) గానం సి) చెప్పలేం డి) ఏదీకాదు
సమాధానం: బి
వివరణ: శిల్పానికి మంచి రూపం ఉండాలి. అలాగే పాటకు మంచి గానం ఉండాలి.

అడ్మిషన్స్

ఐఎన్ఎటి 2017

పుణెలోని ఇంటర్ యూనివర్సిటీ సెంటర్ ఫర్ ఆస్ట్రానమీ అండ్ ఆస్ట్రో ఫిజిక్స్ (ఐయుసిఎఎ), నేషనల్ సెంటర్ ఫర్ రేడియో ఆస్ట్రో ఫిజిక్స్ (ఎన్‌సిఆర్ఏ) సంస్థల్లో పీహెచ్‌డీ చేసే వారికి ఉద్దేశించిన రీసెర్చ్ స్కాలర్‌షిప్‌నకు ప్రకటన విడుదలైంది.
విభాగాలు: ఆస్ట్రానమీ, ఆస్ట్రో ఫిజిక్స్, ఫిజిక్స్
అర్హత: ఆగస్టు నాటికి 55 శాతం మార్కులతో (బిఎస్సీ/ ఎమ్మెస్సీ/ ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ)(ఫిజిక్స్/ ఎలక్ట్రానిక్స్/ ఆస్ట్రానమీ/ అప్లయిడ్ మేథమెటిక్స్) లేదా బిఇ/ బిటెక్/ ఎంఇ/ ఎంటెక్ పూర్తి.
ఎంపిక: ఐయుసిఏఏ - ఎన్‌సిఆర్ఏ అడ్మిషన్ టెస్ట్(ఐఎన్ఎటి 2017), ఇంటర్వ్యూ ద్వారా
పరీక్ష కేంద్రం: ఐయుసిఏఏ, పుణె
ఇంటర్వ్యూ: డిసెంబరు 7, 8
వేదిక: ఎన్‌సిఆర్ఏ - టిఐఎఫ్ఆర్, పుణె
దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 15, 2017
వెబ్‌సైట్: http://inat.ncra.tifr.res.in/inat

పుణె పాలిటెక్నిక్

పుణెలోని గవర్నమెంట్ పాలిటెక్నిక్ - **అడ్వాన్స్‌డ్ డిప్లొమా(ఆటోమోటివ్ మెకట్రానిక్స్)** ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఈ స్కిల్ బేస్డ్ జాబ్ ఓరియంటెడ్ కోర్సును **'మెర్సిడెజ్ - బెంజ్'** సహకారంతో నిర్వహిస్తున్నారు.
కోర్సు వ్యవధి: ఏడాది
అర్హత: డిప్లొమా/ డిగ్రీ (ఇంజనీరింగ్)
ఎంపిక: ఎంట్రెన్స్ ఎగ్జామ్ ద్వారా
ఎంట్రెన్స్ ఎగ్జామ్: ఆగస్టు 18
పూర్తి వివరాలకు వెబ్‌సైట్ చూడవచ్చు.
వెబ్‌సైట్: www.gppuneamc.org

ఎయిమ్స్

న్యూఢిల్లీలోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్)- పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి ఉద్దేశించిన **'ఆన్‌లైన్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్'**కు దరఖాస్తులు కోరుతోంది.
ఎగ్జామినేషన్ తేదీ: సెప్టెంబరు 8
పరీక్ష కేంద్రం: ఢిల్లీ/ ఎన్‌సిఆర్
ఆన్‌లైన్ ప్రక్రియ ప్రారంభం: ఆగస్టు 3, 2017
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 17, 2017
వెబ్‌సైట్: www.aiimsexams.org

డిఎస్‌సి

ద ఢిల్లీ స్కూల్ ఆఫ్ కమ్యూనికేషన్ (డిఎస్‌సి)- పీజీ(కమ్యూనికేషన్) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.
అర్హత: డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. మ్యాట్/ క్యాట్ అర్హత పొంది ఉండాలి. లేదా డిఎస్‌సి ఇంటర్నల్ అడ్మిషన్ టెస్ట్‌లో అర్హత పొంది ఉండాలి.
దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 7, 2017
వెబ్‌సైట్: www.dsc.edu.in/


డిఐఎంహెచ్

చెన్నైలోని డైరెక్టరేట్ ఆఫ్ ఇండియన్ మెడిసిన్ అండ్ హోమియోపతి (డిఐఎంహెచ్)- బిఎస్ఎంఎస్/ బిఏఎంఎస్/ బిఎన్ వైవస్/ బియుఎంఎస్/ బిహెచ్ ఎంఎస్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.
అర్హత: హయ్యర్ సెకండరీ
క్యాంపస్‌లు: తిరునల్వేలి. చెన్నై, మధురై, కన్యాకుమారి **దరఖాస్తు ఫీజు:** రూ.500
అప్లికేషన్ డౌన్‌లోడింగ్‌కు చివరి తేదీ: ఆగస్టు 30, 2017
హార్డు కాపీ చేరేందుకు ఆఖరు తేదీ: ఆగస్టు 31, 2017
చిరునామా: The Secretary, Selection Committee, Directorate of Indian Medicine and Homoeopathy, Arignar Anna Govt.Hospital of Indian Medicine Campus, Arumbakkam, Chennai-600106
వెబ్‌సైట్: www.tnhealth.org

‘ద లైఫ్ డివైన్ ’ గ్రంథ రచయిత ఎవరు?

హోంరూల్ ఉద్యమం

1. భారతదేశం బ్రిటిష్ సామ్రాజ్యంలో అంతర్భాగంగా ఉంటూ స్వయంపాలన సాగించుకొనే స్థితిని సాధించే లక్ష్యంతో ప్రారంభమైన ఉద్యమం?
ఎ) సహాయనిరాకరణ ఉద్యమం
బి) హోంరూల్ ఉద్యమం
సి) క్విట్ ఇండియా ఉద్యమం డి) ఉప్పుసత్యాగ్రహం
2. హోంరూల్ లీగ్‌ను 1916 ఏప్రిల్‌లో స్థాపించింది?
ఎ) బాలగంగాధర్ తిలక్ బి) సుబ్రమణ్య అయ్యర్
సి) సి.పి.రామస్వామి అయ్యర్ డి) పి.కె.తెలాంగ్
3. హోంరూల్ అనే పదాన్ని ఏ ఉద్యమం నుంచి స్వీకరించారు?
ఎ) గ్రీక్ ఉద్యమం బి) లాటిన్ ఉద్యమం
సి) ఐరిష్ ఉద్యమం డి) గ్రీన్ పీస్ ఉద్యమం
4. 1916 సెప్టెంబరులో హోంరూల్ లీగ్‌ను స్థాపించింది?
ఎ) మోతీలాల్ నెహ్రూ బి) అనిబిసెంట్
సి) పి.కె.తెలాంగ్ డి) ఎస్.సుబ్రమణ్య అయ్యర్
5. 1897లో హోంరూల్ లీగ్ అనే పదాన్ని మొట్టమొదట ఉపయోగించింది?
ఎ) శ్యాంజీ కృష్ణవర్మ బి) శ్రీకృష్ణ కార్పడే
సి) నరసింహచింతామన్ కేల్కర్
డి) మోతీలాల్ నెహ్రూ
6. ‘న్యూ ఇండియా’ పత్రికను స్థాపించింది?
ఎ) శ్యాంజీ కృష్ణవర్మ బి) బి.పి.వాడియా
సి) జె.ఎస్.అరుండేల్ డి) అనిబిసెంట్
7. ‘ఇండియన్ ఉమెన్స్ అసోసియేషన్’ అనే సంస్థను స్థాపించింది?
ఎ) మహమ్మద్ అలీ జిన్నా
బి) అంబికా చరణ్ మజుందర్
సి) అనిబిసెంట్ డి) సురేంద్రనాథ్ బెనర్జీ
8. 1885లో Fabian societyలో చేరి Fabian Essays అనే పత్రికలో సోషలిజం మీద వ్యాసాలు రాసింది?
ఎ) అనిబిసెంట్ బి) భగవాన్ దాస్
సి) బి.పి.వాడియా డి) జె.ఎస్.అరుండేల్
9. అనిబిసెంట్ దివ్యజ్ఞాన సమాజంలో ఎప్పుడు చేరారు?
ఎ) 1885 బి) 1889 సి) 1895 డి) 1899
10. బెనారస్‌లో ‘కేంద్రీయ హిందూ కళాశాల’ను స్థాపించింది?
ఎ) గాంధీ బి) రాస్‌బిహారి ఘోష్
సి) అనిబిసెంట్ డి) బాలగంగాధర్ తిలక్
11. ‘భగవద్గీత’ను అనిబిసెంట్ ఎవరి సహకారంతో ఆంగ్లంలోకి అనువదించారు?
ఎ) రాస్‌బిహారి ఘోష్ బి) బి.పి.వాడియా
సి) సురేంద్రనాథ్ బెనర్జీ డి) డాక్టర్ భగవాన్ దాస్
12. భారతీయులు పాశ్చాత్య సంప్రదాయాల పట్ల ఆకర్షితులు కావడాన్ని వ్యతిరేకించింది?
ఎ) సాండర్స్ బి) అనిబిసెంట్
సి) చెమ్స్‌ఫర్డ్ డి) మాంటేగ్
13. 1907లో కల్నల్ ఆల్కాట్ మరణం తరవాత దివ్యజ్ఞాన సమాజ బాధ్యతలు చేపట్టింది?
ఎ) అనిబిసెంట్ బి) బాలగంగాధర్ తిలక్
సి) సురేంద్రనాథ్ బెనర్జీ డి) జె.ఎస్.అరుండేల్
14. ‘ద లైఫ్ డివైన్’ అనే గ్రంథాన్ని రచించింది?
ఎ) అరవింద్‌ఘోష్ బి) తిలక్
సి) లాలాలజపతిరాయ్ డి) బిపిన్ చంద్రపాల్
15. 1895-1907 మధ్య బెనారస్ కేంద్రంగా హిందూ మతం గురించి ఉపన్యాసాలు చేసింది?
ఎ) పి.కె.తెలాంగ్ బి) ఎస్.సుబ్రమణ్య అయ్యర్
సి) సి.పి.రామస్వామి అయ్యర్ డి) అనిబిసెంట్
16. 1916 లక్నో సమావేశంలో అతివాదులు తిరిగి కాంగ్రెస్ చేరడంలో కీలక పాత్ర పోషించింది?
ఎ) అనిబిసెంట్ బి) సురేంద్రనాథ్ బెనర్జీ
సి) రాస్‌బిహారి ఘోష్
డి) బాలకృష్ణ శివరాం మోహన్ జీ
17. 'Englands difficulty is Indian opportunity' అనే నినాదాన్ని ఇచ్చింది?
ఎ) చాంబర్లీన్ బి) అనిబిసెంట్
సి) బి.పి.వాడియా డి) మహమ్మద్ అలీ జిన్నా
18. కాంగ్రెస్, ముస్లిం లీగ్ మధ్య 1916లో లక్నో ఒడంబడిక జరగడంలో కీలక పాత్ర పోషించింది?
ఎ) సి.పి.రామస్వామి అయ్యర్
బి) పి.కె.తెలాంగ్
సి) అనిబిసెంట్ డి) బి.పి.వాడియా
19. ‘న్యూ ఇండియా’ డైలీ ఎప్పుడు ధరావతును కోల్పోయింది?
ఎ) 1914 బి) 1912 సి) 1915 డి) 1916
20. హోంరూల్ ఉద్యమానికి ప్రతిస్పందిస్తూ ఆగస్టు ప్రకటన చేసింది?
ఎ) చాంబర్లీన్ బి) మాంటేగ్
సి) హార్డింజ్ డి) పాల్ రిచర్డ్
21. ఏ సంవత్సరంలో అనిబిసెంట్ రాజకీయ రంగప్రవేశం చేస్తూ భారతదేశానికి హోంరూల్ ఇవ్వాలని కోరారు?
ఎ) 1911 బి) 1912 సి) 1913 డి) 1914
22. 1917లో ఏ ఐఎన్‌సి సమావేశానికి అనిబిసెంట్ నాయకత్వం వహించారు?
ఎ) కలకత్తా బి) బొంబాయి సి) మద్రాసు డి) గౌహతి
23. ఐఎన్‌సికి అధ్యక్షత వహించిన తొలి మహిళ?
ఎ) దుర్గాభాయి దేశ్‌ముఖ్ బి) విజయలక్ష్మి పండిట్
సి) నిర్మలాదేశ్ పాండే డి) అనిబిసెంట్



కె. చెంచుకుమార్
సీనియర్ ఫ్యాకల్టీ

పోటీ పరీక్షల ప్రత్యేకం-ఇండియన్ హిస్టరీ



బాలగంగాధర్ తిలక్



అనిబిసెంట్

24. ‘బాయ్ స్కౌట్ అసోసియేషన్’ అనే సంస్థను స్థాపించింది?
ఎ) మహత్మాగాంధీ బి) అనిబిసెంట్
సి) మోతీలాల్ నెహ్రూ
డి) వినాయక దామోదర్ సావర్కర్
25. మద్రాసులోని అడయార్‌లో అనిబిసెంట్ స్థాపించిన జాతీయ విశ్వవిద్యాలయానికి చాన్సలర్‌గా వ్యవహరించింది?
ఎ) రవీంద్రనాథ్ ఠాగూర్ బి) శ్యాంజీ కృష్ణవర్మ
సి) విజయలక్ష్మి పండిట్ డి) బి.పి.వాడియా
26. 1916 మేలో చిత్తూరు జిల్లాలోని మదనపల్లిలో ‘థియోసాఫికల్ కళాశాల’ను స్థాపించింది?
ఎ) జె.ఎం.చటర్జీ బి) చాంబర్లీన్
సి) అనిబిసెంట్ డి) దుగ్గిరాల గోపాలకృష్ణయ్య
27. అనిబిసెంట్ ముఖ్య శిష్యుడు?
ఎ) కొండా వెంకటప్పయ్య
బి) పర్వతనేని వీరయ్య చౌదరి
సి) దుగ్గిరాల గోపాలకృష్ణయ్య డి) జిడ్డు కృష్ణమూర్తి
28. 'At the feet of master' గ్రంథ రచయిత?
ఎ) జిడ్డు కృష్ణమూర్తి బి) నీలకంఠ బ్రహ్మచారి
సి) అనిబిసెంట్ డి) విజయలక్ష్మి పండిట్
29. బ్రిటిష్ సారథ్యం కింద ఉంచుతూనే భారతీయులకు క్రమానుగతంగా స్వయం పరిపాలన ఇస్తామని ప్రకటన చేసిన భారత రాజ్య కార్యదర్శి?
ఎ) మింటో బి) మాంటేగ్ సి) మార్లే డి) హార్డింజ్
30. తిలక్ ఏర్పాటు చేసిన హోంరూల్ లీగ్‌లో ముఖ్యపాత్ర పోషించింది?
ఎ) గణేష్ శ్రీకృష్ణ కార్పడే
బి) నరసింహ చింతామన్ కేల్కర్
సి) బాలకృష్ణ శివరాం మోహన్ జీ డి) పైవారందరూ
31. తిలక్ ఏర్పాటు చేసిన హోంరూల్ లీగ్‌కు అధ్యక్షుడిగా పని చేసింది?
ఎ) చాంబర్లీన్ బి) మార్లే
సి) జోసెఫ్ బాప్టిస్టా డి) పి.కె.తెలాంగ్
32. తిలక్ ఏర్పాటు చేసిన హోంరూల్ లీగ్‌కు కార్యదర్శి?
ఎ) పాల్ రిచర్ట్ బి) కేల్కర్
సి) మీరా రిచర్డ్ డి) ఎస్.పి.సిన్హా
33. తిలక్ ఏర్పాటు చేసిన హోంరూల్ ఉద్యమం ఏయే ప్రాంతాలకు పరిమితం అయింది?
ఎ) ఉత్తరప్రదేశ్ బి) మహారాష్ట్ర
సి) కర్ణాటక డి) బి, సి
34. అనిబిసెంట్ ఏర్పాటు చేసిన హోంరూల్ లీగ్‌కు గౌరవ అధ్యక్షుడిగా వ్యవహరించింది?
ఎ) సర్ ఎస్.సుబ్రమణ్య అయ్యర్
బి) కేల్కర్ సి) జోసెఫ్ బాప్టిస్టా
డి) బాలగంగాధర్ తిలక్
35. అనిబిసెంట్ ఏర్పాటు చేసిన హోంరూల్ లీగ్‌కు ప్రధాన కార్యదర్శులుగా వ్యవహరించింది?
ఎ) జోసెఫ్ బాప్టిస్టా బి) సి.పి.రామస్వామి అయ్యర్
సి) పి.కె.తెలాంగ్ డి) బి, సి
36. అనిబిసెంట్ ఏర్పాటు చేసిన హోంరూల్ ఉద్యమం ఏయే ప్రాంతాలకు విస్తరించింది?
ఎ) దక్షిణ భారతదేశం బి) బీహార్, బెంగాల్
సి) యునైటెడ్ ప్రావిన్స్, సింధు డి) పైవన్నీ
37. అనిబిసెంట్ కృషి ఫలితంగా ఏ ఐఎన్‌సి సమావేశంలో బాలగంగాధర్ తిలక్ కాంగ్రెస్‌లో చేరారు?
ఎ) కలకత్తా బి) బొంబాయి సి) లక్నో డి) పూనా
38. 1916లో జరిగిన లక్నో కాంగ్రెస్ సమావేశానికి అధ్యక్షత వహించింది?
ఎ) రాస్‌బిహారి ఘోష్
బి) అంబికా చరణ్ మజుందర్
సి) అరుండేల్ డి) వాడియా
39. భారతదేశానికి స్వపరిపాలన ఇవ్వాలని ఏ ఐఎన్‌సి సమావేశం తీర్మానించింది?
ఎ) లక్నో బి) భోపాల్ సి) అమృత్‌సర్ డి) లాహోర్
40. కాంగ్రెస్, ముస్లింలీగ్ మధ్య రాజ్యాంగ సంస్కరణల విషయమై కుదిరిన ఒడంబడిక ఎప్పుడు జరిగింది?
ఎ) 1915 బి) 1916 సి) 1917 డి) 1918
41. Common Schemeను రూపొందించడంలో ముఖ్యపాత్ర వహించింది?
ఎ) మహాత్మాగాంధీ బి) బాలగంగాధర్ తిలక్
సి) సురేంద్రనాథ్ బెనర్జీ డి) మోతీలాల్ నెహ్రూ
42. 1916 డిసెంబర్‌లో ఏ ప్రాంతంలో సమావేశమై కాంగ్రెస్, ముస్లింలీగ్‌లు ఒక సామన్య ప్రణాళిక కోసం చెరొక కమిటీని నియమించాయి?
ఎ) మద్రాస్ బి) తిరువనంతపురం
సి) లక్నో డి) బెంగళూరు
43. హోంరూల్ ఉద్యమ కాలం?
ఎ) 1916-18 బి) 1920-22 సి) 1930-32 డి) 1940-42
44. భారతదేశ వైశ్రాయిగా 1916లో నియమితులైనది?
ఎ) మార్లే బి) లార్డ్ చెమ్స్‌ఫర్డ్
సి) మింటో డి) లార్డ్ కర్జన్
45. శాడ్లర్ కమిషన్‌ను ఎప్పుడు ఏర్పాటు చేశారు?
ఎ) 1914 బి) 1915 సి) 1916 డి) 1917
46. ‘వందేమాతరం’ అనే పత్రికను నడిపిన అతివాద నాయకుడు?
ఎ) మహాత్మాగాంధీ బి) అరవింద్ ఘోష్
సి) తిలక్ డి) లాలాలజపతి రాయ్
47. మితవాద రాజకీయాలను Policy of prayer, petition and protestగా అభివర్ణించింది?
ఎ) తిలక్ బి) లాలాలజపతిరాయ్
సి) అరవింద్ ఘోష్ డి) బిపిన్ చంద్రపాల్
48. ‘సావిత్రి’ అనే గ్రంథం రచించింది?
ఎ) మదన్ మోహన్ మాలవ్యా
బి) లాలాలజపతిరాయ్
సి) బాలగంగాధర్ తిలక్ డి) అరవింద్ ఘోష్
49. అరవింద్ ఘోష్ జన్మస్థలం?
ఎ) గౌహతి బి) కలకత్తా
సి) భువనేశ్వర్ డి) మద్రాసు

సమాధానాలు

		15) డి	24) బి	33) డి	42) సి
1) బి	8) ఎ	16) ఎ	25) ఎ	34) ఎ	43) ఎ
2) ఎ	9) బి	17) బి	26) సి	35) డి	44) బి
3) సి	10) సి	18) సి	27) డి	36) డి	45) సి
4) బి	11) డి	19) డి	28) ఎ	37) సి	46) బి
5) ఎ	12) బి	20) బి	29) బి	38) బి	47) సి
6) డి	13) ఎ	21) సి	30) డి	39) ఎ	48) డి
7) సి	14) ఎ	22) ఎ	31) సి	40) బి	49) బి
		23) డి	32) బి	41) డి	

ఉద్యోగాలు

నీతి ఆయోగ్

నేషనల్ ఇన్‌స్టిట్యూషన్ ఫర్ ట్రాన్స్‌ఫార్మింగ్ ఇండియా ఆయోగ్ (నీతి ఆయోగ్)- కింది పోస్టుల భర్తీకోసం దరఖాస్తులు కోరుతోంది.
మొత్తం ఖాళీలు: 173
పోస్టులు - ఖాళీలు: అడ్వైజర్/ సీనియర్ అడ్వైజర్ 7, జాయింట్ అడ్వైజర్(ఫ్లెక్సీ పూల్) 19, డిప్యూటీ అడ్వైజర్(ఫ్లెక్సీ పూల్) 19, సీనియర్ రీసెర్చ్ ఆఫీసర్ 28, రీసెర్చ్ ఆఫీసర్(ఫ్లెక్సీ పూల్) 28, ఎకనామిక్ ఆఫీసర్ (ఫ్లెక్సీ పూల్)28, ఎకనామిక్ ఆఫీసర్ 44
అర్హత: పోస్టును అనుసరించి పీజీ/ ఎంబిబిఎస్
వయసు: 26 నుంచి 50 ఏళ్ల మధ్య ఉండాలి
ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా
దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 25, 2017
వెబ్‌సైట్: www.niti.gov.in

సఫ్దర్‌జంగ్ హాస్పిటల్

ఢిల్లీలోని సఫ్దర్‌జంగ్ హాస్పిటల్- జూనియర్ రెసిడెంట్ (నాన్ పీజీ) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
మొత్తం ఖాళీలు: 58
కాంట్రాక్ట్ వ్యవధి: ఏడాది
అర్హత: ఎంబిబిఎస్ డిగ్రీ ఉత్తీర్ణత + ఢిల్లీ మెడికల్ కౌన్సిల్ గుర్తింపు పొంది ఉండాలి. అభ్యర్థులు 2015 జూలై 1 తరవాతనే ఇంటర్న్‌షిప్ పూర్తిచేసి ఉండాలి.
ఎంపిక: రాత పరీక్ష, కౌన్సెలింగ్ ద్వారా
దరఖాస్తు ఫీజు: రూ.500 (ఒబిసిలకు రూ.250 కాగా ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులకు మినహాయింపు వర్తిస్తుంది).
ఆసక్తిగల అభ్యర్థులు తమ దరఖాస్తును నిర్దేశిత చిరునామాకు పంపాలి
దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 10, 2017
చిరునామా: The Medical Superintendent, Safdarjung Hospital & VMMC, New Delhi- 110029
వెబ్‌సైట్: www.vmmc.sjh.nic.in/

ఇండియన్ ఆర్మీ

ఇండియన్ ఆర్మీ కింది పోస్టుల భర్తీకోసం విడివిడిగా దరఖాస్తులు కోరుతోంది.
లా గ్రాడ్యుయేట్స్
ఖాళీలు: 14 (పురుషులకు 10, మహిళలకు 4 పోస్టులు కేటాయించారు)
అర్హత: 55 శాతం మార్కులతో లా డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు మూడేళ్ల అనుభవం ఉండాలి. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా/ స్టేట్‌లో రిజిస్ట్రేషన్‌కు అర్హత పొంది ఉండాలి.
వయసు: 21 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 23, 2017
ఎన్‌సిసి స్పెషల్ ఎంట్రీ (43 కోర్స్)
ఖాళీలు: 54 (పురుషులకు 50, మహిళలకు 4 పోస్టులు కేటాయించారు)
అర్హత: ఎన్‌సిసి సర్టిఫికెట్‌తోపాటు 50 శాతం మార్కులతో డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. బ్యాటిల్ క్యాజువాలిటీస్/ ఆర్మీ పర్సనల్ పిల్లలకైతే ఎన్‌సిసి సర్టిఫికెట్ అవసరం లేదు.
వయసు: 19 నుంచి 25 ఏళ్లు
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 23, 2017
కంబైన్డ్ రిక్రూట్‌మెంట్ **ఖాళీలు:** 142
ట్రేడ్స్ వారీ ఖాళీలు: మెటీరియల్ అసిస్టెంట్ 6, ఎల్‌డిసి 1, ఫార్మసిస్ట్ 1, టెలీ ఆపరేటర్ 1, ఫైర్‌మన్ 36, ట్రేడ్స్‌మన్ (మేట్) 94, ఎంటిఎస్ 1, దోబి 1, టైలర్ 1
అర్హత: పోస్టును అనుసరించి బిఇ/ బిటెక్/ డిఫార్మసీ/ డిప్లొమా / ఇంటర్/ 10వ తరగతి
వయసు: పోస్టును అనుసరించి 18 నుంచి 27 ఏళ్లు
ఎంపిక: ఫిజికల్ ఎండ్యూరెన్స్ టెస్ట్, స్కిల్ టెస్ట్, రాత పరీక్ష ఆధారంగా.
ఆసక్తిగల అభ్యర్థులు తమ దరఖాస్తును స్పీడ్ / రిజిస్టర్డ్/ ఆర్డినరీ పోస్టుద్వారా నిర్దేశిత చిరునామాకు పంపాలి.
దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 16, 2017
చిరునామా: Commandant 21 Field Ammunition Depot - 909721
వెబ్‌సైట్: https://joinindianarmy.nic.in

ఆంధ్రజ్యోతి
చిత్తూరు
పలమనేరు
బుధవారం 2 ఆగస్టు 2017

ప్రధానోపాధ్యాయురాలికి సన్మానం



గంగవరం : మల్లేరు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రెడ్డెమ్మను మంగళవారం ఏఆర్ఐడీఎఫ్ సంస్థ సభ్యులు సన్మానించారు. బదిలీపై వెళ్లనున్న ఆమెకు శాలువ కప్పి, పూలమాల వేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు లీలావతి, ఏఆర్ఐడీఎఫ్ సభ్యులు చిన్న, వెంకటేష్, దిలీప్, హరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించమంటే కేసులా ?



పలమనేరు : దళితుల సమస్యలను పరిష్కరించమంటే కేసులు పెడుతున్నారని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి నాగరాజు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో కులవివక్ష పోరాట సంఘం ఆధ్వర్యంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి సొంత జిల్లాలో కూడా దళితులు వివక్షకు గురవుతున్నారని, ఉదాహరణకు పచ్చికాపలంలో మహాభారతంలో దళితులపై వివక్ష చూపారన్నారు. గంగభరిలో దళితులపై వివక్ష జరుగుతున్న విషయం పాలకులకు తెలిసినా పట్టించుకోలేదన్నారు. వీటిని ప్రశ్నించినందుకు 43 మంది దళిత నాయకులపై అక్రమ కేసులు పెట్టారన్నారు. సమావేశంలో కేవీపీఎస్ డివిజన్ అధ్యక్షుడు మునిరత్నం, నాయకులు ఓబులరాజు, ఈశ్వర్, సుబ్రహ్మణ్యం, తిప్పన్న, భువనేశ్వరి, గణేష్, రామచంద్ర, మహేష్, గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినిని తీసుకెళ్తున్న యువకుడిపై దాడి



తీవ్ర గాయాలతో పడి ఉన్న శ్రీకాంత్

బంగారుపాళ్యం : గంగవరం మండలం కొంగోళ్లపల్లెకు చెందిన శ్రీకాంత్ ఓ విద్యార్థినిని మోటర్ సైకిల్‌పై చిత్తూరు వైపు తీసుకెళ్తుండగా సమాచారం అందుకున్న ఆమె కుటుంబ సభ్యులు వెంబడించి దాడి చేసిన ఘటన బంగారుపాళ్యం మండలం శేషాపురం సమీపంలో చోటు చేసుకుంది. మంగళవారం పాఠశాలలో ప్రార్థనానంతరం శ్రీకాంత్ తో మోటారు సైకిల్‌పై బాలిక వెళ్తుండగా పలమనేరులో గుర్తించిన కొందరు వ్యక్తులు ఆమె కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. దీంతో మోటారు సైకిల్‌పై వెంబడించిన ఆమె మేనమామ శేషాపురం సమీపంలో అటకాయించి శ్రీకాంత్ పై కర్రతో దాడి చేసి గాయపరిచాడు. రహదారిపై వెళ్తున్న వాహనదారులు అడ్డుకొని శ్రీకాంత్ ను బంగారుపాళ్యం ఆస్పత్రికి తరలించి పోలీసులకు సమాచారం అందించారు సీఐ రవికుమార్, ఎస్ఐ నెట్టికంఠయ్య చేరుకొని ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకొని దాడికి పాల్పడ్డ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. శ్రీకాంత్ తన స్నేహితుడేనని కాణిపాకం గుడికి రావడానికి బయలుదేరగా కుటుంబ సభ్యులు అపార్థం చేసుకొన్నారని విద్యార్థిని పోలీసులకు తెలిపినట్లు సమాచారం. బాధితుని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాంగ్రెస్ నాయకురాలి స్కార్పియో చోరీ

బంగారుపాళ్యం : మండల కేంద్రంలోని రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జ్యోతీశ్వరికి చెందిన స్కార్పియో వాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసుకెళ్లారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు.. జాతీయ రహదారి పక్కన తమ కాంప్లెక్స్ ముందు స్కార్పియో వాహనాన్ని ఉంచామని, మంగళవారం ఉదయం వాహనం చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. తమ కాంపెక్స్‌కు ఎదురుగా ఉన్న హోటల్ ముందు ఉన్న సీసీ కెమెరాలో ముగ్గురు వ్యక్తులు స్కార్పియో వాహనాన్ని చోరీ చేసి తీసుకెళ్లినట్లు రికార్డు అయి ఉందని బాధితురాలు తెలిపింది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

జడ్పీ చైర్‌పర్సన్ దంపతులకు సన్మానం



గంగవరం : జడ్పీ చైర్‌పర్సన్ గీర్వాణి, చంద్రప్రకాష్ దంపతులను మంగళవారం సాయంత్రం గంగవరం మండల పరిషత్ సిబ్బంది, టీడీపీ నాయకులు ఘనంగా సన్మానించారు. మండల పరిషత్ కార్యాలయాన్ని చైర్‌పర్సన్ దంపతులు సందర్శించి అభివృద్ధి కార్యక్రమాలను సమీక్షించారు. అనంతరం తమ కుమార్తె వివాహానికి ఆహ్వాన పత్రికలు అందజేశారు. తమ కుమార్తె వివాహానికి అధికారులు, ప్రజా ప్రతినిధులు తప్పక హాజరు కావాలని ఆహ్వానించారు. వారి వెంట ఎంపీపీ కృష్ణమ్మ, జడ్పీటీసీ సోమశేఖర్, తహసీల్దార్ నాగయ్య, ఎంపీడీవో విద్యారమ, సర్పంచులు, ఎంపీటీసీలు ఉన్నారు.

పిల్లలకు ఎమ్మార్ టీకాలు తప్పనిసరి







ఎమ్మార్ వ్యాక్సిన్ వేస్తున్న మంత్రి సతీమణి రేణుకారెడ్డి , గంగవరం వ్యాక్సిన్ , బంగారుపాళ్యంలో టీకా వేయించుకున్నట్లు ధ్రువపత్రం అందజేత

పలమనేరు : పిల్లల్లో రోగ నిరోధక శక్తి పెంచి అంటు వ్యాధులను నివారించడానికి ఎమ్మార్ టీకాలు తప్పనిసరిగా వేయించాలని మంత్రి అమరనాథరెడ్డి సతీమణి రేణుకారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని బాలికోన్నత పాఠశాల, నారాయణ పాఠశాలల్లో తట్టు, రూబెల్లా వ్యాక్సిన్ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కొలమాసనపల్లె పీహెచ్ సీ వైద్యాధికారి మల్లికార్జున రెడ్డి, మంత్రి కుమారుడు ప్రసేన్ కుమార్ రెడ్డి, కోడలు ప్రీతిక రెడ్డితోపాటు టీడీపీ నాయకులు హేమంత్ కుమార్‌రెడ్డి, బాలాజీ నాయుడు, ఖాజా, పలమనేరు మున్సిపల్ వైస్ చైర్మన్ చాంద్‌బాషా, సత్యప్రకాష్ పాల్గొన్నారు.

గంగవరం : మండలంలోని గంగవరం, పత్తికొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో మంగళవారం ఎమ్మార్ వ్యాక్సిన్లను ప్రజా ప్రతినిధులు ప్రారంభించారు. మండల కేంద్రంలో పీహెచ్ సీ చైర్మన్ వెంకటరమణారెడ్డి, సర్పంచు మురళీ ప్రారంభించగా పత్తికొండలో పీహెచ్ సీ చైర్మన్ సూరిబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాసులు, సంధ్యారాణి, వైద్య సిబ్బంది పిల్లలకు వ్యాక్సిన్లు వేయించారు.

బంగారుపాళ్యం : మండలంలో ఎమ్మార్ టీకాల వేసే కార్యక్రమాన్ని మంగళవారం ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ భుజగేంద్ర నాయుడు, సభ్యులు నరసింహులు, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మురళీ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎంపీపీ సుచిత్ర, జీఆర్ కన్‌స్ట్రక్షన్స్ అధినేత ఈశ్వర్ నాయుడు, ఎంఈవో నాగేశ్వరరావు, మండల వైద్యాధికారిణి తేజ, ఎంపీహెచ్ ఈవో బృహస్పతి, హోమియోపతి వైద్యులు సెల్వరాజ్, డీపీఎంవో మణి విద్యార్థులకు టీకాలు వేశారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోని 1962 మంది విద్యార్థులకు టీకాలు వేసినట్లు డాక్టర్ తేజ తెలిపారు.

పెద్దపంజాణి : స్థానిక పీహెచ్ సీ పరిధిలో ఎమ్మార్ వ్యాక్సిన్ 96 శాతం పూర్తయినట్లు వైద్యాధికారి రవిశంకర్ పేర్కొన్నారు. మంగళవారం పీహెచ్ సీ చైర్మన్ విజయశేఖర్ నాయుడు మాట్లాడుతూ మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో వ్యాక్సిన్ వేశామన్నారు. కార్యక్రమంలో హెచ్ ఎం చంద్రశేఖర్ రెడ్డి, టీడీపీ నాయకులు మాజీ జడ్పీటీసీ చెంగారెడ్డి, నాగరాజు, వేణుగోపాల్ నాయుడు, ఎంపీటీసీ ముబారక్ తాజ్, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇందిరా నగర్‌లో ప్రబలిన విష జ్వరాలు

గ్రామంలో అందరూ జ్వర పీడితులే ● మురుగునీటితో ప్రబలుతున్న దోమలు ● జ్వరాలు పీడిస్తున్నా వైద్య సిబ్బంది నిర్లక్ష్య ధోరణి

బంగారుపాళ్యం : మండలంలోని మొగిలివారిపల్లె పంచాయతీ ఇందిరా నగర్ దళిత వాడలో నెల రోజుల నుంచి విష జ్వరాలు ప్రబలాయి. దీంతో గ్రామస్థులందరూ విష జ్వరాల బారిన పడి తీవ్ర అస్వస్థతతో బాధపడుతున్నారు. నెల రోజులుగా విష జ్వరాలతో ప్రజలు అల్లాడుతున్నా వైద్య సిబ్బంది ఏ మాత్రం పట్టించుకోలేదని పలువురు గ్రామస్థులు వాపోయారు. జ్వరాలతో బాధపడుతూ కూలీ పనులకు కూడా వెళ్లలేక పోతున్నామని, దీంతో పూటగడవడం కష్టంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే చికిత్సల కోసం వేలాది రూపాయలు ఖర్చు పెట్టినా జ్వరాలు నయం కాలేదన్నారు. గ్రామానికి చెందిన వైలా, కనకమ్మ, దీన, దుర్గ, ప్రణయ్, పృథ్వీ, నీలమ్మ, జానకమ్మ, ఉష, పద్మజతో పాటు గ్రామంలో ప్రతి ఒక్కరికి విష జ్వరాలు సోకాయి. వీరిలో పలువురు తీవ్ర అస్వస్థతకు లోనై ఉన్నారు. గ్రామంలో మురుగు నీటి కాలువలు ఏర్పాటు చేయక పోవడంతో దోమలు ప్రబలి అంటురోగాలు వ్యాపిస్తున్నాయి. గ్రామంలో వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని పలువురు గ్రామస్థులు కోరుతున్నారు.



విష జ్వరాలతో బాధపడుతున్న గ్రామస్థులు





పూటగడవడమే కష్టంగా ఉంది



కూలీ పనులతో జీవనం సాగిస్తున్న మా కుటుంబంలో అందరూ విష జ్వరాల బారిన పడ్డాం. నెల రోజుల నుంచి జ్వరాలతో కూలీ పనులకు కూడా వెళ్లలేక పోతున్నాం. ఆటోఛార్జీలు పెట్టుకొని ప్రభుత్వాస్పత్రికి వెళ్లడానికి కూడా ఇబ్బందులు పడుతున్నాం. **- నీలమ్మ**

అధికారులకు తెలిపినా స్పందించ లేదు



గ్రామంలో నెలరోజులుగా విష జ్వరాలు ప్రబలాయి. నేను కూడా జ్వరానికి చికిత్స తీసుకుంటున్నాను. విష జ్వరాలు ప్రబలిన విషయం వైద్యాధికారులకు తెలిపినా వారు ఏ మాత్రం స్పందించ లేదు. **- పద్మజ, ఆశ వర్కర్**

అభివృద్ధి పనులకు భూమి పూజ

పెద్దపంజాణి : మండలానికి వచ్చిన జడ్పీ చైర్‌పర్సన్ గీర్వాణి మంగళవారం పలు అభివృద్ధి కార్యక్రమాలకు భూమి పూజలు చేశారు. తన కుమార్తె వివాహ ఆహ్వానం కోసం ఆమె ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కార్యాలయంలో అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్షించారు. చాలా ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని చెరువులను, చెక్‌డ్యాములను అభివృద్ధి కోసం వేల కోట్లు వెచ్చిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా మండల సమస్యలు పరిష్కరించాలని నాయకులు ఓ వినతి పత్రం అందజేశారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ మురళీకృష్ణ, జడ్పీటీసీ సులోచన, ఎంపీడీవో వెంకటరత్నం, తహసీల్దార్ సురేంద్ర, ఎంపీటీసీ ముబారక్‌తాజ్, నాయకులు శ్రీరాములు, చెంగారెడ్డి, మురహరిరెడ్డి, కృష్ణారెడ్డి, రామకృష్ణ, వేణుగోపాల్ నాయుడు, సునీత నాగరాజు, సుధాకర్ రెడ్డి, రోజాకృష్ణారెడ్డి, విజయశేఖర్ నాయుడు, చలపతి, అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తున్న గీర్వాణి

రేపు రామకుప్పంలో కంటి చికిత్స శిబిరం

రామకుప్పం : జిల్లా అంధత్వ నివారణ సంస్థ, కుప్పం పీఈఎస్ ఆసుపత్రి, సుబ్రహ్మణ్యాలయ కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఉచిత కంటి చికిత్స శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సుబ్రహ్మణ్యాలయ అతిథి గృహంలో నిర్వహించే ఈ శిబిరంలో రోగులకు నిపుణులైన వైద్యులచే కంటి పరీక్షలు, చికిత్సలు అందిస్తామన్నారు. అర్హులైన రోగుల్ని కుప్పం పీఈఎస్ ఆసుపత్రికి తరలించి ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయిస్తామన్నారు. ఈ అవకాశాన్ని రోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వేరుశనగకు జీవం పోసేనా..!



వర్షంతో కాస్తంత జీవంతో కనిపిస్తున్న వేరుశనగ చేను, బీళ్లల్లో నిలిచిన వాన నీళ్లు

కుప్పం : వేరుశనగ పంట పూర్తిగా ఎండిపోయి దక్కేది ఏమీ మిగలబోదని ఆశలు వదిలేసుకున్నాడు అన్నదాత. ఈ దశలో రెండు రాత్రుళ్లు కాస్త భారీగానే కురిసిన వర్షం చావుబతుకుల మధ్య ఉన్న పంటకు కాస్త తడిని అందించింది. రాత్రి కురిసిన వాన చినుకుల జాడ తెల్లారేసరికల్లా చేలల్లో కనిపించకపోయినా వేరుశనగ ఎంతో కొంత చేతికి వస్తుందన్న ఆశను కల్పించింది. రెయిన్ గన్లు సామాన్య రైతుకు అందకపోగా, వానలమీదే ఆధారపడక తప్పని పరిస్థితిల్లో కుప్పంలో రాలిపోయిన చినుకులు కాస్తంత ఆనందాన్నే తీసుకు వచ్చాయి.

కుప్పం నియోజకవర్గం నిత్యం కరువుతో అల్లాడుతున్న విషయం అందరికీ తెలిసిందే. ఎండుతున్న వేరుశనగ పంటను రక్షించుకోవడానికి గతేడాది రెయిన్ గన్లు సరఫరా చేయడంతోపాటు ట్యాంకరుతో నీళ్ల కొనుగోలు చేయడానికి ఆర్థిక సాయం చేసిన ప్రభుత్వం ఈసారి కూడా అదే రెయిన్ గన్లను వాడుకోమంటోంది. జిల్లా వ్యవసాయ ఉన్నతాధికారులు అక్కడెక్కడో కూర్చుని మీ వ్యవసాయాధికారుల వద్దే రెయిన్ గన్లు అట్టే పెట్టామని, అవసరమైనవారు వాటిని తీసుకుని ఉపయోగించుకోవచ్చని కబుర్లు

రెండు రాత్రిళ్లు కురిసిన వర్షం

చెబుతున్నారు. క్షేత్రస్థాయి వాస్తవ పరిస్థితులు చూస్తే ఏ ఒక్క సామాన్య రైతు వద్ద కూడా రెయిన్ గన్లు కనిపించడంలేదు. అసలు నీళ్లంటూ ఉంటే కదా.. రెయిన్ గన్లయినా ఉపయోగించుకోవడానికి వీలయ్యేది. దాహార్తి తీర్చుకోవడానికే గ్రామాలకుగ్రామాలు అల్లాడిపోతున్నపుడు ఇక వాటిని పట్టించుకొనేవారే లేకుండా పోయారు. ఈ ఖరీఫ్ సీజన్ లో రెండు నెలల నుంచి దశలవారీగా నియోజకవర్గంలోని రైతులు వేరుశనగ విత్తుతూ వచ్చారు. ప్రభుత్వం పంపిణీ చేసిన సబ్సిడీ వేరుశనగ కంటే ముందే తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలలోని ప్రైవేటు వ్యాపారుల నుంచి విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు కొందరు అందరికంటే ముందుగా చేలల్లో వేరుశనగ విత్తనం వేశారు. విత్తిన నాటి నుంచి ఒకటిరెండు సార్లు అరాకొరా జల్లులు పడడం తప్ప, మరెటువంటి వానలూ కురవలేదు. ఎండిపోయిన పంట ఎండిపోతుండగా, అక్కడక్కడా మాత్రం కొన్ని చేలల్లో పంట బుడ్డ దశకు వచ్చింది. ఈ బుడ్డలు కూడా చాలా తక్కువగానే నేలలోకి దిగాయి. అంటే ప్రస్తుతం చేలల్లో ఉన్న వేరుశనగ పంట బుడ్డ దశలోనే ఉంది కానీ, దిగుబడి వచ్చే పరిస్థితులు ఎప్పుడో పోయాయి. పదీ పదిహేను రోజులుగా ఆకాశం మేఘావృతమవ్వడం తప్ప చినుకన్నది నేల రాలలేదు. అయితే ఉన్నట్టుండి, సోమ, మంగళవారాలు రెండు రోజుల్లో రాత్రిపూట కాస్తంత భారీ వర్షమే నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో పడింది. రెండుమూడు పదున్ల వాన పడిందని రైతాంగం చెప్పుకుంటోంది. అయితేనేం.. ఈ వానవల్ల ఇప్పటికే ముప్పావు వంతు ఎండిపోయిన వేరుశనగ పంటకు జీవం వచ్చే పరిస్థితైతే కనిపించడంలేదు. ఇదే వాన కనీసం పది రోజుల ముందైనా వచ్చుంటే, వేరుశనగ చెట్టుకు బుడ్డలు ఓ మోస్తరుగా దిగి పంట దిగుబడిపై ఆశలు నిలిచేవి. అప్పట్లో వానలనేవే లేకుండా పోవడంవల్ల ఒక్కో చెట్టుకు రెండుమూడు బుడ్డలు మాత్రమే, అదీ బలహీనంగా దిగాయి. ఈ బుడ్డలు మాత్రం ఇప్పుడు కురిసిన వానకు కాస్తంత చేతికి వచ్చే పరిస్థితైతే ఏర్పడింది. ఇంకో నాలుగు చినుకులు రాలితే మిగిలిన పంటన్నా చేతికి వస్తుందని రైతాంగం మళ్లీ ఆకాశం దిక్కు మొగం పెట్టి ఆశగా ఎదురు చూడడం ప్రారంభించింది.

గుడుపల్లెలో భారీ వర్షం



గుడుపల్లె : మండలంలో గురువారం అర్ధరాత్రి భారీ వర్షం కురిసింది. 71.4 మిల్లీమీటర్ వర్షం కురవడంతో ప్రజలు ఆనందాన్ని వ్యక్తం చేశారు. రెండు నెలకుపైగా వర్షం పడక ప్రజలు ఇబ్బందులు పడ్డారు. అర్ధరాత్రి సమయంలో కురిసిన భారీ వర్షానికి రైతులు కొంత ఊరట చెందారు. మెట్ట ప్రాంతాల్లో రైతులు ఆహార పంటలైన రాగి, సజ్జ, జొన్న, సామలు వేశారు. చాలా వరకు వర్షం పడకపోవడంతో పంటలు ఎండుముఖం పట్టాయి. మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి రైతులు కొత్త పంటలు వేసేందుకు సన్నద్ధమౌతున్నారు. చెక్ డ్యాంలు, కుంటలు, పంట సంజీవినీలకు జలకళ సంతరించుకోవడంతో ప్రజలు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.

జాబ్ మేళాకు విశేష స్పందన

వి.కోట : స్థానిక స్త్రీశక్తి భవన్‌లో మంగళవారం నిర్వహించిన మహిళా జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. ఈ ఎంపికకు సుమారు 50 మంది పాల్గొనగా వారిలో 32 మందిని వివిధ సంస్థలలో ఉద్యోగాలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో పలమనేరు మాజీ ఏఎంసీ ఛైర్మన్ రామచంద్రనాయుడు,ఎంపీపీ సులోచన, ఎంపీడీవో బాలాజీ, ఏపీఎం చంద్రకళా, టీడీపీ అధ్యక్షులు రంగనాథ్, కార్యదర్శి సోము తదితరులు పాల్గొన్నారు.

మురుగు నీరు తొలగించడానికి ప్రణాళిక



కుప్పం : ఓ మోస్తరు వర్షానికి రైల్వే అండర్ బ్రిడ్జివద్ద మురుగునీరు, వాన నీటితో కలిసి రోడ్డుపై పొంగి పొర్లింది. దీంతో జడ్పీటీసీ రాజ్‌కుమార్‌తోపాటు ఆర్అండ్‌బీ డీఈ, పంచాయతీరాజ్ డీఈ మల్లికార్జునలు సంబంధిత స్థలాన్ని పరిశీలించారు. కాసిన్ని చినుకులు రాలితే ఈ మార్గం వద్ద మురుగునీరు, వాన నీటితో కలిసి చేరిపోయి నడుం లోతు నీటి మడుగు ఏర్పడుతోందని జడ్పీటీసీ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. రైల్వే అండర్ బ్రిడ్జి మార్గం పక్కనే ఒక సన్నపాటి కాలువ పోతోందని, దీన్ని వెడల్పు చేసి మరోవైపు వాన నీటిని, మురుగునీటిని మళ్లించగలిగితే సమస్యను తాత్కాలికంగా తీర్చవచ్చని ఆయన వారి దృష్టికి తీసుకొచ్చారు. అధికారులు కూడా అందుకు అంగీకరించారు. వెంటనే సంబంధిత ప్రణాళిక తయారు చేసి పనులకోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జడ్పీటీసీ డీఈలిద్దరికీ సూచించారు.

ప్రధానోపాధ్యాయుడికి సన్మానం



కుప్పం: గోనుగూరు ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యా యుడిగా పనిచేసి పదవీ విరమణ పొందిన పి.వెంకట రమణను ఉపాధ్యాయ బృందం తోపాటు పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు ఘనంగా సన్మానించారు. కుప్పం పట్టణంలోని ఎన్జీవో హోమ్‌లో నోడల్ ప్రధానోపాధ్యాయుడు రామమోహన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వెంకరమణ పాఠశాలకు, విద్యాభివృద్ధికి చేసిన కృషిని పలువురు ప్రశంసించారు. కార్యక్రమంలో సీడీసీఎస్ఎంఎస్ ఛైర్మన్ శ్యారాజ్, కుప్పం మండల టీడీపీ అధ్యక్షుడు ఎస్.చౌడప్ప, రెస్కో వైస్ ఛైర్మన్ డి.చలపతి, మాజీ డిప్యూటీ ఈవో వాసుదేవనాయుడు, గుడుపల్లె ఎంఈవో శ్రీదేవి, సాయిమాతా సేవాట్రస్టు అధ్యక్షుడు జగదీష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ భవనాలకు నిధుల మంజూరు

గుడుపల్లె : మండల పరిధిలోని సోడిగానిపల్లె, కంచిబందార్లపల్లె ల్లో పంచాయతీ భవనాల నిర్మాణానికి రూ. 30 లక్షల నిధులు మంజూరైనట్లు ఎంపీపీ మునిరాజు తెలిపారు. ఆయా భవనాలను త్వరలోనే నిర్మాణాలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. మండలంలోని 18 పంచాయతీల్లో 16 పంచాయతీల భవనాలు ఇప్పటికే పూర్తయ్యాయని, మరో మూడు నెలలో ఈ రెండు పంచాయతీల్లో పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

అన్ని వైద్యాలకూ ఆయుర్వేదమే మూలం

కుప్పం : ప్రపంచ వ్యాప్తంగా నేడు ప్రసిద్ధి చెంది ఆధరణ పొందుతున్న అల్లోపతి వైద్యంతో సహా పలు వైద్య విధానాలకు భారతీయ సంప్రదాయ ఆయుర్వేద వైద్యమే మూలమని ద్రావిడ విశ్వవిద్యాలయం వీసీ సత్యనారాయణ, రెస్కో ఛైర్మన్ పీఎస్ మునిరత్నం అన్నారు. మండలంలోని వసనాడులో సోమవారం రాత్రి ఆయుర్వేద వైద్యంలో నిష్ణాతులుగా పేరు గడించిన దివంగత వైద్యం మునెప్ప 15వ సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రాచీన కాలంలో తపస్సంపన్నులైన మునులు, తమ అనుభవసారం రంగరించి పలు వన మూలికల ద్వారా వివిధ రుగ్మతలకు మందులు తయారు చేశారన్నారు. సుశ్రుతుడు, చరకుడు వంటి ప్రాచీన ఆయుర్వేద వైద్యులు అప్పట్లోనే శస్త్ర చికిత్సలు కూడా చేసి రోగులకు స్వచ్ఛత కలిగించిన రుజువులు కూడా నాటి వైద్య గ్రంథాలలో లభిస్తున్నాయన్నారు. వారి బాటలో నడిచిన వైద్యం మునెప్ప ఆయుర్వేదమే జీవనంగా ఎంచుకుని దాన్నే జీవికగా చేసుకున్నా, పేదవారికి ఉచితంగానే వైద్యం అందించారని కీర్తించారు. ఈ సందర్భంగా కుప్పం ప్రాంతానికి చెంది వివిధ రంగాలలో ప్రసిద్ధులైన పీఆర్ శ్యామన్న, లక్ష్మణశాస్త్రి, మునస్వామిగౌడు, సుబ్బయ్య నాయకుడు, నందిగం ఆదినారాయణనాయుడు, మునివెంకటప్ప, నారాయణప్ప, వెంకట్రామశెట్టి, కెఎల్ నారాయణలను ఘనంగా సత్కరించారు. వైద్యం మునెప్ప కుమారుడైన నాయి బ్రహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ వైద్యం శాంతారాం సోదరుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కుప్పం మండల ఎంపీపీ సాంబశివం, జడ్పీటీసీ రాజ్‌కుమార్, టీడీపీ మండలాధ్యక్షుడు చౌడప్పతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

రెండు రోగాల నివారణకు ఒకే వ్యాక్సిన్

వి.కోట : ప్రాణాంతకమైన రెండు రోగాలను ఒకే వ్యాక్సిన్‌తో నివారించవచ్చని వైద్యాధికారి మురళీకృష్ణ అన్నారు. ఎంఆర్ వ్యాక్సిన్‌ను మంగళవారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో ఎంపీపీ సులోచన ప్రారంభించారు. చిన్నారులకు రుబెల్లా, తట్టులాంటి వ్యాధులు రాకుండా ముందస్తుగా ఈ టీకాను వేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ ఛైర్మెన్ రామచంద్రనాయుడు, టీడీపీ అధ్యక్షులు రంగనాథ్, ఆసుపత్రి అబివృద్ధి కమిటీ ఛైర్మెన్ రత్నప్ప, వైస్ ఛైర్మెన్ మునెప్ప, ఎంపీడీవో బాలాజీ, ఎంఈవో చంద్రశేఖర్, ఏఈ రాజేంద్రనాయుడు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మినీ మార్కెట్ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్

రామకుప్పం : స్థానిక మినీ మార్కెట్ యార్డు అభివృద్ధికి మాస్టార్ ప్లాన్ సిద్ధం చేస్తున్నట్లు సీఎం పీఏ మనోహర్ తెలిపారు. మంగళవారం మార్కెట్ యార్డు నిర్మాణాలను పరిశీలించారు. అక్కడి నుంచే మార్కెటింగ్ శాఖ కమిషనర్ శ్యాముల్‌తో ఫోన్ లో మాట్లాడారు. త్వరలోనే ప్రత్యేక బృందాన్ని రామకుప్పం పంపించనున్నట్లు కమిషనర్ తెలిపారు. ఆయన వెంట జడ్పీటీసీ మునస్వామి, అటవీ క్షేత్రాధికారి కాళప్పనాయుడు, తహసీల్దార్ ఖాదర్‌షరీఫ్, ఎంపీడీవో శివప్రసాద్, ఈఓపీఆర్‌డీ చిన్నరెడ్డెయ్య ఉన్నారు. అనంతరం మండల కేంద్రంలో శాశ్వత హెలీప్యాడ్ కోసం స్థలాన్ని పరిశీలించారు. తర్వాత ననియాల చేరుకుని అటవీశాఖ అధికారులతో చర్చించారు. 89-పెద్దూరు, ఆరిమానిపెంటల్లో గృహ నిర్మాణాలను, వీర్నమలలో గిరిజన కమ్యూనిటీ భవనం, ముసలి మడుగులో చెరువు నిర్మాణం కోసం స్థలాన్ని పరిశీలించారు.



మినీ మార్కెట్ యార్డు నిర్మాణాలను పరిశీలిస్తున్న మనోహర్

దినఫలాలు

అదృష్టసంఖ్యలు : 6 7, 9




మేషరాశి: (మార్చి21-ఏప్రిల్20): చిన్నారులు, ప్రియతముల విషయాల్లో ప్రోత్సాహకరం. ఉన్నత విద్యా విషయాలు, సమావేశాలు, చర్చల్లో సత్ఫలితాలు సాధిస్తారు. ప్రయాణాలు, వ్యూహరచనలకు అనుకూలం.



వృషభరాశి: (ఏప్రిల్21-మే20): కుటుంబ సభ్యుల ఆరోగ్యం మెరుగవుతుంది. ఆర్థిక విషయాల్లో సన్నిహితుల సహకారం లభిస్తుంది. ఇంటి అవసరాలకు సకాలంలో డబ్బు చేతికి అందుతుంది. ఇంటి కోసం విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు.



మిథునరాశి:(మే21-జూన్21): శ్రీవారు, శ్రీమతి వైఖరి ఉల్లాసం కలిగిస్తుంది. బంధుమిత్రులతో సమావేశాలు ఫలిస్తాయి. ప్రియతముల నుంచి కీలక సమాచారం అందుకుంటారు. సమావేశాల్లో, బృందకార్యక్రమాల్లో కీలకపాత్ర పోషిస్తారు.



కర్కాటకరాశి:(జూన్22-జూలై23): విందు వినోదాల్లో పాల్గొంటారు. ఆర్థిక విషయాల్లో సహోద్యోగులు సహకరిస్తారు. అదనపు ఆదాయం కోసం చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. క్యాటరింగ్, రిటైల్ రంగం, హోటల్, వైద్య రంగాల వారికి ప్రోత్సాహకరం.



సింహరాశి:(జూలై24-ఆగస్ట్23): పెట్టుబడులు, పొదుపు పథకాలు లాభిస్తాయి. విద్యార్థులకు ప్రోత్సాహకరంగా ఉంటుంది. సృజనాత్మక రంగాల వారికి ప్రోత్సాహకరం. చిన్నారుల విషయంలో శుభ పరిణామాలు చోటుచేసుకుంటాయి.




కన్యారాశి: (ఆగస్ట్24-సెప్టెంబర్23): సోదరీసోదరుల విషయంలో శుభపరిణామాలు సంభవం. ప్రయాణాలు ఆనందం కలిగిస్తాయి. అగ్రిమెంట్లపై ఒక నిర్ణయానికి వస్తారు. విలువైన సమాచారం అందుకుంటారు. విద్యార్థులకు శుభప్రదం.



తులారాశి: (సెప్టెంబర్24-అక్టోబర్23): షాపింగ్ ఉల్లాసం కలిగిస్తుంది. ఆర్థికపరిస్థితి ప్రోత్సాహకరంగా ఉంటుంది. ఆర్థిక సంస్థలు, బ్యాంకులతో పనులు పూర్తవుతాయి. విలువైన వస్తువులు సమకూర్చుకుంటారు. ప్రేమానుబంధాలు బలపడతాయి.



వృశ్చికరాశి: (అక్టోబర్24-నవంబర్22): సంకల్పం నెరవేరుతుంది. ప్రభుత్వ సంస్థలు, రాజకీయ రంగాల వారు గౌరవ, మన్ననలు అందుకుంటారు. పెద్దల సహకారంతో లక్ష్యాలు సాధిస్తారు. వృత్తి, వ్యాపారాల విషయంలో కీలక నిర్ణయాల తీసుకుంటారు.



ధనూరాశి: (నవంబర్23-డిసెంబర్21): దూరంలో ఉన్న ప్రియతములను కలుసుకుంటారు. ఉన్నత విద్య, విదేశీ వ్యవహారాలు, ఉత్సవాలకు నిధులు సమకూరుతాయి. ముఖ్య సమాచారం అందుకుంటారు. సినీ, రాజకీయ రంగాల వారికి ప్రోత్సాహకరం.



మకరరాశి(డిసెంబర్22-జనవరి21): బృందకార్యక్రమాలు, వేడుకలకు అవసరమైన నిధులు సర్దుబాటవుతాయి. షాపింగ్ ఆనందం కలిగిస్తుంది. బ్యాంకులు, ఆర్థిక సంస్థలతో సమావేశాలు ఫలిస్తాయి. పూర్వ మిత్రులను కలుసుకుంటారు.



కుంభరాశి: (జనవరి22-ఫిబ్రవరి18): ఉన్నత పదవులు అందుకుంటారు. భాగస్వామి సహకారంతో వృత్తి, వ్యాపారాల్లో లక్ష్యాలు సాధిస్తారు. జనసంబంధాలు మెరుగుపడతాయి. వేడుకలు, శుభకార్యాల్లో ప్రముఖులను కలుసుకుంటారు.



మీనరాశి: (ఫిబ్రవరి19మార్చి20): వృత్తిపరమైన సమావేశాలు, ప్రయాణాలకు అనుకూలం. సహోద్యోగులతో చర్చలు ఫలిస్తాయి. ఉద్యోగ, వ్యాపారాల్లో లక్ష్య సాధనకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తారు. సంకల్పం నెరవేరుతుంది.

-బిజుమళ్ళ బిందుమాధవ శర్మ

గైనకాలజిస్ట్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు టౌన్: జిల్లాలోని చిత్తూరు సీహెచ్‌సీ, సత్యవేడు, మదనపల్లెలోని సీమాంక్ సెంటర్లలో గైనకాలజిస్ట్ పోస్టుల భర్తీకి అర్హులైన డాక్టర్ల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఎంఅండ్‌హెచ్‌వో విజయగౌరి తెలిపారు. ఎంపికైన డాక్టర్లకు నెలకు రూ.లక్ష జీతం ఇస్తామన్నారు. ఆసక్తి గల గైనకాలజిస్ట్‌లు ఈనెల నాలుగో తేదీ లోగా దరఖాస్తుచేసుకోవాలని కోరారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.2.74 కోట్లు

తిరుమల: తిరుమలేశుడికి హుండీ ద్వారా రూ. 2.74 కోట్ల ఆదాయం లభించింది. సోమవారం వచ్చిన కానుకలను మంగళవారం లెక్కించగా ఈ మేరకు ఆదాయం సమకూరిందని అధికారులు ప్రకటించారు. కాగా, టీటీడీ ఆధ్వర్యంలో జరుగుతున్న పథకాలకు మంగళవారం పలువురు దాతలు రూ.17 లక్షలు వితరణ చేశారు. నిత్యాన్నప్రసాదానికి రూ.16లక్షలు, వేదపరిరక్షణకు రూ.లక్ష చొప్పున అందజేశారు.

డాక్టర్ పోస్టులకు అర్హుల జాబితా విడుదల

చిత్తూరు టౌన్: కాంట్రాక్టు ప్రాతిపదికన జిల్లాలోని పీహెచ్‌సీల్లో 24 డాక్టర్ పోస్టుల భర్తీకోసం వచ్చిన దరఖాస్తుల పరిశీలించిన తరువాత అర్హుల జాబితాను విడుదల చేసినట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ విజయగౌరి మంగళవారం తెలిపారు. అభ్యర్థుల వివరాలను డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.చిత్తూరు.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో పొందుపరచామని తెలిపారు. అభ్యర్థులందరూ ఈనెల 4న ఉదయం 11 గంటలకు డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయంలో నిర్వహించే సర్టిఫికెట్ల పరిశీలనకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని ఆమె సూచించారు. సర్టిఫికెట్ల పరిశీలన అనంతరం అభ్యర్థుల మెరిట్, ఎంపిక జాబితా తయారు చేస్తామని ఆమె పేర్కొన్నారు.

మార్కెట్ ధరలు

తిరుపతి బులియన్

24 క్యారెట్ల అపరంజి	**బంగారు**
10గ్రాముల ధర	రూ.29,650
22 క్యారెట్ల ఆర్నమెంటు	**బంగారు**
గ్రాము ధర	రూ.2,736
రిటైల్ వెండి గ్రాము ధర	రూ.41.70


మదనపల్లెలో

పట్టుగూళ్ల ధరలు

కనిష్ఠం	324.10
గరిష్ఠం	410.50
సగటు	367.55

టమోటా ధరలు

మొదటి రకం	
కనిష్ఠం	35.00
గరిష్ఠం	44.00
రెండో రకం	
కనిష్ఠం	20.00
గరిష్ఠం	33.00



కోడిగుడ్లు (నెక్)

రైతు గేటు ధర-చిత్తూరు (వందగుడ్లు)	365.00
చెన్నై	: 372.00

భాషాపండితుల పదోన్నతులకు లైన్ క్లియర్

చిత్తూరు సిటీ : భాషాపండితులకు పదోన్నతులను కల్పించిన తర్వాతే బదిలీలు చేపట్టాలని ప్రభుత్వం మంగళవారం ఆదేశాలు జారీచేసిందని రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దొడ్డా ఉమామహేశ్వర్, సిబ్బల కిరణ్ కుమార్ ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. జీవో 247 ప్రకారం పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సంధ్యారాణి ఆదేశాలు జారీచేశారన్నారు. ఉన్నత పాఠశాలల్లోని తెలుగు, హిందీ, ఉర్దూ తదితర 1450 భాషా పండితుల పోస్టులను అప్‌గ్రేడ్ చేస్తూ జీవో 114 విడుదల చేసి, అప్‌గ్రేడ్ అయిన పోస్టులను భర్తీ చేయానికి జీవోలు 14, 15 విడుదల చేసి జీవోకు అనుగుణంగా మూడు జిల్లాల్లో పదోన్నతులు చేపట్టి భాషాపండితులకు న్యాయంచేసినట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల కారణంగా 10 జిల్లాల్లో పదోన్నతులను చేపట్టలేదన్నారు. దీనిపై ఎస్టీటీ ఉపాధ్యాయులు ట్రిబ్యునల్‌ను ఆశ్రయించి స్టే తీసుకొచ్చి భాషాపండితుల పదోన్నతులకు ఆటంకం కలిగించారని పేర్కొన్నారు. దీనిపై రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ హైకోర్టును ఆశ్ర యించి జీవో నెంబర్లు 14, 15 ప్రకారం భాషాపండితులకు పదోన్నతులు కల్పించాలని పిల్ దాఖలు చేసినట్లు తెలిపారు.

స్వాతంత్ర్య దినోత్సవాల్లో 20 వేలమందికి ఏర్పాట్లు

చిత్తూరు టౌన్/చిత్తూరు సిటీ : ఆగస్టు 15వ తేదీన తిరుపతిలో నిర్వహించనున్న స్వాతంత్ర్య దినోత్సవాల్లో 20 వేల మంది హాజరయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ ప్రద్యుమ్న తెలిపారు. తిరుపతిలోని తారకరామ స్టేడియంలో జరిగే వేడుకలకు సీఎం చంద్రబాబు, గవర్నర్ నరసింహన్X తోపాటు మంత్రులు, ప్రజాప్రతినిధులు, వీవీఐపీలు, వీఐపీలు హాజరవుతారని చెప్పారు. తొలిసారిగా తిరుపతిలో రాష్ట్రస్థాయి స్వాతంత్ర్య దినోత్సవాలు నిర్వహిస్తుండడంతో, చిత్తూరులోని పోలీసు మైదానంలో నిర్వహించే వేడుకలపై ఆలోచిస్తున్నామన్నారు. జిల్లాలో విశిష్ట సేవలందించిన అధికారుల్లో కొందరికి ఉత్తమ ప్రశంసా పత్రాలను సీఎం చేతుల మీదుగా అందించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు.

మాజీ సైనికులంతా పాల్గొనాలి

తిరుపతిలో జరిగే స్వాతంత్ర్య దినోత్సవాల్లో మాజీ సైనికులంతా పాల్గొనాలని చిత్తూరు డివిజన్ మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు యం,రామచంద్ర, పి.నాగరాజు కోరారు. ఆసక్తిగల మాజీ సైనికులంతా బుధవారం ఉదయం 9గంటలకు తారకరామా స్టేడియంలో జరిగే ఎంపికలకు హాజరు కావాలని సూచించారు.

రోడ్డు ప్రమాదాల కట్టడికి మాస్టర్ ప్లాన్

పోలీసు, ఆర్టీసీ, రవాణా శాఖలతో ప్రత్యేక టాస్క్‌ఫోర్సు : కలెక్టర్ ప్రద్యుమ్న

చిత్తూరు టౌన్ : రోడ్డు ప్రమాదాల కట్టడికి బృహత్తర ప్రణాళికను సిద్ధం చేస్తున్నామని కలెక్టర్ ప్రద్యుమ్న తెలిపారు. పోలీసు, ఆర్టీసీ, రవాణా శాఖల సంయుక్త ఆధ్వర్యంలో ప్రత్యేక టాస్క్‌ఫోర్సును ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందుతున్న వారిలో అధిక శాతం ద్విచక్రవాహనాల ప్రమాదాల్లోనే మృత్యువాత పడుతున్నారని దీనిని దృష్టిలో పెట్టుకుని జిల్లాలో హెల్మెట్ వాడకాన్ని తప్పనిసరి చేయనున్నామని కలెక్టర్ చెప్పారు. రోడ్డు ప్రమాదాలు ఎక్కడ ఎక్కువగా జరుగుతున్నాయి, మృతుల సంఖ్య వంటి వాటిపై గత రెండు నెలలుగా సర్వే చేపట్టామన్నారు. జాతీయ రహదారులపైనే అధికంగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, గ్రామ పంచాయతీ రోడ్లపై నుంచి జాతీయ రహదారులను కలిసే ప్రాంతాలలోనూ ప్రమాదాలు జరుగుతున్నాయని గుర్తించామన్నారు. జిల్లాలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో 25 శాతం విద్యుత్ దీపాలు లేని కారణంగా జరుగుతున్నాయని గుర్తించినట్లు చెప్పారు. దీంతో జాతీయ రహదారులు, ముఖ్య కూడలి ప్రాంతాలు, గ్రామీణ ప్రాంత రోడ్లను కలుపుతూ పోయే జాతీయ రహదారుల ప్రాంతాలలోనూ యుద్ధప్రాతిపదికన విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించామన్నారు. జిల్లాలో ద్విచక్రవాహనదారులకు హెల్మెట్ వాడకాన్ని తప్పనిసరి చేయనున్నామని కలెక్టర్ తెలిపారు.

త్వరలో చిత్తూరు- నాయుడుపేట రోడ్డు విస్తరణ పనులు

చిత్తూరు- నాయుడుపేట రోడ్డు విస్తరణ పనులను త్వరలో చేపట్టనున్నామని కలెక్టర్ తెలిపారు. రోడ్డు విస్తరణకు కేంద్రం సైతం ఆమోదించిందని, ఇందుకు అవసరమైన నిధులు (నష్టపరిహారం, ఇతర ఖర్చులకు సంబంధించి) సైతం కేంద్రం విడుదల చేయనుందన్నారు.

ఎస్‌డీఎస్ మూర్తికి లైఫ్ మెంబర్‌షిప్ అవార్డు



తిరుపతి(టీటీడీ): శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో బయోటెక్నాలజీ విభాగంలో ఆచార్యులైన ఎస్‌డీఎస్ మూర్తికి విశ్వవిద్యాలయం లైఫ్ మెంబర్ షిప్ అవార్డు ప్రదానం చేసింది. సొసైటీ ఫర్ ప్లాంట్ రీసెర్చ్‌లో విస్తృత పరిశోధనలు చేయడంతో విభాగపు ప్రధానాచార్యులు ఆచార్య ఎస్‌కే భట్నాగర్ తదితరులు మూర్తికి మంగళవారం అవార్డు అందజేశారు. అవార్డు అందుకున్న మూర్తిని సహచర అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

17 మండలాల్లో వర్షం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లావ్యాప్తంగా గడచిన 24 గంటల్లో పలు మండలాల్లో తేలిక పాటినుండి ఓ మోస్తరు వర్షం కురిసింది. అత్యధికంగా గుడుపల్లెలో 71.4 మి.మీ అత్యల్పంగా 0.6 మి.మీ. ఏర్పేడులో నమోదయ్యింది. మండలాలవారీగా కలకడలో 8మి.మీ, కేవీపల్లెలో 3.2, తిరుపతి అర్బన్‌లో 2, రేణిగుంటలో 1, ఏర్పేడులో 0.6, శ్రీకాళహస్తిలో 5.2, తొట్టంబేడులో 5.6, రామసముద్రంలో 2, పులిచెర్లలో 2.2, గంగవరంలో 1.6, పెద్దపంజాణిలో 8.2, బైరెడ్డిపల్లెలో 5.6, వి.కోటలో 31, రామకుప్పంలో 48.8, శాంతిపురంలో 22.0, కుప్పంలో 42.4 మిమీ వర్షపాతం కురిసింది.

5 నుంచి అంబేడ్కర్ జీవితచరిత్ర నాటక ప్రదర్శన

తిరుపతి (టీటీడీ): ఆంధ్రప్రదేశ్ ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ ద్వారా భారత రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవితచరిత్ర నాటకాన్ని జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ప్రదర్శించనున్నామని ఆ సంఘం అధ్యక్షుడు పి.పరమశివన్ మంగళవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. 5వ తేదీ పుంగనూరు ప్రభుత్వ కళాశాల ప్రాంగణంలో, 6వ తేదీ మదనపల్లె మిషన్ కాంపౌండ్‌లో, 7న పీలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, 8న తిరుపతి శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం శ్రీనివాస ఆడిటోరియంలో, 9న పాదిరికుప్పంలోని ప్రాథమిక పాఠశాల అంబేడ్కర్ విగ్రహం వద్ద, చివరగా 10వ తేదీ జిల్లా కేంద్రమైన చిత్తూరు అంబేడ్కర్ భవనంలో నాటకాన్ని ప్రదర్శించనున్నారు. చివరి రోజు జిల్లా సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జీవిత చరిత్ర నాటకాన్ని ప్రదర్శించనున్నారు.

ఆర్టీసీ డ్రైవర్‌కు రూ. వెయ్యి జరిమానా

చిత్తూరు టౌన్ : సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ విధులు నిర్వర్తించిన ఆర్టీసీ బస్సు డ్రైవర్‌కు పోలీసులు రూ. 1000 జరిమానా విధించారు. చిత్తూరు నుంచి వేలూరు బస్సును సెల్ఫోన్X లో మాట్లాడుతూ నడుపుతున్న దృశ్యాలు, బస్సు నెంబర్‌ను లోకేశ్X అనే ప్రయాణికుడు ఎస్పీకి వాట్సాప్ ద్వారా పంపారు. దీంతో స్పందించిన ఎస్పీ తక్షణం ఆ బస్సు డ్రైవర్‌కు జరిమానా వేయాలని పోలీసులను ఆదేశించారు. ఈ మేరకు గుడిపాల మండలంలోని వేలూరు హైవేలో బస్సును చిత్తూరు వెస్ట్ సీఐ ఆదినారాయణ ఆపారు. బస్సు డ్రైవర్ చిట్టిబాబును గుడిపాల పోలీసు స్టేషన్‌లో కౌన్సెలింగ్ ఇచ్చారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేసినందుకు జరిమానా కింద డ్రైవర్ నుంచి రూ.1000 వసూలు చేసి సీఐ రసీదు ఇచ్చారు.



డ్రైవర్ చిట్టిబాబుకు జరిమానా విధిస్తున్న సీఐ ఆదినారాయణ

కాలేనాయక్ కోసం వేట ముమ్మరం

మొత్తం 4 బృందాల ఏర్పాటు

నోటీసులు జారీ చేసిన కార్మికశాఖ

తిరుపతి (నేరవిభాగం): బాల కార్మికులతో అక్రమంగా టపాసులు తయారు చేయిస్తూ ఇద్దరి మృతికి కారణమైన కాలేనాయక్ కోసం పోలీసులు వేట ముమ్మరం చేశారు. తిరుపతి శివారులో ఆదివారం రాత్రి గోడౌన్ పేలగానే అక్కడే ఉన్న కాలే నాయక్ వెంటనే ఇంటికి తాళం వేసి కుటుంబం సహా వెళ్లిపోయాడు. దీంతో పోలీసులు అతడికోసం వేట ప్రారంభించారు. అతడి స్వగ్రామమైన పచ్చికాపల్లం సమీపంలోని సపారియాలో విచారించారు. నాయక్ కాల్‌లిస్ట్ ఆధారంగా అతడి బంధువులు, స్నేహితులను గుర్తించి విచారిస్తున్నారు.

తమిళనాడుపైనే దృష్టి: ఇప్పటి వరకు సేకరించిన సమాచారం మేరకు నాయక్ తమిళనాడులో మకాం వేసి ఉంటాడని పోలీసులు భావిస్తున్నట్లు సమాచారం. మొత్తం నాలుగు బృందాలుగా ఏర్పడి గాలిస్తున్నారు. ఒక సాంకేతిక బృందంతోపాటు రెండు ప్రత్యేక బృందాలు కలుపుకుని మొత్తం 16 మంది తమిళనాడులో వేట సాగిస్తున్నారు. మరో బృందం ఈకేసుకు సంబంధించి జిల్లాలో పరిశోధన సాగిస్తున్నట్లు పోలీసు వర్గాల ద్వారా తెలిసింది.

మళ్లీ క్లూస్‌టీం పరిశీలన: పేలుడు జరిగిన ప్రదేశాన్ని క్లూస్‌టీం మంగళవారం పరిశీలించింది. ఘటన జరిగిన వెంటనే ఆదివారం రాత్రి క్లూస్‌టీం ఘటనా స్థలంలో పరిశీలించింది. మరోసారి ఆ ప్రదేశంలో పరిశీలించడం ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. రెండోసారి పరిశీలనలో కీలకమైన అంశాలేమైనా వెల్లడయ్యాయా అనేది తెలియాల్సి ఉంది.

కార్మికశాఖ నోటీసులు: కార్మిక శాఖ తిరుపతి అధికారులు మంగళవారం కాలేనాయక్‌కు నోటీసులు జారీచేశారు. నిబంధనలకు వ్యతిరేకంగా బాలకార్మికులను పనిలో చేర్చుకోవడం నేరం. ఇక, బాలకార్మికులు మృతి చెందిన ఘటన ఆధారంగా సుమోటోగా కేసు తీసుకున్న కార్మికశాఖ డిప్యూటీ లేబర్ కమిషనర్ విద్యాసాగర్, అసిస్టెంట్ లేబర్ కమిషనర్ శ్రీమన్నారాయణ నోటీసులు జారీచేశారు. నోటీసులు అందించేందుకు నాయక్ ఇంటికి సిబ్బంది వెళ్లగా తాళాలువేసి ఉండటంతో గోడకు అంటించి వెళ్లారు. నాయక్ పట్టుబడిన తర్వాత ఆయనపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఏసీఎల్ శ్రీమన్నారాయణ వెల్లడించారు. బాధితులకు నష్టపరిహారం అందించేలా చర్యలు చేపడతామన్నారు.

తిరుమలలో అన్యమతస్తుల కలకలం

హిందువులేనని తేలటంతో వదిలిపెట్టిన పోలీసులు



మహారాష్ట్ర భక్తులను విచారిస్తున్న భద్రతాసిబ్బంది

తిరుమల: తిరుమలకు అన్యమతస్తులు వచ్చారంటూ మంగళవారం కలకలం రేగింది. తీరా పోలీసులు విచారించగా వారు హిందువులేనని తేలటంతో వదిలిపెట్టారు. సీఐ వెంకటరవి కథనం మేరకు.. మహారాష్ట్రలోని బ్రాహ్మిన్ అనే గ్రామానికి చెందిన 29 మంది యువకులు శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చారు. తలనీలాలు సమర్పించి శ్రీవారిని దర్శించుకున్నారు. ఏఎన్‌సీ కాటేజీలో గదిని అద్దెకు తీసుకున్నారు.సందీప్ అనే వ్యక్తి ఇతర మతానికి చెందిన పదాలతో గట్టిగా అరుస్తుండటాన్ని స్థానికులు గుర్తించారు. అన్యమతస్తులు వచ్చారంటూ విజిలెన్స్ అధికారులకు సమాచారమిచ్చారు. ఆ ప్రాంతానికి చేరుకున్న విజిలెన్స్, భద్రతా సిబ్బంది వారిని అదుపులోకి తీసుకుని టూటౌన్ పోలీసులకు అప్పగించారు. సీఐ వెంకటరవి విచారించగా యువకులంతా హిందువులేనని గుర్తించారు. మతిస్థిమితం లేకపోవటంతోనే సందీప్ అలా అరిచాడని తేలింది. వారి వద్దనుంచి క్షమాపణ లేఖను తీసుకున్నాక విడిచిపెట్టారు.

శ్రీవారి పుష్కరిణి మరమ్మతులు ప్రారంభం

తిరుమల: శ్రీవారి పుష్కరిణి మరమ్మతులను మంగళవారం టీటీడీ అధికారులు ప్రారంభించారు. ప్రతి ఏడాది శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాల ముందు పుష్కరిణి శుద్ధి చేయటం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా మంగళవారం నుంచి ఈ పనులు మొదలయ్యాయి. పుష్కరిణి గేట్లు మూసేసి నీటిని మొత్తాన్ని తోడేస్తారు. తర్వాత ఫ్లోరింగ్‌కు మరమ్మతులు చేసి, పైపులైన్లను సరిచేస్తారు. అన్ని ప్రాంతాల్లో రంగులు వేసి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేలా ప్రణాళికలు రూపొందించుకున్నారు. ఈ నేపథ్యంలో భక్తులకు పుష్కరిణికి పడమరవైపు తాత్కాలికంగా స్నానపు గదులను ఏర్పాటు చేశారు. నెలపాటు భక్తులు ఈ గదుల్లోనే స్నానాలు చేయాల్సి ఉంటుంది. ఈ మేరకు పుష్కరిణి వద్ద ఈ సమాచారాన్ని తెలుపుతూ వివిధ భాషల్లో భారీ ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. దీనిపై టీటీడీ జేఈవో శ్రీనివాసరాజు మీడియాతో మాట్లాడుతూ.. పనులు జరుగుతుండటంతో పుష్కరిణిలోకి నెలపాటు భక్తులకు అనుమతి లేదన్నారు. సెప్టెంబరు నుంచి అనుమతిస్తామని తెలిపారు.

భారీ విస్ఫోటానికి కారణం

ఎలక్ట్రికల్ ఈడీలేనా..?

పేలిన గోడౌనులో బండరాళ్లను పగులగొట్టే కేపుల తయారీ



తిరుపతి (నేరవిభాగం): తిరుపతి శివారులో ఆదివారం రాత్రి జరిగిన భారీ విస్ఫోటానికి అసలు కారణం టపాకాయల పేలుళ్లు కాదు.. బండరాళ్లను పగలగొట్టడానికి ఉపయోగించే ఎలక్ట్రికల్ ఈడీలు (వ్యవహారిక భాషలో కేపులు) అనే అనుమానాలు బలపడుతున్నాయి. ఇవి పేలడం వల్లే అంత పెద్ద శబ్దం రావడంతో పాటు భవనం కుప్పకూలిందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సంఘటనా స్థలంలో లభించిన అల్యూమినియం ఎలక్ట్రికల్ ఈడీలు దీనిని బలపరుస్తున్నాయి.

నల్లమంద గోడౌన్ పేలిన సందర్భంగా సుమారు మూడు కిలోమీటర్ల దూరం భయంకరమైన శబ్దం వినిపించింది. రెండు, మూడు కిలోమీటర్ల వరకు భవనాలు సైతం కంపించాయి. గోడౌన్ నిలువునా కూలిపోయింది. టపాకాయలు పేలుంటే ఇంత తీవ్రత ఉండేది కాదు. గోడౌన్ తగలబడటం, అందులోని కార్మికులు సజీవ దహనమయ్యేవారు. కానీ, రెండు, మూడు కిలోమీటర్ల దూరంలోని భవనాలు కంపించే అవకాశం లేదు. పైగా మృతదేహాలు ఛిద్రమై 150 అడుగుల దూరంలో పడే అవకాశమే లేదు. ఇలా జరిగిందంటే టపాకాయల కన్నా శక్తిమంతమైన పేలుడేదో జరిగుండాలి. సాధారణంగా శవయాత్రలు, ర్యాలీల సందర్భంగా పేల్చే పెద్ద సైజు టపాసులు (వ్యవహారిక భాషలో బాంబులు) పెద్ద శబ్దం చేస్తాయి. అవి పేలిన స్థలంలో భూమిని ధ్వంసం చేయగల శక్తి వీటికి ఉండదు. అయితే మిట్టగాంధీపురం సమీపంలోని పద్మావతి నగర్‌లో జరిగిన గోడౌన్ పేలుడులో దీనికి భిన్నమైన వాతావరణం కనిపించింది. భవనం నేలమట్టం కావడంతో పాటు భీకరమైన శబ్దం చుట్టుపక్కల ఉన్న భవనాలను కదిల్చివేసింది. అంటే ఈ గోడౌన్ లో తయారు చేస్తున్నది కేవలం టపాసులు కాదని, అంతకన్నా శక్తిమంతమైన పేలుడు పదార్థాలనేది స్పష్టమవుతోంది.

ఈడీలను దేనికి వాడతారంటే..!: గ్రానైట్ క్వారీలను పగొలగొట్టడానికి జిలెటిన్ స్టిక్స్ వాడతారు. తక్కువ సైజులో ఉండే బండరాళ్లను పగులగొట్టడానికి ఎలక్ట్రికల్ ఈడీలు వినియోగిస్తారు. బండకు రంధ్రం చేసి అందులో ఈ ఎలక్ట్రికల్ ఈడీలు పెడతారు. చుట్టూ ఉప్పు పోసి ప్యాక్ చేసి బ్యాటరీ సాయంతో పేలుస్తారు. ఇలా ఉప్పుతో ప్యాక్‌చేయడం వల్ల వీటి శక్తి నాలుగు రెట్లు పెరుగుతుంది. నాలుగేళ్లుగా వీటి వినియోగం తగ్గిపోయింది. కొత్తగా క్వారీ పౌడర్ అందుబాటులోకి వచ్చింది. ఈ పౌడర్‌ను వేడినీళ్లలో కలిపి రాత్రి రంధ్రాల్లో పోస్తే కొన్ని గంటలకు బండరాయి నెర్రెలిస్తుంది. ఈ పౌడర్‌ను అత్యంత జాగ్రత్తగా ప్రభుత్వ యంత్రాంగమే విక్రయిస్తోంది. దీంతో పాటు మరిన్ని అధునాతన పద్ధతులు రావడంతో గ్రానైట్ యజమానులు ఇప్పుడు జిలెటిన్ స్టిక్స్, ఎలక్ట్రికల్ ఈడీలను వాడటంలేదు. అయితే, కాలువ.. చెరువు పనులు చేసే సమయంలో అడ్డుగా వచ్చిన బండరాళ్లను పగులగొట్టడానికి ఎలక్ట్రికల్ ఈడీలు వాడుతున్నారు. అలాగే, అనుమతి లేని క్వారీ తవ్వకాల్లో కూడా వీటిని వినియోగిస్తున్నారు. క్వారీ పౌడర్ పొందాలంటే అనుమతి పొందిన క్వారీలు ఉండాలి. అక్రమ క్వారీలకు ఇలా దొంగచాటుగా ఎలక్ట్రికల్ ఈడీలు వినియోగిస్తున్నారు. ఇలాంటి వారి కోసం కాలేనాయక్ రహస్యంగా ఎలక్ట్రికల్ ఈడీలు తయారు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ విషయం బయటకు రాకుండా ఉండేందుకు శవయాత్రల సందర్భంగా వినియోగించే భారీ సైజు టపాకాయల తయారీ చేపట్టారన్నమాట. ఇవి పేలడం వల్లే ఇంత భారీ విస్ఫోటం సంభవించిందని భావిస్తున్నారు.

కాగా, పోలీసులు మాత్రం మంగళవారం వరకు దీనిని టపాకాయల గోడౌన్ గా భావిస్తున్నారు. నిజంగా టపాసులే తయారు చేస్తుంటే ఎలక్ట్రికల్ ఈడీలు (కేపులు) ఎందుకు ఉన్నాయన్న ప్రశ్నకు పోలీసు వర్గాల నుంచి సమాధానం రావడం లేదు. ఏదేమైనా ఈ ఘటనతో తిరుపతిలో భారీ ప్రమాదకరమైన కార్యకలాపాలు జరుగుతున్నాయనే విషయం రుజువైంది. నేర తీవ్రతను గమనించి పోలీసులు చర్యలు తీసుకోకుంటే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని ఈ ఘటన హెచ్చరిస్తోంది.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో జాప్యం చేయొద్దు

ఎఫ్ఐఆర్ అయిన 48 గంటల్లోనే కులధ్రువీకరణ పత్రాన్ని పోలీసులకు ఇవ్వండి - తహసీల్దార్లకు సబ్‌కలెక్టర్ ఆదేశం



సమావేశంలో ప్రసంగిస్తున్న నిషాంత్ కుమార్

తిరుపతి (జీవకోన): 'ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో జాప్యం చేయొద్దు. ఎఫ్ఐఆర్ అయిన 48 గంటల్లోనే కుల ధ్రువీకరణ పత్రాన్ని సంబంధిత పోలీసు స్టేషన్‌కు అందజేయండి' అని తహసీల్దార్లను సబ్ కలెక్టర్ నిషాంత్ కుమార్ ఆదేశించారు. మంగళవారం ఉదయం తిరుపతి సబ్ కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో డివిజనల్ స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నిషాంత్ కుమార్ మాట్లాడుతూ ప్రతి మండలంలో నెలకొకసారి తహసీల్దారు, ఎస్ఐ సమన్వయం చేసుకుని సివిల్ రైట్స్ డే నిర్వహించాలన్నారు. దీనికి సంబంధించిన వివరాలను రిజిస్టర్ చేసి, ఫొటోగ్రఫీ ఫైలింగ్ చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీల సమస్యల పరిష్కారం కోసం వారంలో ఓ రోజు కేటాయించాలన్నారు. అట్రాసిటీ కేసుల వివరాలను సబ్‌కలెక్టరేట్‌కు పంపాలన్నారు. కాగా, కుల ధ్రువీకరణ పత్రాలు తహసీల్దార్ల నుంచి ఆలస్యంగా రావడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని డీఎస్పీలు సబ్‌కలెక్టర్‌కు వివరించారు. ప్రాంతాల వారీగా కేసుల వివరాలను తెలియజేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఎస్సీ, ఎస్టీలకు అందేలా చూడాలన్నారు. పంట సంజీవిని కుంటలు, మరుగుదొడ్ల నిర్మాణం, డ్రిప్, వనం- మనం ద్వారా మొక్కల పెంపకం, నీరు- ప్రగతి వంటి పనులను చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారని తెలిపారు. చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి మాట్లాడుతూ సమావేశానికి సంబంధించిన అజెండా కాపీలు 15 రోజులు ముందుగానే సభ్యులకు అందజేయాలన్నారు. సమావేశాలు కూడా సకాలంలో నిర్వహించడం లేదన్నారు. ఎఫ్ఐఆర్ అయిన కేసులకు సంబంధించి బాధితులకు సకాలంలో పరిహారం అందజేయాలన్నారు. అనంతరం ఏర్పేడు ఎస్టీ కాలనీకి చెందిన 150 కుటుంబాలకు గతంలో ప్రభుత్వం 92 ఎకరాల భూమిని అందజేసిందని లోకయ్య తెలిపారు. ప్రస్తుతం ఆ భూమిని ఆన్‌లైన్ చేయడం లేదని సబ్‌కలెక్టర్‌కి అర్జీ రూపంలో విన్నవించారు. చంద్రగిరి మండలం పుల్లయ్యగారిపల్లెకు చెందిన సిద్ధమ్మ తనకున్న భూమిని అగ్రవర్ణాల వారు ఆక్రమించుకున్నారని వాపోయారు. ఈ సమావేశంలో డివిజన్ పరిధిలోని డీఎస్పీలు, తహసీల్దార్లు చంద్రమోహన్, రాజగోపాల్, గిరిజన సంఘ నాయకుడు కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన అంతర వర్సిటీల బోధనేతర సిబ్బంది క్రీడా పోటీలు

క్రికెట్‌లో విజేత ఎన్టీఆర్ ఆరోగ్యవర్సిటీ జట్టు - రన్నరప్‌గా ఎస్వీయూ

తిరుపతి (క్రీడలు): శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఆతిథ్యమిస్తున్న రాష్ట్రస్థాయి అంతర విశ్వవిద్యాలయాల బోధనేతర సిబ్బంది క్రీడా పోటీలు మంగళవారం ముగిశాయి. ఎస్వీయూ స్టేడియంలో మంగళవారం ఉదయం జరిగిన క్రికెట్ ఫైనల్స్‌లో ఎన్టీఆర్ ఆరోగ్యవర్సిటీ (విజయవాడ) జట్టు ఏడు వికెట్ల తేడాతో ఎస్వీయూ (తిరుపతి)పై విజయం సాధించింది. టాస్ నెగ్గి తొలుత బ్యాటింగ్ చేసిన ఎస్వీయూ జట్టు 12 ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 96 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఎన్టీఆర్ ఆరోగ్య వర్సిటీ జట్టు 11.3 ఓవర్లలో మూడు వికెట్ల నష్టానికి 97 పరుగులు చేసి గెలుపొందింది. క్రీడాకారులకు ఎస్వీయూ వీసీ చాంబర్‌లో ట్రోఫీలు, వ్యక్తిగత బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వీసీ ఆవుల దామోదరం, రెక్టార్ ప్రొఫెసర్ భాస్కర్, రిజిస్ట్రార్ దేవరాజులునాయుడు, వ్యాయామ విభాగాధిపతులు కృష్ణమూర్తి, గిరిధర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.



ఎస్వీయూ జట్టుతో వీసీ దామోదరం తదితరులు





మాజీ మంత్రి గల్లా అరుణకుమారికి మంగళవారం జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్న టీడీపీ నాయకులు చింతగుంపల రజనీకుమార్ -ఆముదపాకల శ్రీహరి నాయుడు - ఊకా విజయకుమార్

రాహు-కేతు పూజల్లో ముస్లిం కుటుంబం



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో రేణిగుంటకు చెందిన మహబూబ్‌బాషా అనే ముస్లిం వ్యక్తి కుటుంబ సభ్యులతో కలసి సోమ వారం రాహు-కేతు సర్పదోష నివారణ పూజలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ఆలయ ఈవో భ్రమరాంబను మర్యాదపూర్వకంగా కలిశారు. ముక్కంటి ఆలయంలో రాహు-కేతు పూజలు చేయించుకుంటే కోర్కెలు నెరవేరు తాయన్న నమ్మకంతో ఈ పూజలు చేయించుకు న్నట్టు ఆయన చెప్పారు.ఈ కార్యక్రమంలో పీఆర్వో హరిబాబు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

తరిగొండ వెంగమాంబకు పుష్పాంజలి

ఆంధ్రజ్యోతి, తిరుమల: మాతృశ్రీ తరిగొండ వెంగ మాంబ 200వర్ధంతి సందర్భంగా తిరుమలలోని ఆమె బృందావనంలో ఆ ప్రాజెక్టు సమన్వయాధికారి ఆచార్య కేజే కృష్ణమూర్తి మంగళవారం ఘనంగా పుష్పాంజలి సమర్పించారు. శ్రీవారి అపార భక్తురాలైన వెంగ మాంబ తిరుమలలో తొలిసారిగా అన్నప్రసాద వితర ణను ప్రారంభించారని గుర్తుచేశారు. శ్రీవారి సన్నిధిలో ఆమె ప్రవేశపెట్టిన ముత్యాలహారతి ఇప్పటికీ కొనసా గుతోందన్నారు. వెంగమాంబ జయంతి, వర్ధంతి ఉత్స



వాలు క్రమం తప్పకుండా టీటీడీ నిర్వహిస్తూ భక్తిత త్వాన్ని వ్యాప్తి చేస్తునట్టు ఆయన వివరించారు.

అర్హులైన పిల్లలందరికీ
ఎంఆర్ టీకాలు

- తల్లిదండ్రులు చొరవ తీసుకోవాలి
- కలెక్టర్ ప్రద్యుమ్న పిలుపు




ఎంఆర్ వ్యాక్సిన్ వేస్తున్న డీఎంఅండ్‌హెచ్‌వో - వ్యాక్సిన్ వేసుకున్న విద్యార్థిని ఫొటో తీస్తున్న కలెక్టర్

చిత్తూరు టౌన్: జిల్లాలో 15 సంవత్సరాలలోపున్న 10.30 లక్షలమంది పిల్లలందరికీ మీజిల్స్ రూబెల్లా (ఎంఆర్) టీకాలు వేయించేందుకు చర్యలు తీసుకున్నా మమని కలెక్టర్ ప్రద్యుమ్న తెలిపారు.వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మంగళవారం చిత్తూరులోని పీసీఆర్ ప్రభు త్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎంఆర్ టీకాల కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. డీఎంఅండ్‌హె చ్‌వో విజయగౌరి, డీసీహెచ్‌ఎస్ సరళ, డీఐవో రామనా రాయణ రెడ్డి పిల్లలకు టీకాలు వేయగా, చిత్తూరు మే యర్ కటారి హేమలత పిల్లల చేతి వేళ్ళకు మార్కింగ్ చేశారు. టీకాలు వేసుకున్న పిల్లలను ట్యాబ్ ద్వారా ఫొటో తీసి నూతన యాప్‌లో కలెక్టర్ అప్‌లోడ్ చేశా రు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ9నెలల నుంచి 15 సంవత్సరాలలోపు పిల్లలున్న తల్లిదండ్రులు బాధ్య తగా ఎంఆర్ వ్యాక్సిన్ వేయించాలని కోరారు. వ్యాక్సినే షన్ కార్యక్రమాన్ని సెప్టెంబర్ 8వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. పాఠశాలలు, అంగన్ వాడీ కేంద్రాలు, పీహెచ్‌సీల్లో పిల్లలకు టీకాలు వేస్తారన్నారు. టీకాల కార్యక్రమం పర్యవేక్షణకు ప్రత్యేకా ధికారులను నియమించామన్నారు.క్షయవ్యాధి నివారణా ధికారి రమేష్, జవహర్ బాలల ఆరోగ్య రక్ష (జబ్బార్) జిల్లాకో ఆర్డినేటర్ సుదర్శన్,డాక్టర్ జానకి రావు, ఎస్‌వో రమేష్, డెమో నిర్మల,డీఐవో సెక్షన్ ఇన్‌ఛార్జి ఢిల్లి, టీడీపీ నేత కటారి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.తొలిరోజు లక్ష్యం 1.97లక్షలు కాగా 1.95లక్షల మందికి ఎంఆర్ టీకాలు వేసినట్లు జిల్లా ఇమ్యునైజేషన్‌ అధికారి రామ నారాయణ రెడ్డి మంగళవారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రద్యుమ్న

లక్ష మంది బాలికలకు
కరాటేలో శిక్షణ: కలెక్టర్

చిత్తూరు సిటీ : జిల్లాలో లక్షమంది బాలికలకు కరాటేలో శిక్షణ ఇవ్వనున్నామని కలెక్టర్ పీఎస్ ప్రద్యుమ్న చెప్పారు. మంగళవారం చిత్తూరు కణ్ణన్ కళాశాల మైదానంలో ప్రారంభమైన బాలికల ఆత్మరక్షణ కరాటే శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 625 ఉన్నత పాఠశా లల్లో లక్షమంది విద్యార్థినులకు కరాటేలో శిక్షణ ఇస్తామన్నారు. ఇందుకోసం 90 మంది కరాటే మాస్టర్లను గుర్తించామన్నారు.కరాటే నేర్చుకుంటే క్రమశిక్షణతో పాటు ఆత్మవిశ్వాసం అలవడు తుందన్నారు.అడిషినల్ ఎస్పీ రాధిక మాట్లాడుతూ బాలికలు ఐరన్ ఫుడ్ తీసుకోవాలన్నారు. అపరిచితులను నమ్మకూడదని సూచించారు.ఇన్‌చార్జి డీఈవో శామ్యూల్, ఎస్‌ఎస్‌ఏ సెక్టోరల్ అధికారులు లోకనాథం, పీసీ అరుణ, మహ్మద్ ఖాన్ తదతరులు పాల్గొన్నారు.



కరాటే శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న బాలికలు



అశ్వవాహనంపై ద్రౌపదీ సమేత ధర్మరాజు

పుత్తూరు: పుత్తూరు పట్టణంలోని ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయ వార్షిక ఉత్సవాల్లో మంగళవారం అమ్మవారు అశ్వ వాహనంపై విహరించారు. ఉదయం బెస్త సంఘం ఆధ్వర్యంలో గ్రామోత్సవం జరిగింది. రాత్రి అశ్వవాహన సేవ జరిగింది. ఆలయ కమిటీ ఛైర్మన్ కిష్టప్ప మొదలి, సభ్యులు శివలింగారెడ్డి, మోహన్, వాగ్దేవి తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఎంఆర్ వ్యాక్సినేషన్ ప్రారంభం






పుత్తూరు, కార్వేటినగరం, వడమాలపేట, వెదురుకుప్పంల్లో జరిగిన ఎంఆర్ టీకా శిబిరాలు

పుత్తూరు: ఎంఆర్ వ్యాక్సిన్‌తో మీజిల్సు, రుబెల్లాను నియంత్రించవచ్చని ఎమ్మెల్సీ ముద్దుకృష్ణమ చెప్పారు. పుత్తూరు పట్టణంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో టీకా శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 9నెలల చిన్నారుల నుంచి 15 ఏళ్ళ లోపు పిల్లలందరికీ టీకాలు వేయించాలని తల్లిదండ్రులను ఆయన కోరారు. పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మన్ జీవరత్నంనాయుడు, మున్సిపల్ ఛైర్మన్ యుగంధర్, వైద్యులు పద్మావతి, రవిరాజు, జయపాలన్, నవీన్, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

శ్రీరంగరాజపురం: ఎస్ఆర్ పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంఆర్ టీకా శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి శ్రీలత, సీఎస్‌వో పురుషోత్తం, ల్యాబ్ టెక్నిషియన్ డేవిడ్, సూపర్‌వైజర్ సుబ్రహ్మణ్యం, తిరుమలయ్య, ఏఎన్ఎంలు దేవి నీరజ పాల్గొన్నారు.

కార్వేటినగరం: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎంఆర్ వ్యాక్సిన్‌ను విద్యార్థులకు వేశారు. ఎంపీపీ జనార్దన రాజు, వైద్యాధికారి చక్రపాణి, ఎంఈవో విజయకుమార్, ఇన్‌చార్జి హెచ్ఎం జయనందం, పర్యవేక్షకులు సుబ్రహ్మణ్యం, ఏపీఎంవో చలంబాబు, శివశంకరమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వెదురుకుప్పం: ఎంఆర్ టీకాను అర్హులైన పిల్లలందరికీ వేయాలని పచ్చికాపల్లం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర అభివృద్ధి కమిటీ ఛైర్మన్ బి.ఈశ్వరరెడ్డి చెప్పారు. పచ్చికాపల్లం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో టీకా శిబిరాన్ని ప్రారంభించారు. వైద్యాధికారి నరసింహులు, సూపర్‌వైజర్లు సుబ్రహ్మణ్యం, నాగేశ్వరి, సువర్ణమ్మ, హెచ్ఏ గిరి, దామోదరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వడమాలపేట: వడమాలపేట బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు మీజిల్స్, రుబెల్లా వ్యాధుల నివారణ కోసం ఎంఆర్ వ్యాక్సిన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. వడమాలపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధి కమిటీ ఛైర్మన్ జానా వెంకటయ్య, వైద్యాధికారి పద్మజ, మండల టీడీపీ అధ్యక్షుడు అబ్బురాజు, సీహెచ్‌వో ఖాదర్, వైద్య సిబ్బంది వరలక్ష్మి, చంద్రమోహన్, ప్రధానోపాధ్యాయురాలు గాయత్రి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నారాయణవనం: 15 సంవత్సరాల లోపు చిన్నారులను తట్టు, పొంగునుంచి కాపాడడానికే ఎంఆర్ వ్యాక్సిన్ వేస్తున్నామని నారాయణవనం పీహెచ్‌సీ వైద్యాధికారి హేమలత అన్నారు. మంగళవారం పీహెచ్‌సీలో వ్యాక్సినేషన్ కార్యక్రమం ప్రారంభించారు. ఈకార్యక్రమంలో ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

వసంతహరినాయుడు సేవలు చిరస్మరణీయం

ఎమ్మెల్సీ ముద్దుకృష్ణమ



వసంతహరినాయుడు మృతదేహానికి నివాళులర్పిస్తున్న ముద్దుకృష్ణమ తదితరులు

పుత్తూరు: పరమేశ్వరమంగళం సింగిల్ విండో అధ్యక్షుడు వసంతహరినాయుడు సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్సీ ముద్దుకృష్ణమ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు పులివర్తి నాని, డీసీసీబీ ఛైర్మన్ అమాస రాజశేఖర్‌రెడ్డి అన్నారు. రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందిన వసంత హరినాయుడు మృతదేహానికి మంగళవారం వారు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరమేశ్వరమంగళం సింగిల్ విండోను అభివృద్ధి పథంలో నడిపించారని కొనియాడారు. రైతులకు రుణాలు, రాయితీతో విత్తనాలు, ఎరువులు పంపిణీ చేయడానికి నిత్యం కృషి చేశారని తెలిపారు. వరిధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించారని కొనియాడారు. అదే విధంగా పంచాయతీలో పాఠశాల భవనాలు నిర్మించి విద్యాభివృద్ధికి కృషి చేశారని గుర్తు చేశారు. ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, పుత్తూరు మున్సిపల్ ఛైర్మన్ యుగంధర్, ఎంపీపీ మాధవయ్య, వైస్ ఎంపీపీ వీరరాఘవులు నాయుడు, టీడీపీ నేతలు కొరపాటి నరేంద్ర, మాధవనాయుడు, కరుణ, గణేష్, పుత్తూరు వాకర్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి, గౌరవ అధ్యక్షుడు రవిరాజు తదితరులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

కార్మికుడి కుటుంబాన్ని ఆదుకుంటాం

ముద్దుకృష్ణమ హామీ

వడమాలపేట: మండలంలోని తిరుమణ్యం గ్రామానికి చెందిన డి.శివమంగారెడ్డి మృతదేహానికి ఎమ్మెల్సీ ముద్దుకృష్ణమనాయుడు నివాళులర్పించారు. తిరుమణ్యంకు చెందిన శివమంగారెడ్డి పూడి సమీపంలోని ఫ్యాక్టరీలో పనిచేస్తూ మంగళవారం ఉదయం ఉన్నట్లుండి కుప్పకూలిపోయాడు. సిబ్బంది వెంటనే చికిత్స నిమిత్తం వడమాలపేటలో ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లినా మళ్లీ గుండెపోటు రావడంతో మృతి చెందాడు. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వపరంగా ఆదుకుంటామని కుటుంబ సభ్యులకు ముద్దుకృష్ణమ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సుబ్రహ్మణ్యం రెడ్డి, సర్పంచ్‌లు చలపతి యాదవ్, తిలక్ పాల్గొన్నారు.

ఉపాధి పనులను వేగవంతం చేద్దాం: ముద్దుకృష్ణమ



మాట్లాడుతున్న ముద్దుకృష్ణమ

వడమాలపేట: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా చేపట్టే పనులను వేగవంతంగా పూర్తి చేయడానికి ప్రజాప్రతినిధులు కృషి చేయాలని ఎమ్మెల్సీ ముద్దుకృష్ణమ కోరారు. వడమాలపేటలో మంగళవారం ఎంపీపీ మురళీధర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అర్హత కలిగిన నిరుపేదలందరికీ అందేలా అధికారులు శ్రద్ధ వహించాలన్నారు. ఉపాధి ఏపీవో హంసవేణి మాట్లాడుతూ మండలంలోని 20 పంచాయతీల్లో శ్మశనాల అభివృద్ధి కోసం రూ.5 లక్షల చొప్పున నిధులు మంజూరయ్యాయని చెప్పారు. ఓవర్‌హెడ్ ట్యాంకుల క్లోరినేషన్ కోసం పంచాయతీ కార్యదర్శి, ఏఎన్ఎంల జాయింట్ అకౌంట్‌లో నిధులు జమ చేశామని ఈవోపీఆర్డీ శ్రీనివాసరాజు చెప్పారు. మండలంలో 64 చెక్‌డ్యాంలకు రూ.9.04 కోట్లు మంజూరైందని, ఇప్పటికే యాభై శాతం పనులు పూర్తయ్యాయని, నెలాఖరులోగా పూర్తి చేస్తామని ఇరిగేషన్ ఏఈ గోపి తెలిపారు. ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో మినీ ట్రాక్టర్లు, స్ప్రేయర్లు రాయితీ ధరకు అందిస్తామని, అలాగే బిందు సేద్యం ద్వారా ఇతరులకు 90 శాతం, ఎస్సీ, ఎస్టీ రైతులకు వంద శాతం సబ్సిడీ ఉంటుందని వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. భూమి లేని షెడ్యూల్ కులాలకు చెందిన మహిళలకు ప్రభుత్వం ద్వారా భూమి కొనుగోలు చేసి అందిస్తామని తహసీల్దార్ కులశేఖర్ చెప్పారు. మండలంలో తాగునీటి సమస్య ఉన్న గ్రామాల్లో ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రామ్మోహన్ చెప్పారు. మండలంలో 2017-18 సంవత్సరానికి ఎన్టీఆర్ గృహ కల్ప కింద 324 ఇళ్లు మంజూరయ్యాయని, లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణ పనులు చేపట్టాలని హౌసింగ్ ఏఈ వెంకటరత్నం కోరారు. సమావేశంలో ఎంపీడీవో శ్రీలక్ష్మి, జడ్పీటీసీ సురేష్‌కుమార్, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఎర్రచందనం చెట్లపై నిఘా పెంచండి



ఎర్రచందనం చెట్లను పరిశీలిస్తున్న అధికారులు

శ్రీరంగరాజపురం: ఎర్రచందనం చెట్లపై నిఘా పెంచాలని చిత్తూరు డీఎఫ్‌వో జగన్నాథ్‌సింగ్, పీలేరు డీఎఫ్‌వో బబిత చెప్పారు. మంగళవారం ఎస్ఆర్‌పురం మండలం ఎగువ మెదవాడ, దిగువ మెదవాడ పరిధిలోని పొలాల్లో ఉన్న ఎర్రచందనం చెట్లపై సంఖ్యలను తనిఖీ చేశారు. అలాగే ఆ చెట్టు చుట్టూ కొలతలు వేశారు. మెదవాడకు చెందిన సాంబశివనాయుడు పొలంలో ఉన్న ఎర్రచందనం చెట్లను తొలగించడానికి దరఖాస్తు చేసుకున్నాడని దీనిపై తనిఖీ చేయడానికి వచ్చామని డీఎఫ్‌వోలు తెలిపారు. కార్యక్రమంలో చిత్తూరు ఫారెస్టు రేంజర్ వేణుగోపాల్, కార్వేటినగరం రేంజర్ శివన్న, బీట్ అధికారులు భువనేశ్వరి, చంద్రకళ, గీత, లోకేష్, ప్రకాష్, సెక్షన్ అధికారులు చంద్రశేఖర్, కుమార్ పాల్గొన్నారు.

ద్రౌపదీ దేవికి సారె సమర్పణ




అమ్మవారికి సారెను ఊరేగింపుగా తీసుకెళుతున్న ఎమ్మెల్యే రోజా, మున్సిపల్ ఛైర్మన్ యుగంధర్ దంపతులు తదితరులు

పుత్తూరు: పుత్తూరు పట్టణంలోని ద్రౌపదీ సమేత ధర్మరాజులు ఆలయ వార్షిక ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం ద్రౌపదిదేవికి ఎమ్మెల్యే రోజా సారె సమర్పించారు.అంతకుముందు పట్టణంలోని సెల్వ వినాయక ఆలయంలో ఆమె పూజలు నిర్వహించారు. అక్కడినుంచి మేళతాళాల నడుమ ఆలయానికి చేరుకున్నారు. ద్రౌపదీదేవికి పట్టు చీర, పసుపు కుంకుమను సమర్పించారు. కౌన్సిలర్లు మురగేశన్, లారీమోహన్, బాబు, నారాయణబాబు, బాబురావ్‌గౌడ్, డీసీసీబీ డైరెక్టర్ దిలీప్‌రెడ్డి, వైసీపీ బీసీ సెల్ కార్యదర్శి ఏళుమలై పాల్గొన్నారు. సాయంత్రం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఛైర్మన్ యుగంధర్ దంపతులు ద్రౌపది దేవికి సారె సమర్పించారు. సదాశివేశ్వర ఆలయంలోని గీతామందిరం నుంచి సారెతో ఊరేగింపుగా ద్రౌపదీ సమేత ధర్మరాజులు ఆలయానికి చేరుకుని సమర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌ఛైర్మన్ రత్నంబ్కార్, కౌన్సిలర్లు కరుణాకరన్, గోవర్ధన్, వెంకటేష్, గోపి ఆచారి, ప్రసాద్‌నాయుడు, కమిషనర్ శ్రీహరిబాబు, టీడీపీ నాయకులు జీవరత్నంనాయుడు, ప్రకాష్, పాండురంగ యాదవ్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

పాతగుంట సర్పంచ్ చెక్ పవర్ పునరుద్ధరణ

వెదురుకుప్పం: పాతగుంట గ్రామ సర్పంచ్ పచ్చమ్మకు చెక్ పవర్ పునరుద్ధరిస్తూ.. జిల్లా పంచాయతీ అధికారి కేఎల్ ప్రభాకరరావు ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎంపీడీవో రాజశేఖరరెడ్డి చెప్పారు. గతంలో పంచాయతీ నిధులు దుర్వినియోగమైనట్లు ఆరోపణలతో చెక్ పవర్ రద్దు చేశారు. అయితే సరైన రికార్డులను చూపించడంతో చెక్ పవర్ పునరుద్ధరించారు.

సినిమా గైడ్

పుత్తూరు	
శాంతి	వాసుకి
విష్ణుమహల్	ఫిదా
శ్రీనివాస	దువ్వాడ జగన్నాథం

ఆంధ్రజ్యోతి
చిత్తూరు
మదనపల్లె జోన్
బుధవారం 2, ఆగస్టు 2017

ఘనంగా వెంగమాంబ వర్ధంతి

గుర్రంకొండ: మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ వర్ధంతిని తరిగొండలో టీటీడీ అధికారులు ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజల అనంతరం టీటీడీ కళాకారులతో ప్రత్యేక గాత్రకచేరిని ఏర్పాటు చేశారు. సాయంత్రం స్వామివారి కల్యాణోత్సవాన్ని వేదపండితులు ఘనంగా నిర్వహించారు. కల్యాణాన్ని తిలకించడానికి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేశారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ ఈవో వెంకటయ్య, ఏఈవో ధనుంజయులు, అర్చకులు కాంతాచార్యులు, గోపాల్‌భట్టార్, కృష్ణప్రసాద్, కృష్ణరాజ్, అనీల్, తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేకాలంకరణలో మాతృశ్రీ వెంగమాంబ

అవినీతి రహిత సమాజాన్ని నిర్మిద్దాం

మాజీ డీజీపీ గోపినాథ్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న గోపినాథ్‌రెడ్డి

కురబలకోట: అవినీతి రహిత సమాజస్థాపనకు ప్రతి ఒక్కరూ పాటు పడాలని మాజీ డీజీపీ గోపినాథ్‌రెడ్డి పేర్కొన్నారు. అంగళ్లు సమీపంలోని గోల్డెన్ వ్యాలీ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి విద్యార్థి దశ నుంచే అవినీతికి వ్యతిరేకంగా పోరాడాలన్నారు. ఈ సమాజంలో ఆశావాదులు, నిరాశావాదులు ఉంటారన్నారు. జీవితంలో ప్రతి ఒక్కరూ మార్పుకు శ్రీకారం చుట్టాలని మార్పుతో ఏమైనా సాధించవచ్చన్నారు. విద్యార్థులు గురువులు బోధించే బోధనను నేర్చుకుని క్రమశిక్షణతో మెలగాలన్నారు. దీని వలన విద్యార్థులు ఉన్నత స్థానాలకు ఎదగడానికి ఎంతగానో దోహదపడుతుందన్నారు. విద్యార్థులు ఉద్యోగం కోసం కాకుండా స్వయంగా ఎదిగి ఇతరులకు చేయూతనివ్వాలన్నారు. గురువులు పాఠ్యాంశాలను నామమాత్రంగా కాకుండా విద్యార్థులకు అర్థమయ్యే విధంగా బోధించాలన్నారు. వ్యవసాయ రంగాన్ని ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదవాలన్నారు. ఈకార్యక్రమంలో కరస్పాండెంట్ ఎన్వీ రమాణారెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ నారాయణన్ , సదాశివారెడ్డి, ఏవో అబ్దుల్‌కలాం తదితరులు పాల్గొన్నారు.

ములకలచెరువులో సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు



వ్యాపారులతో సమావేశమైన సీఐ రుషికేశవ

ములకలచెరువు: మండల కేంద్రం మొత్తం నిఘా కెమెరాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు సీఐ రుషికేశవ తెలిపారు. దీనిపై స్థానిక సర్కిల్ కార్యాలయంలో మంగళవారం జనరల్ స్టోర్, టెక్స్‌టైల్స్, ఎలక్ట్రానిక్, బేకరీల, ఫర్టిలైజర్స్, సెల్‌షాపులు, ఎరువుల తదితర దుకాణాల సంఘం నాయకులకు సీఐ రుషికేశవతో సమావేశమయ్యారు. ప్రధాన ప్రాంతాలైన బస్టాండ్ సర్కిల్, పీటీఎం రోడ్డు, రైల్వేగేటు, రైల్వేస్టేషన్ ముఖద్వారం, తదితర ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుచేయాలని నిర్ణయించారు. సమావేశంలో ఎస్ఐ ఈశ్వరయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచిత బస్సు పాసులు



పాసులు పంపిణీ చేస్తున్న దృశ్యం

ములకలచెరువు: నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 4వేల మంది విద్యార్థులకు ఉచిత బస్సు పాసులు అందజేసినట్లు తంబళ్లపల్లె చార్టెడ్ అకౌంటెంట్, వుయ్‌సర్వ్ చారిటబుల్‌ట్రస్టు ఫౌండేషన్ నిర్వాహకులు మలిగి మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల, మోడల్ స్కూల్లో 310మందికి ఉచిత బస్సులు పాసులు అందజేశారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు రూ.10వేలు విలువ చేసే స్కానర్‌ను విరాళంగా ఇచ్చారు. ఈకార్యక్రమంలో సంస్థ ప్రతినిధి మలిగి మాధవరెడ్డి, కోఆప్షన్ సభ్యుడు మైయాన్ ఉద్దీన్ , పాఠశాల కమిటీ చైర్మన్ కృష్ణమూర్తి, ఆర్టీసీ సిబ్బంది గంగయ్య, వేణుగోపాల్, బాబ్జి, మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

శ్రద్ధగా పనిచేసి మంచి ఫలితాలు సాధించండి

మండల అధికారులకు కలెక్టర్ ప్రద్యుమ్న సూచన



పదిసూత్రాల అమలు గురించి తెలుసుకుంటున్న కలెక్టర్ ప్రద్యుమ్న

ములకలచెరువు: శ్రద్ధగా పని చేయండి...మంచి ఫలితాలు సాధించండి అని జిల్లా కలెక్టర్ ప్రద్యుమ్న అధికారులకు సూచించారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మంగళవారం పదిసూత్రాల అమలుపై ములకలచెరువు, పెద్దతిప్పసముద్రం, కురబలకోట, బి.కొత్తకోట మండలాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పదిసూత్రాల అమలును పారదర్శకంగా చూపట్టాలన్నారు. పదిసూత్రాలైన పంటసంజీవిని, నీరు-ప్రగతి, హార్టికల్చర్, డ్రిప్పు ఇరిగేషన్ , హౌసింగ్, స్వయం ఉపాధి రుణాలు సీసీరోడ్లు, కొత్త పంచాయతీ, మరుగుదొడ్ల నిర్మాణం, వనం-మనం పథకాల అమలులో ముందుండాలన్నారు. బోరున్న ప్రతి రైతును హార్టికల్చర్ వైపు మళ్లించాలన్నారు. ఉద్యానవన పంటల సాగు చేసేలా కృషి చేయాలన్నారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా రైతుల పొలాలలో పంటసంజీవిని కుంటల పనులను ముమ్మరంగా చేపట్టాలన్నారు. ప్రతినెలా మొదటి శనివారం ఆస్తుల పంపకం కార్యక్రమం చేపట్టాలన్నారు. తంబళ్లపల్లె నియోజవకర్గంలో ఈనెల 5న ఏదో ఒకచోట ఆస్తుల పంపకాన్ని నిర్వహించాలన్నారు. ఈకార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని ఆదేశించారు. బోర్లు ఉన్న రైతులు వేరుశనగ పంట ఎందుకు సాగు చేయలేదని హార్టికల్చర్ అధికారులను ప్రశ్నించారు. అనంతరం మండలలాల వారీగా పదిసూత్రాల అమలుపై సమీక్ష నిర్వహించారు. ఈసమావేశంలో నాలుగు మండలాల ఎంపీడీవోలు, తహసీల్దార్‌లు, ఏపీఎంలతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పదిసూత్రాల అమలులో శ్రీకాళహస్తి ఫస్ట్

జిల్లాలో పదిసూత్రాల అమలులో శ్రీకాళహస్తి మండలం మొదటి స్థానంలో నిలిచిందని కలెక్టర్ ప్రద్యున్న స్పష్టం చేశారు. 65వ స్థానంతో కురబలకోట మండలం ఉందన్నారు. అలాగే బి.కొత్తకోట మండలం 40వ స్థానం, పెద్దతిప్పసముద్రం 34వ స్థానం, ములకలచెరువు మండలం 29వ స్థానంలో ఉందన్నారు. పదిసూత్రాల ప్రగతి సాధించడంలో అధికారులు కృషి చేయాలన్నారు.

పిల్లలకు ఎంఆర్ టీకా తప్పనిసరిగా వేయించండి







వాల్మీకిపురంలో వ్యాక్సిన్ బాక్సు ఓపెన్ చేస్తున్న ఎమ్మెల్యే చింతల-అంగళ్లు, తంబళ్లపల్లెలో పిల్లలకు వ్యాక్సిన్ వేస్తున్న వైద్య సిబ్బంది

వాల్మీకిపురం: 9నెలల నుంచి 15ఏళ్లలోపు పిల్లలకు ఎంఆర్ టీకాలు తప్పనిసరిగా వేయించాలని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి తల్లిదండ్రులకు సూచించారు. మంగళవారం స్థానిక సీఆర్ఆర్ జడ్పీబాలికల ఉన్నత పాఠశాలలో ఎంఆర్ టీకా బాక్సును రిబ్బన్ కత్తిరించి ఎమ్మెల్యే ప్రారంభించారు. ప్రాణాంతకమైన తట్టు, మెదడువాపు, వ్యాధుల బారిన పడకుండా పిల్లలను కాపాడుకోవడానికి ప్రభుత్వం ఈ టీకాను వేస్తోందన్నారు. ఈకార్యక్రమంలో మెడికలాఫీసర్ హరిత, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తంబళ్లపల్లెలో...

రుబెల్లా వ్యాక్సిన్ తో పలురకాల వ్యాధులు దరిచేరవని వైద్యురాలు చైతన్య పేర్కొన్నారు. స్థానిక ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు రుబెల్లా వ్యాక్సిన్ వేశారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ వేణుగోపాల్‌రెడ్డి, సర్పంచ్ గీతారెడ్డి, ఎంపీడీవో రామకృష్ణ, హెచ్ ఎం శ్రీనివాసులు, డీపీఎం రాజేంద్రరెడ్డి, ఎంపీహెచ్ వో, సూపర్‌వైజర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కురబలకోటలో...

మండలంలో ఎంఆర్ టీకాలను ప్రతి ఒక్క విద్యార్థికి తప్పనిసరిగా వేయించాలని ఎంపీపీ భూమిరెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్ కొమ్మద్ది ఖలీల్, టీడీపీ మండలాధ్యక్షుడు పి.సురేంద్రయాదవ్‌లు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని కురబలకోట, అంగళ్లు, ముదివేడు, పిచ్చలవాండ్లపల్లె, మట్లివారిపల్లె తదితర గ్రామాల్లో వ్యాక్సిన్ వేశారు.. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ ధనలక్ష్మీ, సర్పంచ్ లు అమ్మాజి, రుద్ర సర్వసతి, ఉపసర్పంచ్ దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

నిమ్మనపల్లెలో...

ఒక టీకాతో రెండు వ్యాధులు దూరమవుతాయని స్థానిక సర్పంచ్ శ్రీరాములు, వైద్యాధికారి జులేఖాబేగం పేర్కొన్నారు. స్థానిక జడ్పీహైస్కూల్‌లో పిల్లలకు టీకాలు వేశారు.ఈకార్యక్రమంలో వైద్య సిబ్బంది, టీడీపీ నేత మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

ములకలచెరువులో...

ములకలచెరువు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆసుపత్రి కమిటీ చైర్మన్ సయ్యద్‌బాషా, ఎంఈవో వెంకటరమణ, పాఠశాల కమిటీ చైర్మన్ కృష్ణమూర్తి, ఇన్ ఛార్జి డాక్టర్ కోమల టీకాలు వేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు.

రూ.96లక్షల ఉపాధి నిధులతో అభివృద్ధి పనులు



వెలిగల్లులో పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్రీధర్‌రావు

పెద్దమండ్యం: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా రూ.96లక్షలతో మండలంలో అభివృద్ధి పనులు జరుగుతున్నట్లు ఎంపీడీవో శ్రీధర్‌రావు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని వెలిగల్లులో జరుగుతున్న అభివృద్ధి పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేంద్రీయ ఎరువుల తయారీ కేంద్రాలు, శ్మశానవాటికలు, ఆటస్థలాలు తదితర అభివృద్ధి పనులు జరుగుతున్నట్లు చెప్పారు. మండలంలోని తురకపల్లె, రెక్కలకొండపల్లె, కలిచెర్ల, ముసలికుంట, గుర్రంవాండ్లపల్లె, కోటకాడపల్లె, ఎన్ వోపల్లె, పాపేపల్లె, పెద్దమండ్యం, సిద్ధవరం, శివపురం, వెలిగల్లు ప్రాంతాల్లో రూ.59,55,000 అభివృద్ధి పనులు ప్రారంభమైనట్లు చెప్పారు. శ్మశానవాటికల అభివృద్ధిలో భాగంగా రూ.37లక్షలతో చెట్ల పెంపకం, ప్రహరీ గోడలు, బోర్లు పనులు ప్రారంభమైనట్లు చెప్పారు. వెలిగల్లు, పెద్దమండ్యం, పాపేపల్లె, కలిచెర్ల, సి.గొల్లపల్లె పాఠశాలల ఆటస్థలాల అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయి. ఈ పనులు ఉపాధి నిధులతో సర్పంచ్ ల ఆధ్వర్యంలో జరుగుతున్నట్లు ఎంపీడీవో పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ బావాజి, సర్పంచ్ లు హుస్సేన్ బీ, వేమయ్య, ప్రసాద్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

10 నుంచి మండంలో

రైతు సేవలో రెవెన్యూ శాఖ

గుర్రంకొండ: మండలంలోని అన్ని గ్రామాల్లో రైతు సేవలో రెవెన్యూ శాఖ కార్యక్రమం ఈనెల 10 నుంచి ప్రారంభం కానున్నట్లు తహసీల్దార్ రవిచంద్రన్ తెలిపారు. ఇందులో భాగంగా 10న టి.పసలవాండ్లపల్లె, ఎల్లుట్ల, 11న నడిమికండ్రిగ, 17న చెర్లోపల్లె, 18న చిట్టిబోయనపల్లె, గుర్రంకొండ, కండ్రిగ, 24న సరిమడుగు, సంగసముద్రం, 31న శెట్టివారిపల్లె, అరిగెలవారిపల్లె, సెప్టెంబర్ 1న మర్రిమాకులపల్లె, అమిలేపల్లె, 7న తరిగొండ, 8న టి.రాచపల్లె, రామాపురం, 14న మర్రిపాడులో గ్రామసభలు జరుగుతాయన్నారు. ప్రజలు గ్రామసభలకు హాజరై భూముల వివరాలు తప్పొప్పులను సరిదిద్దుకోవాలన్నారు.

భూసారాన్ని బట్టి పంటలు వేయాలి

బుచ్చినాయుడుకండ్రిగ: భూసారాన్ని అనుసరించి పంటలు వేయాలని మండల ఏవో సుబ్బారావు తెలిపారు. మంగళవారం ఆయన మండలంలోని కల్లివెట్టులో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితులలో భూసార పరీక్షలు తప్పకుండా చేయించాలని చెప్పారు. అందుకు వ్యవసాయ శాఖ సహకరిస్తుందని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఆశా, రైతులు పాల్గొన్నారు.


రైతులతో మాట్లాడుతున్న ఏవో

ఒక్క టీకాతో రెండు వ్యాధులు దూరం




కేవీబీపురం, ఏర్పేడు, బీఎన్‌కండ్రిగలో చిన్నారులకు టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది

కేవీబీపురం: ఒక్క రూబెల్లా టీకాతో రెండు ప్రాణాంతక వ్యాధులు నయం చేయవచ్చని వైద్యాధికారి సురేష్‌బాబు తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు 9 నెలల నుంచి 15 సంవత్సరాల లోపు పిల్లలకు ఈ టీకాలు వేస్తున్నట్టు ఆయన చెప్పారు. ఈ క్రమంలో కేవీబీపురంలోని పాఠశాలలో మంగళవారం ఆయన విద్యార్థులకు రూబెల్లా టీకాలు వేశారు.కార్యక్రమంలో ఎంపీపీ సులోచన, తొట్టంబేడు మార్కెట్ కమిటీ చైర్మX రామాంజుల నాయుడు,ఎంపీహెచX ఈవో ప్రసాద్, పీహెచX ఎనX లక్ష్మీ, రత్నకుమారి, ఏఎనX ఎంలు, ఎంపీటీసీ నందకుమార్, సర్పంచX లు, ప్రత్యేకాధికారి పరిమిళ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏర్పేడు: స్థానిక పీహెచX సీ అభివృద్ధి కమిటీ చైర్మX శివశంకర్‌రెడ్డి, వైద్యాధికారి రాఘవరెడ్డి ఏర్పేడు ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు రూబెల్లా టీకాలను వేశారు. ఈ కార్యక్రమంలో సీతారాంపేట మాజీ సర్పంచX శీనయ్యయాదవ్, ఏర్పేడు పాఠశాల హెచX ఎం రామచంద్ర నాయుడు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వరదయ్యపాళెం: స్థానిక జడ్పీహైస్కూల్‌లో ఎంపీపీ జీవమ్మ ఎంఆర్ వ్యాక్సిన్ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక వైద్యాధికారి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ మంగళవారం 600 మంది చిన్నారులకు రూబెల్లా వ్యాక్సిన్ వేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ కుమారుడు, టీడీపీ నాయకులు కరుణాకర నాయుడు,వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ: స్థానిక ప్రాథమిక పాఠశాలలో వైద్యాధికారి శేఖర్, ఎంఈవో రవీంద్రనాథ్ విద్యార్థులకు మీజిల్స్ - రూబెల్లా టీకాలను వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పీహెచ్‌సీ సూపర్‌వైజర్ సుబ్రహ్మణ్యం,ఉపాధ్యాయులు,వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తొట్టంబేడు: మండలంలోని పిల్లమేడు ఉన్నత పాఠశాలలో మండల టీడీపీ అధ్యక్షుడు మురళీనాయుడు ఎంఆర్ టీకాను వేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిణి మృదులవాణి, పీహెచX వో వేణుగోపాల్, ఆరోగ్య కార్యకర్తలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



వరదయ్యపాళెం, పిల్లమేడులో ఎంఆర్ వ్యాక్సిన్ శిబిరంలో పాల్గొన్న వైద్య సిబ్బంది తదితరులు

ప్రభుత్వ పథకాలపై ప్రజలకు
అవగాహన కల్పించాలి: ఎమ్మెల్యే ఆదిత్య

వరదయ్యపాళెం : ప్రభుత్వ సంక్షేమ పథకాలపై టీడీపీ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే తలారి ఆదిత్య పిలుపునిచ్చారు. వరదయ్యపాళెంలో మంగళవారం సత్యవేడు నియోజక వర్గ టీడీపీ సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ, పంచాయతీ, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు స్థానిక సమస్యలు, వాటి పరిష్కారాలపై స్థానిక ప్రజలతో సమావేశాలు నిర్వహించాలన్నారు. అనంతరం వాటి పరిష్కారం కోసం కృషి చేయాలని సూచించారు. త్వరలోనే చంద్రన్న బీమా పథకం ద్వారా సహజ మరణానికి కూడా రూ.2 లక్షలు చెల్లించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. జిల్లా గంథాలయ శాఖ చైర్మX కన్నయ్య నాయుడు మాట్లాడుతూ అందరూ సమిష్టిగా కృషిచేసి వచ్చే ఎన్నికల్లో టీడీపీ విజయఢంగా మోగించేందుకు కృషి చేయాలన్నారు. ఈ సమావేశానికి సత్యవేడు, వరదయ్యపాళెం, బుచ్చినాయుడకండ్రిగ మండలాలకు చెందిన పార్టీ నేతలు హాజరయ్యారు. అయితే నాగలాపురం, పిచ్చాటూరు, నారాయణవనం, కేవీబీపురం మండలాల నాయకులు గైర్హాజరు కావడంతో సమావేశంలో నాయకులు అంతంతమాత్రంగానే కన్పించారు.

ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మX సుందరరామిరెడ్డి, నాయకులు బాలసుందరం, రమేష్ యాదవ్, చలపతి నాయుడు, పవన్ కుమార్, మహేష్, సునీల్, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

కేజీబీవీకి ఫ్యాన్ల వితరణ

కేవీబీపురం: స్థానిక కస్తూర్బగాంధీ బాలికల పాఠశాలకు స్థానిక ఎస్‌ఐ పరశురాముడు 6 ఫ్యాన్లను వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల అభివృద్ధికి తన వంతు సాయం అందజేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో లక్ష్మీపతి, ఎస్‌వో పరిమిళ, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.


ఫ్యాన్లు అందజేస్తున్న ఎంఈవో, ఎస్‌ఐ

ఘనవ్యర్థాల నిర్వహణ కేంద్రాలతో పరిశుభ్రత

ఏర్పేడు: గ్రామాలలో ఘనవ్యర్థాల నిర్వహణ కేంద్రాలతో పరిశుభ్రత మెరుగు పడుతుందని తహసీల్దారు శేషగిరిరావు తెలిపారు. మంగళవారం ఆయన మండలంలోని కొత్తవీరాపురంలో ఘనవ్యర్థాల నిర్వహణ కేంద్ర ఏర్పాటుకు స్థలాన్ని ఎక్స్‌కవేటర్ ద్వారా చదును చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని వ్యర్థాలను ఈ కేంద్రానికి తరలించి సేంద్రియ ఎరువులు తయారు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ నీలకంఠేశ్వర రెడ్డి, వైస్ ఎంపీపీ మురుగX , సర్పంచX గంగాబాయి, ఆర్‌ఐ నారయ్య, తదితరులు పాల్గొన్నారు.

పోలినాంచారమ్మకు ప్రత్యేక పూజలు

ఏర్పేడు: మండలంలోని కోబాకగ్రామంలో కొలువైన పోలి నాంచారమ్మకు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారిని సీఎం చంద్రబాబు సోదరుడు రామ్మూర్తినాయుడు కుటుంబ సభ్యులు దర్శించుకున్నారు. వారికి ఆలయ పూజారి తీర్థప్రసాదాలు అందజేశారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు.

రేషనX షాపుల్లోని ఈ-పాసు వర్షనX మార్పు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని రేషన్ షాపుల్లోని ఈ-పాసు యంత్రాల వర్షనX ను ఆర్‌ఐ అశోక్ మంగళవారం మార్పు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇది వరకు ఈ-పాసు యంత్రాలకు వర్షనX 4.5 ఉండేదని, దానిని ప్రస్తుతం 4.6కు మార్చుతున్నట్టు తెలిపారు. దీని వలన ఈ-పాసు యంత్రాలు వేగంగా పనిచేస్తాయని చెప్పారు.

టిప్పర్, లారీ ఢీ
డ్రైవర్‌కు గాయాలు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని శ్రీకాళహస్తి రోడ్డు పదవమైలు గ్రామం వద్ద మంగళవారం ఓ లారీ, టిప్పర్ ఢీకొనడంతో టిప్పర్ డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. తడ నుంచి టిప్పర్ తంగెళ్ళపాళెం వెళుతుండగా ఎదురుగా శ్రీకాళహస్తి నుంచి కట్టెల లోడ్డుతో వస్తున్న లారీ పదవ మైలు దగ్గర ఢీకొన్నాయి. దీంతో టిప్పర్ డ్రైవర్ మణి తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని స్థానికులు 108లో శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. టిప్పర్ ముందు భాగం దెబ్బతింది. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.


గాయపడిన మణి

పెరటితోట మొక్కల విత్తనాల పంపిణీ

కేవీబీపురం: మండలంలోని ఆదవరంలో గిరిజనులకు పీవీకండ్రిగ క్లస్టర్ కోవిల్ ఫౌండేషX ఆధ్వర్యంలో మంగళవారం పెరటితోట పంటల విత్తనాలను పంపిణీ చేశారు. పెరటిలో పెరిగే వంగ, బీర, బెండ, చిక్కుడు, అలసందలు, గోరుచిక్కుడు, తోటకూర, గోంగూర తదితర 12 రకాల కూరగాయల విత్తనాలు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ సీఏ గణేష్ మాట్లాడుతూ మహిళలు తమకున్న కొద్దిపాటి స్థలంలో ఈ విత్తనాలు వేసి కూరగాయాలు పండించుకోవాలన్నారు.కార్యక్రమంలో ఎస్‌హెచX జీ గ్రూపు మహిళలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

పతి ఒక్కరూ ఒక మొక్క నాటాలి

కేవీబీపురం: ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటి దానిని సంరక్షించాలని సిద్దమ నాయుడుకండ్రిగ సర్పంచX వెంకటేష్ పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన సిద్దమ నాయుడుకండ్రిగ నుంచి వడ్డికండ్రిగ వరకు రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న వెంకటేష్ తదితరులు


వేడుకగా దుర్యోధన పట్టాభిషేకం


దుర్యోధన వేషాధారి

ఏర్పేడు: మండలంలోని పాపానాయుడుపేటలో ఉన్న ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి ఆలయంలో జరుగుతున్న తిరునాళ్ళలో భాగంగా మంగళవారం దుర్యోధన పట్టాభిషేకం వేడుకగా నిర్వహించారు.పాండవులను కాశీయాత్రకు పంపి దుర్యోధనుడు యువరాజుగా పట్టాభిషేకం చేసే సన్నివేశాలను చేనేత సంఘం ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు.ఉదయం స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయాన్ని, ఆలయ పరిసరాలను విద్యాద్దీపాలతో సుందరంగా అలంకరించారు. ఆలయ నిర్వాహులు భక్తులకు అవసరమైన ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఇకపై పాఠశాలలవద్దకే కోడిగుడ్లు

బుచ్చినాయుడుకండ్రిగ: ఇక నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించే మధ్యాహ్న భోజనాలకు ప్రభుత్వమే నేరుగా పాఠశాలలకు కోడిగుడ్లు అందిస్తుందని ఎంఈవో రవీంద్రనాథ్ తెలిపారు. మంగళవారం ఆయన పలు పాఠశాలలకు వచ్చిన కోడి గుడ్లను పరిశీలించి, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రూ.2.35కు కోడి గుడ్లను సరఫరా చేస్తుందన్నారు. ప్రతి నెలా మొదటి, రెండవ, మూడవ, నాల్గవ, ఐదవ సోమ, బుధ, శుక్రవారాలలో విద్యార్థులకు అందించే గుడ్లను గుర్తించేందుకు వాటిపై ప్రత్యేక రంగులను ముద్రిస్తున్నట్టు తెలిపారు. ఈక్రమంలో మొదటి వారం అందించే గుడ్లపై పసుపు, రెండవ వారం ఆకుపచ్చ,మూడవ వారం బ్లూ,నాలగవ వారం ఎరుపు,ఐదవ వారం బ్రౌన్ రంగు వేసి పంపుతామన్నారు.వీటిని విద్యార్థులకు సక్రమంగా అందజేయాలన్నారు.


గుడ్లును పరిశీలిస్తున్న ఎంఈవో



మొక్కల పెంపకాన్ని పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ పీడీ రవి ప్రకాష్‌రెడ్డి

15లోగా లక్ష్యాన్ని పూర్తి చేయాలి

మదనపల్లె రూరల్: ఆగస్టు 15లోగా లక్ష్యాలను పూర్తి చేయాలని డీఆర్‌డీఏ పీడీ రవిప్రకాష్‌రెడ్డి సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం మందనపల్లె మండలం వలసపల్లె పంచాయతీ అవరవాండ్లపల్లెలో ఉద్యానవన మొక్కల పెంపకాన్ని పరిశీలించారు. క్లస్టర్‌లో నాలుగువేల హెక్టార్లలో మొక్కలను నాటాలన్నారు. రైతులకు అవసరమైన పండ్ల జాతుల మొక్కలను పంపిణీ చేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో డీపీఎం మునిరత్నం, ఏపీఎంలు సుబ్రహ్మణ్యం, లక్ష్మీదేవిలు పాల్గొన్నారు.

ఆర్టీసీలో ప్రమాదాల సంఖ్య తగ్గించేందుకు చర్యలు

డిప్యూటీ సీఎంఈ నరసింహులు



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎంఈ నరసింహులు

మదనపల్లెటౌన్: ఆర్టీసీలో ప్రమాదాల సంఖ్య తగ్గించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చిత్తూరు డివిజన్ డిప్యూటీ సీఎంఈ నరసింహులు పేర్కొన్నారు.మంగళవారం మదనపల్లెలో ఆయన ప్రమాదాల నివారణపై వారం రోజులపాటు సిబ్బందికి ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చిత్తూరు డివిజన్‌లో ఎక్కువగా మదనపల్లె వన్ డిపోలో ప్రమాదాలు జరుగుతుండటంతో డివిజన్‌లో మొదటగా మదనపల్లె నుంచి ఈ శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ఏదో ఆదేశాలు ఇచ్చాము..మీరు పాటించాలి అని కాకుండా క్షేత్రస్థాయిలో ప్రమాదాలు ఎందుకు జరుగుతున్నాయి, అందుకు గల కారణాలు తెలుసుకుని ప్రమాదాలను పూర్తిస్థాయిలో తగ్గించాలన్న లక్ష్యంతో వారం రోజుల పాటు ఒక్కోరోజు ఒక్కో అంశంపై సిబ్బందికి అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా లైలాండ్ కంపెనీ ప్రతినిధులతో వాహన డ్రైవింగ్‌లో మెలకువలు, కేఎంపీఎల్ సాధించడం, బస్సు కండీషన్ మెరుగుపరచడం, డ్రైవర్లు, కండెక్టర్లు స్పూర్తి నింపడం వంటి కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. ప్రయాణికులను ఆర్టీసీ వైపు ఆకర్షించేందుకు ప్యాసింజర్స్ హ్యాపీ వీక్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనంతరం గ్యారేజ్ ఆవరణలో డిప్యూటీ సీఎంఈ మొక్కలు నాటి నీరుపోశారు. ఈ కార్యక్రమంలో టుడిపో డీఎం కె.పెద్దన్నశెట్టి, ఎం.ఎఫ్ నిరంజన్ ఆర్టీసీ కార్మికులు పాల్గొన్నారు.

అభివృద్ధి అంటే..ఇదేనా..?

మదనపల్లె రూరల్: రోడ్లు ప్రగతికి చిహ్నాలు అంటారు..మదనపల్లె పట్టణంలోని రోడ్లు చూస్తే మూడేళ్లలో ఏ మాత్రం అభివృద్ధి చెందిందో తెలుస్తోంది..అంటూ ఎమ్మెల్యే దేశాయ్‌తిప్పారెడ్డి విమర్శించారు. మంగళవారం పట్టణంలోని ప్రధానరోడ్లను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక ఆర్టీసీ బస్టాండు నుంచి మల్లికార్జునసర్కిల్ రోడ్డును ఆయన పరిశీలించి మాట్లాడుతూ మూడేళ్ల మున్సిపల్ పాలకవర్గ పాలనలో చాలా అభివృద్ధి చేశామని నాయకులు ప్రగల్భాలు పలుకుతున్నారని, కానీ పట్టణంలో ఒకసారి పరిశీలించిన సామాన్యుడు కూడా...' అభివృద్ధి అంటే ఇదేనా' అని ప్రశ్నిస్తారని ఎద్దేవా చేశారు. పట్టణంలోని ప్రధానరోడ్లు అయిన జడ్పీహైస్కూల్‌రోడ్డు, బర్మావీధి, చిత్తూరు బస్టాండు-చెంబకూరు, శేషమహల్ రోడ్డు ప్రాంతాల్లో పది అడుగులకు ఒకటి పెద్దగోతులు వున్నాయన్నారు. చిన్నపాటి వర్షం వస్తేనే ఈ రోడ్లు నడవడానికి కూడా వీల్లేకుండా వున్నాయన్నారు. పారిశుధ్యం అధ్వాన్నంగా వుందని, స్వచ్ఛభారత్ లో మదనపల్లె మున్సిపాలిటీ చివరిస్థానంలో నిలవడమే ఇందుకు నిదర్శనమన్నారు. పేదలకు పక్కాఇళ్ల కేటాయింపులోనూ, ప్రగతిలోనూ ఆఖరుస్థానంలో నిలవడం అవమానంగా వుందన్నారు. ప్రతిపక్షాలు సద్విమర్శలు చేస్తే స్వీకరించాలని, కసిగా అభివృద్ధి చేసి చూపించాలని హితవు పలికారు. ప్రెస్‌మీట్‌లు పెట్టి మూడేళ్లలో అభివృద్ధిచేశామని ప్రగల్భాలు పలికితే ప్రజలు నమ్మరన్నారు. ఇకనైనా అభివృద్ధి పనులు చేసి చేతల్లో చూపించాలన్నారు. వెంటనే ఈ రోడ్లను మెరుగుపరచాలని మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ మహేష్‌ను ఆదేశించారు. ఆయన వెంట సింగిల్‌విండో ఛైర్మన్ ఆనందరెడ్డి, వైసీపీ నాయకులు వున్నారు.



జడ్పీహైస్కూల్ రోడ్డులో గోతులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దేశాయ్‌తిప్పారెడ్డి

ఒక్క క్షణం ఆలోచించండి

ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్

మదనపల్లె అర్బన్: పట్టణంలో విచ్చలవిడిగా టూవీలర్స్, ఫోర్‌వీలర్స్ నడుపుతున్న విద్యార్థులు, యువకులు ఒక్క క్షణం ఆలోచించి డ్రైవ్ చేస్తే రోడ్డుప్రమాదాలు జరగవని ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం ఎన్ వీఆర్ ఫంక్షన్ హాల్లో ఒక్క క్షణం ఆలోచించండి అనే అంశంపై విద్యార్థులు, యువకులు వారి తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా ఓవర్‌స్పీడు, సెల్‌ఫోన్ డ్రైవింగ్, హెల్మెట్లు, సీటుబెల్టు ధరించకుండా వాహనాలు నడుపుతున్న చోదకులు ఒక్క క్షణం ఆలోచించి డ్రైవ్ చేస్తే రోడ్డుప్రమాదాలు జరగవన్నారు.ఒక్క క్షణం ఆలోచిస్తే.. దాని వెనుక మన భవిష్యత్తు, తల్లిదండ్రుల ప్రేమాభిమానాలు, బంధువుల ఆప్యాయత, స్నేహితుల ఆదరణ కనబడుతాయన్నారు. ఇవన్నీ గుర్తుకు వచ్చాక..వాహనం స్పీడు, సెల్‌ఫోన్ డ్రైవింగ్ తగ్గడమే కాకుండా విచ్చలవిడి డ్రైవింగ్ అదుపులోకి వస్తుందన్నారు. ప్రభుత్వ నిబంధన మేరకు డ్రైవింగ్ లైసెన్స్ కల్గివున్న విద్యార్థులు, యువకులు మాత్రమే టూవీలర్, ఫోర్‌వీలర్స్ డ్రైవ్ చేయాలన్నారు. అందులోనూ తప్పనిసరిగా హెల్మెట్లు, సీటుబెల్టు ధరించి ఉండాలన్నారు. నిబంధనలు గాలికొదిలి ఇష్టానుసారం డ్రైవ్ చేస్తే..రోడ్డుప్రమాదాలు జరిగి పదేళ్లు జైలుశిక్ష అనుభవించాల్సి ఉంటుందన్నారు. ముఖ్యంగా మైనర్లు వాహనాలు డ్రైవ్ చేయడం వలనే తరచూ ప్రమాదాలు జరుగుతున్నట్లు చెప్పారు. వీరు ప్రమాదాలకు గురైతే..వారి తల్లిదండ్రులపై కూడా 304పార్టు-2 సెక్షన్ కింద కేసులు నమోదు చేస్తు న్నట్లు చెప్పారు. ఎవరైనా ఒకటి, రెండుసార్లు తనిఖీల్లో పట్టుబడితే జరిమానా..మూడోసారి పట్టుబడితే కేసునమోదు చేసి వాహనాన్ని సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఇవన్నీ దృష్టిలో ఉంచుకుని వాహనాలు నడపాలని ఆయన సూచించారు. ఈకార్యక్రమంలో విద్యార్థులు, యువకులు, వారి తల్లిదండ్రులు, ట్రాఫిక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాస్

సినిమాగ్రేడ్

మదనపల్లె

ఏఎస్‌ఆర్	:	గౌతమ్‌నంద
ఎంఎస్‌ఆర్	:	నాకు నేనే
సిద్ధార్థ	:	శమంతకమణి
మినీసిద్ధార్థ	:	డాక్టర్ చక్రవర్తి
శ్రీకృష్ణ	:	నిన్ను కోరి
సాయిచిత్ర	:	గౌతమ్‌నంద
రవి	:	డీజే దువ్వాడ జగన్నాథమ్
సునిల్	:	ఫిదా

పిల్లల ఆరోగ్యం కాపాడటం
మనందరి బాధ్యత

ఎమ్మెల్యే దేశాయ్ తిప్పారెడ్డి



విద్యార్థులకు ఎంఆర్ టీకాలు వేస్తున్న డాక్టర్ దేశాయ్‌తిప్పారెడ్డి

మదనపల్లె రూరల్: పిల్లల ఆరోగ్యం కాపాడటం మనందరి బాధ్యత అన్ని ఎమ్మెల్యే దేశాయ్‌తిప్పారెడ్డి పేర్కొన్నారు. స్థానిక జడ్పీ హైస్కూల్లో మంగళవారం ఎంఆర్ టీకాలు వేసి కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొమ్మిదినెలల నుంచి 15 ఏళ్లలోపు పిల్లలకు ఎంఆర్ టీకాలు వేయించాలన్నారు. మీజిల్స్, రూబెల్లా వ్యాధుల నివారణకు ఎంఆర్ టీకాలు దివ్యౌషదంగా పని చేస్తుందన్నారు. మున్సిపల్ ఛైర్మన్ కొడవలి శివప్రసాద్ మాట్లాడుతూ పట్టణంలోని అన్ని పాఠశాలల్లో టీకాలు వేయించడం ఒక ఉద్యమంలా చేపట్టాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు దీనికి వేదికగా నిలబడాలన్నారు. తల్లిదండ్రులకు అవగాహన కల్పించి టీకాలు వేయించేలా చర్యలు చేపట్టాలన్నారు. డిప్యూటి డీఎంహెచ్‌వో సురేఖ మాట్లాడుతూ డివిజన్‌లో 4లక్షల మంది 15ఏళ్లలోపు పిల్లలు వున్నారని, వీరికి టీకాలు వేసేందుకు నాలుగు వేల మంది సిబ్బంది అందుబాటులో వున్నారన్నారు. సెప్టెంబర్ ఎనిమిదో తేదీనాటికి ఈ కార్యక్రమం పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ మహేష్, పీపీయూనిట్ అధికారి డాక్టర్ అనుపమ, ఎంఈవో ప్రభాకర్‌రెడ్డి, జడ్పీహెచ్‌ఎం తిరుమలమ్మ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు



వార్డుల్లో సమస్యలు తెలుసుకుంటున్న మున్సిపల్ ఛైర్మన్ శివప్రసాద్

మదనపల్లెటౌన్: ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతున్నట్లు మున్సిపల్ ఛైర్మన్ శివప్రసాద్ పేర్కొన్నారు. 1వ వార్డులో మంగళవారం మున్సిపల్ ఛైర్మన్ కొడవలి శివప్రసాద్ మున్సిపల్ అధికారులతో కలసి పర్యటించారు. ఈ సందర్భంగా వార్డుల్లో నెలకొన్న సమస్యలను ప్రజలు అడిగి తెలుసుకున్నారు. తాగునీరు, రోడ్డు సమస్యలను ప్రజలు ఛైర్మన్ దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం మున్సిపల్ ఛైర్మన్ మాట్లాడుతూ 1వ వార్డుల్లో రూ.20 లక్షలతో సీసీ రోడ్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. తాగునీటి సమస్య తలెత్తకుండా ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజల సౌకర్యార్థం 50 నివాసాలకు ఒకచోట నీటి డ్రమ్ములు ఏర్పాటు చేసి తాగునీరందించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మహేష్, కౌన్సిలర్లు నీలకంఠ, ఆర్. ఆంజనేయులు, బండి నాగరాజు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీలో అక్రమాలు జరిగితే చర్యలు

వాల్మీకిపురం: పింఛన్ల పంపిణీలో అవకతవకలు జరిగే కఠిన చర్యలు తప్పవని ఎంపీడీవో ధనలక్ష్మీ హెచ్చరించారు. మంగళవారం ఆమె వాల్మీకిపురం, చింతపర్తి గ్రామాల్లో పింఛన్ల పంపిణీని పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పంపిణీ కేంద్రాల వద్ద నీటి సౌకర్యం, నీడ సౌకర్యం కల్పించాలని ఆదేశించారు. నడవలేని స్థితిలో ఉన్న వృద్ధులు, వికలాంగుల ఇళ్ల వద్దకే వెళ్లి లబ్ధిదారులకు పంపిణీ చేయాలని ఆదేశించారు.

చంద్రన్న బీమా పేదలకు వరం

శ్రీకాళహస్తి: చంద్రన్న బీమా పేదలకు ఓ వరమని పురపాలక సంఘ వైస్‌చైర్మన్ పార్థసారధి అన్నారు. పట్టణంలోని కాగితాల అరుంధతివాడలో వెంకటరమణమ్మ అనే మహిళ అనారోగ్యంతో మంగళవారం మృతి చెందింది. ఈ నేపథ్యంలో పార్థసారధి మృతురాలి కుటుంబ సభ్యులకు చంద్రన్న బీమా పథకం కింద మొదటి విడతగా రూ.5 వేలు అందించారు. ఈ కార్యక్రమంలో పులి రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.


బీమా నగదు అందిస్తున్న పార్థసారధి

బిందె నీటి కోసం కొండల బాట

పట్టించుకోని అధికారులు ● గిరిజనకాలనీవాసులకు తప్పని కష్టాలు


మరమ్మతుల కోసం మోటారు తొలగించడంతో నిరుపయోగంగా ఉన్న బోరు

శ్రీకాళహస్తి అర్బన్: శ్రీకాళహస్తి పట్టణ శివారులోని తుఫాన్ సెంటర్ గిరిజన కాలనీలో తాగు నీటి సమస్యతో అల్లాడిపోతున్నామని కాలనీవాసులు గగ్గోలు పెడుతున్నారు. కైలాసగిరులకు ఆనుకుని ఉన్న ఈ కాలనీలో ఉన్న వంద కుటుంబాల వారూ కూలి చేసుకునే నిరుపేదలే. కాలనీ పేరుకు పురపాలక సంఘ పరిధిలోనే ఉన్నా ఇక్కడ ఓవర్‌హెడ్ ట్యాంకు కానీ, రక్షిత మంచినీటి వ్యవస్థ కానీ లేదు. ఉన్న చేతిబోరు మరమ్మతులకు గురై నిరుపయోగంగా మారింది. మొత్తం నాలుగు బోరు మోటార్లతో కాలనీవాసులకు నీరందేది.వాటర్‌హౌస్ కాలనీ నుంచి పురపాలక సంఘ పైపులైను కూడా ఈ కాలనీలో ఉంది.అయితే ఆరు నెలల క్రితం వాటర్‌హౌస్ కాలనీ నుంచి సరఫరా అయ్యే నీరును పైపుల మరమ్మతుల పేరుతో నిలిపివేశారు. దీంతో తాగునీటి కష్టాలు మొదలయ్యాయి.ఇక కాలనీలో ఉన్న మోటార్లు ఒక్కొక్కటిగా పాడైపోయాయి. వీటి మరమ్మతుల గురించి పట్టించుకున్నవారే లేకపోవడంతో రోజురోజుకు నీటి కష్టాలు రెట్టింపయ్యాయని వాపోతున్నారు. ఈ విషయమై అధికారులకు విన్నవించినా పట్టించుకోకపోవడంతో కైలాసగిరి సమీపంలోని గుట్టలు, కాలువల్లో దొరికే పశువులు తాగేనీరు తెచ్చుకోవాల్సి వస్తోందన్నారు. ఈ సమస్య మళ్లీ అధికారుల దృష్టికి తేవడంతో వారంపాటు వాటర్ ట్యాంకరు ద్వారా నీరందించారు. అనంతరం ఏం జరిగిందో కానీ, ఆ ట్యాంకరు నీరు కూడా ఆపేశారు. నీటి సమస్యతో చిన్నారులు స్నానాలు కూడా చేసే పరిస్థితి లేక పాఠశాలలకు దూరమవుతున్నారు. పిల్లలకు మురికి సంబంధిత వ్యాధులు ప్రబలుతున్నాయని వాపోయారు.ఇలా నీటిని ఆపివేస్తు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం దారుణమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.


గిరిజన కాలనీలోని చెడిపోయిన చేతిపంపు

మానవ సేవే మాధవ సేవ

డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ సిపాయి

శ్రీకాళహస్తి: మానవ సేవే మాధవ సేవ అని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, రష్ ఆసుపత్రి అధినేత డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం అన్నారు.శ్రీకాళహస్తి పట్టణంలోని కొత్తపేటలో హరహరబావి పురపాలక సంఘ పాఠశాలకు మంగళవారం ఆయన ప్రొజెక్టర్‌ను వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా విద్యావిధానంలో మార్పుకు కృషి చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు అందరూ సహకరించాలన్నారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ సుప్రజ, టీడీపీ నేతలు పి.శ్రీనివాసులు రెడ్డి, మునిసుబ్బా రెడ్డి, గురుమూర్తి, వెంకటకృష్ణ, సురేష్, కాటారెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాలతోనే ఉద్యోగావకాశాలు



సమావేశంలో మాట్లాడుతున్న అంజన్

శ్రీకాళహస్తి: విద్యార్థులు నైపుణ్యాలను పెంచుకున్నపుడే ఉద్యోగావకాశాలు లభిస్తాయని హైదరాబాదుకు చెందిన అమెద్యార్ స్కిల్స్ సంస్థ టీం లీడర్ అంజన్ తెలిపారు. శ్రీకాళహస్తి పట్టణంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో మంగళవారం డిగ్రీ తృతీయ సంవత్సరం విద్యార్థులకు సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఎలా సాధించాలనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అంజన్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు భాష, సాంకేతిక నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలన్నారు. తమ సంస్థ ఈ నెల 10న ఇండియన్ హెల్త్ కేర్ కంపెనీలో ఉద్యోగాల కోసం శ్రీకాళహస్తిలో మేళా నిర్వహించనుందని చెప్పారు. ఈ మేళాలో ఎంపికైన విద్యార్థులకు ఏడాదికి రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు వేతనం ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వేణుగోపాల్, వైస్‌ప్రిన్సిపాల్ వీరయ్య, జేకేసీ కో-ఆర్డినేటర్ పంకజ,గిరిజమ్మ, అధ్యాపకులు పాల్గొన్నారు.

రూబెల్లా టీకాను సద్వినియోగం చేసుకోండి

శ్రీకాళహస్తి / శ్రీకాళహస్తి అర్బన్ : తట్టు వ్యాధి నివారణకు ప్రభుత్వం అందిస్తున్న రూబెల్లా టీకాను 9 నెలల నుంచి 15 సంవత్సరాల లోపు చిన్నారులందరూ సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ కౌన్సిలర్లు పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం వారు పట్టణంలోని ముత్యాలమ్మగుడివీధిలో ఉన్న పురపాలక పాఠశాలలో చిన్నారులకు టీకాలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం పట్టణంలోని అన్ని పాఠశాలల్లో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ఉన్నతాశయంతో తట్టు, రుబెల్లా వ్యాధుల నివారణకు వేస్తున్న టీకాల కార్యక్రమానికి తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమం సెప్టెంబర్ 8వ తేదీ వరకు కొనసాగుతుందని తెలిపారు. ప్రభుత్వాసుపత్రులు, పాఠశాలలు, అంగన్ వాడీ కేంద్రాలలో ఈ టీకాలు అందుబాటులో ఉంటాయన్నారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ఎం.రవి, కె.ఉదయ్‌కుమార్, మునికృష్ణయ్య, శాంతి, లీలావతి, నివేదిత, అనిత, లత, టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి ఉష తదితరులు పాల్గొన్నారు. కాగా, పట్టణంలో మంగళవారం మొత్తం 2,188 మంది చిన్నారులకు రూబెల్లా టీకాలు వేసినట్లు కమ్యూనిటీ ఆర్గనైజర్ సుజాత తెలిపారు. ఈ కార్యక్రమాల్లో వైద్యాధికారులు మృదుల, శ్రీనివాస్, వైద్య సిబ్బంది, ఏఎన్ ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.


టీకా వేస్తున్న వైద్య సిబ్బంది

రాష్ట్ర సెన్సార్‌బోర్డు సభ్యుడిగా సుబ్రహ్మణ్యంరెడ్డి


సుబ్రహ్మణ్యంరెడ్డికి నియామక పత్రం అందిస్తున్న ఆనంద్

శ్రీకాళహస్తి: రాష్ట్ర సెన్సార్ బోర్డు సభ్యుడిగా శ్రీకాళహస్తికి చెందిన సుబ్రహ్మణ్యం రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ఆయనకు మంగళవారం బీజేపీ నాయకుడు కోలా ఆనంద్ నియామక ఉత్తర్వులను అందించారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యంరెడ్డిని పట్టణంలోని రిలాక్స్ ఫంక్షన్ హాలులో బీజేపీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గరికపాటి రమేష్‌బాబు, పగడాల రాజు, శైలజ, ముత్తు, సుకుమార్, బాలిశెట్టి చంద్ర, కిషోర్, పాండు, సునీతాసింగ్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రజక అవగాహన సదస్సులు

శ్రీకాళహస్తి అర్బన్: శ్రీకాళహస్తి, సత్యవేడు నియోజకవర్గాల పరిధిలోని రజకులకు బుధవారం నుంచి 5వ తేదీ వరకు అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు ఏపీ రజక సంఘాల ఐక్యవేదిక శ్రీకాళహస్తి అధ్యక్షుడు మునికృష్ణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రజక వృత్తిని ముందుకు తీసుకెళ్ళే ధ్యేయంతో నిర్వహించే ఈ సదస్సులకు రజకులు పెద్దఎత్తున హాజరు కావాలని ఆయన పిలుపు నిచ్చారు.

ధ్యానంతో ఏకాగ్రత

శ్రీకాళహస్తి: ధ్యానంతో ఏకాగ్రత లభిస్తుందని ధ్యాన విద్యార్థి ప్రాజెక్టు నిర్వాహకుడు నాగరాజు తెలిపారు. పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం ఆయన విద్యార్థులకు ధ్యానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ధ్యానం చేయడం వల్ల చదువుపై ఏకాగ్రత పెంచుకోవచ్చన్నారు. దీంతో ఉత్తమ ఫలితాలు సాధించే అవకాశముందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సుబ్రహ్మణ్యం రెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.


ధ్యానం చేస్తున్న విద్యార్థులు

ముద్రగడ పాదయాత్రకు అనుమతివ్వాలి


నిరసన తెలుపుతున్న కాపు సంఘ నేతలు

శ్రీకాళహస్తి: కాపుల రిజర్వేషన్ కోసం ముద్రగడ పద్మనాభం చేపట్టనున్న యాత్రకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతివ్వాలని కాపు సంఘం నాయకులు అంజూరు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఆమేరకు శ్రీకాళహస్తిలో మంగళవారం సంఘం ఆధ్వర్యంలో కొవ్వొత్తులు చేతపట్టి, గిన్నెలు కొడుతూ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ ముద్రగడను గృహ నిర్బంధంలో పెట్టడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో రామ్మూర్తి, రత్నమ్మ, వసంతమ్మ, దేవేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తిలో సినిమాలు...

సాయిరాం	: ఫిదా
బలరాం	: గౌతమ్‌నంద
శ్రీనివాస	: నిన్ను కోరి
విజయలక్ష్మి	: వాసుకి
ఆర్.ఆర్	: బాహుబలి-2
రామచంద్ర	: దువ్వాడ జగన్నాధం

పాముకాటుతో మహిళ మృతి



మృతి చెందిన లక్ష్మీదేవి

కలకడ: మండలంలోని ఎనుగొండపాళెం పంచాయతీ మొరంమీదపల్లెకు చెందిన వి.లక్ష్మీదేవి(30) పాముకాటుకు గురై మంగళవారం మృతి చెందింది. గ్రామ శివారు లోని పొలాల్లో గడ్డి కోస్తున్న సమయంలో లక్ష్మీదేవి పాముకాటుకు గురై అపస్మా రకస్థితికి చేరుకుంది. గమనించిన కుటుంబసభ్యులు ఆమెను చికిత్స నిమిత్తం వాల్మీ కిపురం ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

ఎంఆర్ టీకాతో ప్రాణాంతక వ్యాధులు దూరం







పీలేరులో ఎంపీపీ హరిత, సర్పంచు హుమయూన్, పులిచెర్ల ఉన్నత పాఠశాలలో ఎంపీపీ మురళీధర్, కలికిరిలో ఎంపీపీ నాగభూషణరెడ్డి ఎంఆర్ టీకాలు వేస్తున్న దృశ్యం

పీలేరు/కేవీపల్లె/కల్లూరు/కలికిరి/కలకడ/భాకరాపేట/రొంపిచెర్ల: ఎంఆర్ టీకాతో ప్రాణాంతక వ్యాధులు దూరమవుతాయని పీలేరు ప్రభుత్వాస్పత్రి సూపరిం టెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మన్ కోటపల్లె బాబురెడ్డి అన్నారు. మంగళవారం ప్రభుత్వ ఆస్పత్రులు, పీహెచ్‌సీల ఆధ్వర్యంలో ఎంఆర్ టీకాల కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. పీలేరు, కేవీపల్లె, పులిచెర్ల, కలికిరి, కలకడ, చిన్నగొట్టిగల్లు, రొంపిచెర్ల మండలాల్లో జరిగిన కార్యక్రమాల్లో ఎంపీపీలు హరిత, మురళీధర్, నాగభూషణంరెడ్డి, చల్లా ప్రేమలత, కలకడ జడ్పీటీసీ తిరుపతినాయుడు, సర్పంచులు, పీహెచ్‌సీల అభివృద్ధి కమిటీ ఛైర్మన్లు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడు తూ మీజిల్స్ రూబెల్లా టీకా పిల్లల ఆరోగ్యానికి రక్షగా కాపాడుతుందని, తొమ్మిది నెలల నుంచి 15 సంవత్సరాల పిల్లలందరికీ ఈ టీకాలను వేయించాలని కోరారు. దీంతో పిల్లలను తట్టు వ్యాధి బారిన పడకుండా కాపాడు కోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమం సెప్టెంబరు నెల వరకు కొనసాగుతుందన్నారు. కార్యక్రమాల్లో సర్పంచులు ఏఎస్ హుమయూన్, రజియాబేగం, అంజమ్మ, ఎంపీడీవోలు రామచంద్ర, ఇందిర, డీవైఈవో దయానంద రెడ్డి, పులిచెర్ల ఎంఈవో సిద్దరామయ్య, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మన్లు వి.కేశవర్ధన్, యర్రయ్యశెట్టి, పులిచెర్ల మధుసూదనరెడ్డి, రియాజ్‌అహ్మద్‌ఖాన్, వైద్యాధికారులు అరవింద్‌కుమార్, కిషోర్‌కుమార్‌రెడ్డి, లక్ష్మీనరసమ్మ, శ్రీధర్, రమేష్‌రెడ్డి, రాజేష్, లోకవర్ధన్, సత్యనారాయణ, పవన్‌గౌరి, రాజ, సీహెచ్‌వోలు లక్ష్మీకాంతమ్మ, పద్మావతి, ఎజాజ్ అహ్మద్‌ఖాన్, శ్వేత, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ సమష్టి బాధ్యత



మొక్కలు నాటుతున్న ఎంపీడీవో వసుంధర తదితరులు

పీలేరు: పర్యావరణ పరిరక్షణ సమష్టి బాధ్యత అని ఎంపీడీవో వసుంధర అన్నారు. మంగళవారం నెహ్రూ యువజన కేంద్రం, ఫైన్ స్వచ్ఛంద సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ పక్షోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో మాట్లాడుతూ ఈ నెల 15వరకు జరిగే స్వచ్ఛభారత్ పక్షోత్సవాలను విజయవంతం చేయాలన్నారు. ఈ సంద ర్భంగా సైకిల్ ర్యాలీలు, యువతకు వివిధ అంశాలపై పోటీలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో షీ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు పీవీఎస్ లక్ష్మి, ఫైన్ సంస్థ అధ్యక్షుడు బాబ్జాన్, సీనియర్ అసిస్టెంట్ సోమశేఖర్‌రెడ్డి, సభ్యులు సైదున్నీసా, రాయల్ సుధాకర్, సుబ్రహ్మణ్యం, జాకీర్, రోజా తదితరులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ అధ్యక్షుడిగా శశిధర్‌రెడ్డి





శశిధర్‌రెడ్డి, శ్రీరాములు, సదాశివరెడ్డి

పీలేరు: పీలేరు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడిగా ఎం.శశిధర్ రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి, దక్షిణభారత క్లబ్ రీజనల్ కో-ఆర్డినేటర్ వంశీ ధర్‌బాబు తెలిపారు. కార్యదర్శిగా ఎం.శ్రీరాములు, కోశాధి కారిగా కె.సదాశివరెడ్డిని ఎన్నుకున్నట్లు వివరించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ప్రతినిధులు సత్యంరెడ్డి, సురేంద్రారెడ్డి, సుధాకర్‌రెడ్డి, మహేష్, మోహన్‌రెడ్డి, నరసింహులు, సూర్యనారాయణ, ఆనందరెడ్డి, రవి, అర వింద్, నాగబాలాజీ, విజయభాస్కర్‌రెడ్డి, సుధీర్, సుబ్ర హ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నాయకులపై ఆరోపణలు సరికాదు

ఎర్రావారిపాళెం: వైసీపీ నాయకులు అభివృద్ధికి అడ్డుపడుతున్నారని టీడీపీ నాయకులు చేసిన ఆరోపణలు సరికాదని ఎంపీపీ రేవతి, వైసీపీ సర్పంచులు రెడ్డప్పరెడ్డి, చెంగల్‌రెడ్డి, మహేష్ సవాల్ అన్నారు. మండలంలో అర్హులైన పేదలకు ఇళ్లు మంజూరు చేయా లని తాము అడిగితే అభివృద్ధికి అడ్డుపడుతున్నామని ఆరోపించడం సిగ్గుచేటని అన్నారు. తమ పంచాయతీల పరిధిలో గ్రామసభలు నిర్వహించి అర్హులైన పేదలకు ఎన్టీఆర్ గృహ కల్పన పథకం కింద ఎంపిక చేసేందుకు టీడీపీ నాయకులు సిద్ధమా అని సవాల్ విసిరారు. కూరపర్తివారిపల్లె సర్పంచు మహేష్ తన సంతకాన్ని ఫోర్జరీ చేస్తూ అనర్హులకు ఇళ్లు మంజూరు చేశారని ఆరోపించారు. కమళ్ల సర్పంచు ఊటుకూరి చెంగల్‌రెడ్డి మాట్లాడుతూ లండన్‌లో నివసిస్తున్న గృహాలు మంజూరు చేయడం ఎంతవరకు న్యాయమని అన్నారు. వాటర్‌షెడ్ పథకంలో అవినీతిపై తాము పీడీకి ఫిర్యాదు చేశామని, త్వరలో విచారణ జరుగుతుందన్నారు. టీడీపీ నాయకులు తమ తప్పులను కప్పిపుచ్చుకునేందుకు వైసీపీ నాయకులపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. సమావేశంలో వైసీపీ నాయకులు నాగార్జునరెడ్డి, వెంకటసిద్దులు తదితరులు పాల్గొన్నారు.

టిప్పర్ డ్రైవర్లచే ప్రతిజ్ఞ

కలకడ: టిప్పర్ డ్రైవర్లచే ఎస్ఐ చాంద్‌బాషా మంగళ వారం స్టేషన్ ఎదుట ప్రతిజ్ఞ చేయించారు. ట్రాఫిక్ నియ మాలు పాటించి వాహనాలు నడపాలన్నారు. మత్తుపానీ యాలు తాగి డ్రైవింగ్ చేపట్టమని వారు ప్రతిజ్ఞ చేశారు.

సమాజ సేవలో విద్యార్థులు భాగస్వాములు కావాలి



మాట్లాడుతున్న ఎన్ఎస్ఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు నగేష్

పీలేరు: సమాజ సేవలో విద్యార్థులు భాగస్వాములు కావాలని నవసమాజ ఫెడరేషన్(ఎన్ఎస్ఎఫ్) రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు నీరుగట్టు నగేష్ అన్నారు. మంగళవారం కోటపల్లెలో జరిగిన పీలేరు, పుంగనూరు నియోజకవర్గాల ఎన్ఎస్ఎఫ్ ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఆరేళ్లుగా ఎన్ఎస్ఎఫ్ విద్యార్థులు, యువతను చైతన్యవంతుల్ని చేసే దిశగా పలు కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. ప్రతి నియోజకవర్గంలో కమిటీలు ఏర్పాటు చేసి యువతకు సామాజిక సేవపై అవగాహన కల్పించి భాగస్వాముల్ని చేయనున్నట్లు తెలిపారు. విద్యాసంస్థల్లో మౌలిక వసతు లను మెరుగుపర్చాలని, పెండింగ్‌లో ఉన్న ఉపకార వేతనాలు, ఫీజు రీఎంబర్స్‌మెంటును విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి సందీప్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు సురేష్‌నాయక్, కార్యదర్శి శివప్రసాద్, నాగేంద్ర, ప్రభుతేజ, జాహీద్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శ్రీలక్ష్మి

పీలేరు: విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి శ్రీలక్ష్మి అన్నారు. మంగళ వారం చిత్తూరు మార్గంలోని గురుకుల పాఠశాలలో నిర్వ హించిన న్యాయవిజ్ఞాన సదస్సులో జడ్జి మాట్లాడుతూ విద్యతో జీవితంలో ఉన్నత శిఖరాలు చేరుకోవచ్చని, అదే సమయంలో నైతిక విలువలను పాటించి చట్టాలను తెలుసుకున్నప్పుడు జీవితంలో సమస్యలు దూరమవు తాయని అన్నారు. సదస్సులో ఏపీపీ రామసుబ్రహ్మణ్యం, ప్రిన్సిపాల్ ఉషారాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

కళాశాలలో మౌలిక వసతులు కల్పించండి



కళాశాల వద్ద నిరసన తెలియజేస్తున్న విద్యార్థులు

భాకరాపేట: చిన్నగొట్టిగల్లు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మౌలిక వసతులు కల్పించాలని ఏఐఎస్ఎఫ్, ఎన్ఎస్‌యూఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు మంగళవారం నిరసన తెలిపారు. ఎన్ఎస్‌యూఐ జిల్లా ఉపాధ్యక్షుడు వసీమ్‌అక్రమ్ మాట్లాడుతూ కళాశాలలో మౌలిక వసతులు కల్పించలేదని, ల్యాబ్ సౌకర్యం అర కొరగా ఉందని, బాలికలకు మరుగుదొడ్లు కూడా లేవని, తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి చలపతి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి భాను ప్రకాష్, విద్యార్థి సంఘ నాయకులు పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతులతో అధికదిగుబడి



రైతులతో మాట్లాడుతున్న ఏవో శ్రావణి

కేవీపల్లె: వ్యవసాయసాగులో ఆధునిక పద్ధతులు చేపట్టి రైతులు సత్ఫలితాలు సాధించాలని ఏవో శ్రావణి అన్నారు. మంగళవారం మండలంలోని నారమాకుల పల్లెలో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులకు వరి, టమోటా పంటలకు జింక్‌సల్ఫేట్, బోరాన్ ఉచితంగా అందజేశారు. ఎర్రగొంగళి పురుగు లార్వాదశలో వున్న చేలలో క్వినాల్‌ఫాస్ మందును లీటరు నీటికి రెండు మిల్లీలు కలిపి పిచికారీ చేయాలని ఏవో సూచించారు. లార్వా అధికంగా వున్నట్లైతే 10 కిలోల తౌడుకు కిలో బెల్లం, లీటరు క్వినాల్‌ఫాస్ కలిపి విషపుఎర తయారుచేసి వేరుశనగ చేలలో పిచికారీ చేయాలన్నారు. ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా గల్లా జన్మదిన వేడుకలు

భాకరాపేట: మాజీ మంత్రి, చంద్రగిరి నియోజక వర్గ టీడీపీ ఇన్‌చార్జి గల్లా అరుణకుమారి జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. దేవరకొండ వెంకటేశ్వరస్వామి ఆలయంలో టీడీపీ నాయకులు సుధాకర్, మహేంద్ర ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వరలక్ష్మీవ్రత పూజలకు ప్రత్యేక ఏర్పాట్లు

పీలేరు/కలికిరి: పీలేరు పట్టణంలోని రౌద్రాల అంకా లమ్మ, కోటపల్లె జీవీ చంద్రశేఖర్‌రెడ్డినగర్‌లోని వెంకటేశ్వ రస్వామి ఆలయం, కడప మార్గం సూర్యనారాయణ రెడ్డినగర్‌లోని వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో శుక్రవారం జరగనున్న వరలక్ష్మీవ్రత ఉత్సవానికి ఆలయ కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేపట్టారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, వరలక్ష్మీ వ్రతాన్ని నిర్వహిస్తారని, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు. శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని ప్రతి శుక్రవారం సాయం త్రం సామూహిక కుంకుమార్చన నిర్వహించనున్నట్లు వివరించారు. అలాగే కలికిరి మండలం గుండ్లూరులోని లక్ష్మీ సమేత చెన్నకేశవస్వామి ఆలయంలోనూ వరలక్ష్మీ వ్రత ఉత్సవానికి ఏర్పాట్లు చేపట్టినట్లు సర్పంచు ఆర్.మురళీనాథరెడ్డి, అర్చకుడు వెంకటశాస్త్రి తెలిపారు.

గ్యారంపల్లె ఘర్షణ కేసులో ఇద్దరి అరెస్టు

కేవీపల్లె: వారం రోజుల క్రితం మండలంలోని గ్యారం పల్లెలో ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ సుమన్ తెలిపారు. గ్రామానికి చెందిన సుబ్బారెడ్డి, గజ్జల వెంకట్రమణారెడ్డిని మంగళ వారం అరెస్టుచేసి కోర్టులో హాజరుపరచగా న్యాయ మూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించినట్లు ఆయన అన్నారు.

కేజీబీవీ ఎస్వోగా శ్రావణి



రొంపిచెర్ల: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయం ఎస్వోగా ఎం. శ్రావణి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఆమె తంబళ్లపల్లె విద్యాలయం నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు.

సినిమా గైడ్



షకూర్	పిదా
ఎస్వీ మహల్	నిన్నుకోరి
ఎస్వీ డీలక్స్	పెళ్లికిముందు ప్రేమకథ
అజంతా	గౌతమ్‌నంద

విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ

విజయపురం: మండలంలోని శ్రీహరిపురం ఉన్నత, ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు విశ్రాంత ఎంఈవో యుగంధర రాజు మంగళవారం నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. తన తండ్రి వెంకట రాజు జ్ఞాపకార్థంగా ప్రతి యేడాది పేద విద్యార్థులకు విద్యాసామగ్రి అందిస్తున్నామని యుగంధర రాజు చెప్పారు. కార్యక్రమంలో జీఎంపురం ఉన్నత పాఠశాల హెచ్X ఎం జయదేవ్, ఎస్ఎంసీ సభ్యులు పాల్గొన్నారు.



అందుబాటులో ఎరువులు, విత్తనాలు

రూరల్ బ్యాంకు ఛైర్మన్X సురేష్

నగరి: నగరి సహకార రూరల్‌బ్యాంకులో రైతులకు ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉన్నాయని బ్యాంకు ఛైర్మన్X సురేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువుల ధరలు స్వల్పంగా తగ్గాయని చెప్పారు. యూరియా బస్తా రూ.295, కాంప్లెక్స్ బస్తాపై రూ.26, డీఏపీ బస్తాపై రూ.11, ఇతర ఎరువులపై బస్తాకు రూ.15 తగ్గించినట్టు ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని బ్యాంకు ఛైర్మన్X , సీఈవో తులసిపిళ్లై కోరారు.

ద్రౌపదీదేవి పుర విహారం



పిచ్చాటూరు: మండల కేంద్రం పిచ్చాటూరులో ఉన్న ద్రౌపది సమేత ధర్మరాజులు ఆలయ తిరుణాళలో భాగంగా 5వ రోజు మంగళవారం ద్రౌపదీదేవి దివ్యతేజస్సుతో పట్టణంలో విహరించారు. భక్తులు కర్పూర హారతులు సమర్పించారు. ఉదయం ఆలయంలో అభిషేకాలు, అర్చనలు జరిగాయి. రాత్రి వీధి నాటకం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఉత్సవ నిర్వాహకులు, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

65వ రోజుకు చేరిన కొప్పేడువాసుల రిలే దీక్ష

నింద్ర: మండల పరిధిలోని కొప్పేడు దళితులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేస్తున్న రిలే దీక్ష మంగళవారంతో 65వ రోజుకు చేరింది. తమ సమస్యలు పరిష్కారమయ్యేంత వరకు ఈ దీక్షను విరమించేది లేదని వారు స్పష్టం చేశారు. గ్రామ ప్రజలు ముఖ్యమా..సమీపంలోని ఫ్యాక్టరీ ముఖ్యమో అధికారులు నిర్ధారించాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సబ్సిడీ రుణాలను సద్వినియోగం చేసుకోండి

జడ్పీ చైర్‌పర్సన్X గీర్వాణి

చిత్తూరు కల్చరల్: ప్రభుత్వం అందించే సబ్సిడీ రుణాలను సద్వినియోగం చేసుకోవాలని జడ్పీ చైర్‌పర్సన్ గీర్వాణి సూచించారు. సబ్సిడీ రుణాలపై చిత్తూరు ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. వెనుకబడిన తరగతుల అభివృద్ధి కోసం ప్రభుత్వం సబ్సిడీ రుణాలను అందజేస్తున్నదన్నారు. పంట సంజీవని పనులకు ప్రాధాన్యమివ్వాలన్నారు. ప్రతి పంచాయతీలో వందమంది కూలీలకు తక్కువ కాకుండా ఉపాధి హామీ పథకం కింద పనులు చేపట్టాలన్నారు. కొన్ని పంచాయతీల్లో కూలీల సంఖ్య తగ్గిందని అధికారులు చొరవ చూపాలని ఆమె అన్నారు. మండలాలకు మంజూరైన సీసీ రోడ్లు త్వరితగతిన పూర్తిచేయాలని సర్పంచులు, అధికారులను ఆదేశించారు. ఉపాధి హామీ పనులు గ్రామాల అభివృద్ధికి తోడ్పడతాయన్నారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్ళాలని కోరారు.

ఎంఆర్ వ్యాక్సిన్X తో తట్టు, పొంగు దూరం






నగరి, నాగలాపురం, విజయపురం, నింద్ర మండల కేంద్రాల్లో నిర్వహించిన ఎంఆర్ వ్యాక్సిన్X శిబిరాలు

నగరి: ప్రాణాంతకమైన తట్టు, పొంగు వ్యాధుల నుంచి తొమ్మిది నెలల చిన్నారుల నుంచి 15 సంవత్సరాలోపు పిల్లలను రక్షించేందుకు ఇస్తున్న ఎంఆర్ టీకాతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని మున్సిపల్ చైర్‌పర్సన్X శాంతి చెప్పారు. మంగళవారం నగరిలోని వైద్య విధాన పరిషత్X ప్రభుత్వాస్పత్రిలో ఎంఆర్ టీకా వేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. మున్సిపాలిటీ పరిధిలోని ఆయా వార్డులు, పాఠశాలల్లో ఈ కార్యక్రమాలు జరుగుతాయని విద్యార్థులు టీకాలు వేసుకోవాలని కోరారు. మండలంలోని అన్ని గ్రామాల్లో టీకాలు వేసే కార్యక్రమం జరుగుతుందని ఎంపీపీ మీర తెలిపారు. కార్యక్రమంలో ఆస్పత్రి ఇన్X చార్జి సూపరింటెండెంట్ మంజుల, ఎంఈవో శ్రీదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

సత్యవేడు: సత్యవేడు మండల పరిధిలోని దాసుకుప్పం, పాండూరు తదితర పీహెచ్X సీల్లో ఎంఆర్ వ్యాక్సినేషన్X ప్రారంభించారు. మంగళవారం ఉదయం ఆయా పీహెచ్‌సీల పరిధిలోని ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లు బృందాలు ఏర్పడి పాఠశాలల్లో విద్యార్థులకు టీకాలు వేశారు. సత్యవేడు పట్టణంలోని ముత్యాలదాసు ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు, దళితవాడలోని ప్రాథమిక పాఠశాల, మాస్టర్‌స్కూల్ తదితర ప్రాంతాల్లో 15సంవత్సరాల్లోపు విద్యార్థులకు వ్యాక్సిన్లు వేశారు. దాసుకుప్పం పీహెచ్X సీ వైద్యాధికారి శాంతా వనజకుమారి, పాండురు పీహెచ్‌సీ వైద్యాధికారి మాధవి తమ పరిధిలో ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పిచ్చాటూరు: ఎంఆర్ వ్యాక్సినేషన్ కార్యక్రమం మండల పరిధిలో ప్రారంభమైంది. మండల కేంద్రంలోని జేబీఆర్ ప్రైవేట్ పాఠశాలలో పిచ్చాటూరు పీహెచ్‌సీ వైద్యాధికారి దీప్తివదన ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాక్సిన్ వేశారు. మండల వ్యాప్తంగా గ్రామాల్లోని పాఠశాలల వద్ద ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశవర్కర్లు తమకు కేటాయించిన ప్రాంతాల్లో వ్యాక్సిన్లు వేశారు.

విజయపురం: మండల కేంద్రంలో ఎంఆర్ వ్యాక్సిన్ కార్యక్రమాన్ని విజయపురం పీహెచ్X సీ అభివృద్ధి కమిటీ చైర్మన్ శివలింగం మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ రాజేశ్వరమ్మ, వైద్యాధికారులు గుణశేఖర్, వాసంతి, ఎంఈవో ఆంజనేయులు, హెచ్X ఎం చంద్రమణి, టీడీపీ మండల అధ్యక్షుడు దశరథరాజు, సీహెచ్‌వో దేవ కృపావరం, పీహెచ్ఎన్ భాగ్యలక్ష్మి, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

నాగలాపురం: మండల కేంద్రం నాగలాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఎంఆర్ టీకా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రభుత్వ ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి నాగరాజు ఆధ్వర్యంలో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో సిబ్బంది ఆరు బృందాలుగా ఏర్పడి నాగలాపురంలోని అన్ని పాఠశాలలోని విద్యార్థులకు టీకాను వేశారు. మొదటి రోజు 1050 మందికి ఈ టీకా వేశారు. ఈ కార్యక్రమంలో హెచ్X ఈ గోపీ, సీహెచ్X వో శివయ్య, సూపర్‌వైజర్లు ధనలక్ష్మి, జ్యోతి, సుబ్బరాయుడు పాల్గొన్నారు.



సత్యవేడులో చిన్నారికి వ్యాక్సిన్X వేస్తున్న ఏఎన్X ఎం

నింద్ర: చిన్నారులను ప్రాణాంతకమైన తట్టు, పొంగు వ్యాధుల నుంచి రక్షించేందుకు ఇస్తున్న ఎంఆర్ టీకాను విద్యార్థులందరికీ వేస్తామని ఎంపీపీ వసంతమ్మ చెప్పారు. మంగళవారం మండల కేంద్రం నింద్రలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో టీకాలను వైద్యాధికారి వెంకటనారాయణ వేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మన్X రవికుమార్, ఎంపీడీవో మోహనవర్మ, తహసీల్దార్ బాబు, ఎంఈవో నారాయణ, ఎంసీహెచ్X వో, ఎంపీహెచ్X ఈవో, ఎంపీహెచ్X ఈ తదితరులు పాల్గొన్నారు.

మూలనపడిన '1100కు ఫిర్యాదు' బోర్డులు





ఉపాధి, తహసీల్దార్, వ్యవసాయ అధికారుల కార్యాలయాల్లో మూలనపడిఉన్న బోర్డులు

వెదురుకుప్పం: ఎవరైనా లంచం అడిగితే నెం.1100కు ఫిర్యాదు చేయాలంటూ ప్రభుత్వ కార్యాలయాలకు ప్రభుత్వం సరఫరా చేసిన ఫ్లెక్సీలు మూలనపడ్డాయి. లంచంపై ప్రజలకు అవగాహన కల్పించడానికి అన్ని ప్రభుత్వ కార్యాలయాల వద్ద 1100 నెంబరు బోర్డులను పెట్టించాలని ఆదేశాలు వెలువడ్డాయి. ఆ బోర్డులు మండల కేంద్రానికి చేరుకున్నాయి. అయితే వాటిని అధికారులు మూలన పడవేశారు. ఒకట్రెండు కార్యాలయాల్లో తగిలించినా నెంబరు కనబడకుండా జాగ్రత్త వహించారు. ఉపాధి హామీ పథకం, తహసీల్దార్, వ్యవసాయాధికారి, విద్యావనరుల కేంద్రం, హౌసింగ్ కార్యాలయాల్లో బోర్డులు మూలనపడ్డాయి.

ఆడియో, వీడియో పరికరాల పంపిణీ

కార్వేటినగరం: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు సులభ పద్ధతిలో విద్యాబోధనకు ఇషా సంస్థ ఆడియో, వీడియో పరికరాలను పంపిణీ చేశారు. అంతకుముందు మండల విద్యా వనరుల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఇషా కోఆర్డినేటర్ల లక్ష్మీనారాయణ, దామోదరం మాట్లాడుతూ మండలంలో యూపీ, ఉన్నత పాఠశాలలకు ఆడియో, వీడియో పరికరాలను పంపిణీ చేశామన్నారు. దీంతో విద్యార్థుల్లో సృజనాత్మకత పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

మరుగుదొడ్ల నిర్మాణాన్ని శరవేగంగా పూర్తి చేస్తాం

గంగాధరనెల్లూరు: మండలంలో మరుగుదొడ్ల నిర్మాణాన్ని వేగవంతంగా పూర్తి చేయించడానికి ప్రత్యేక దృష్టిసారించామని ఎంపీడీవో ప్రైల తెలిపారు. ఆమె మంగళవారం ఆమె మాట్లాడుతూ స్వచ్ఛభారత్‌లో భాగంగా మండలంలోని అగరమంగళం, ఆత్మకూరు, బంగారెడ్డిపల్లె, చిన్నవేపంజేరి, కలిజవేడు, కొత్తవెంకటాపురం, కొట్రకోన, మహదేవమంగళం, పాపిరెడ్డిపల్లె, వేపంజేరి పంచాయతీలను ఓడీఎఫ్ (ఓపెన్ డెఫికేషన్ ఫ్రీ) కింద ఎంపిక చేశామన్నారు. ఇప్పటికే పాతపాళ్యంలో ఇంటింటికీ మరుగుదొడ్ల నిర్మాణం పూర్తిచేసి ఓడీఎఫ్ పంచాయతీగా ప్రకటించామన్నారు. జూలైకు మాత్రం స్పెషల్ క్యాంపెయిన్‌తో బెంచ్ మార్క్ దాటి నిర్ణయాలద్వారా 406 మరుగుదొడ్ల నిర్మాణం లక్ష్యంకాగా 126 పూర్తి చేశామశామన్నారు.

దేశమ్మ దేవాలయంలో ఘనంగా ఆడి పూజలు



ప్రత్యేక అలంకరణలో దేశమ్మ



నగరి: నగరి పట్టణంలోని దేశమ్మ దేవాలయంలో ఆడి నెల మూడో మంగళవారాన్ని పురస్కరించుకుని విశేష పూజలు జరిగాయి. నగరి, పరిసర ప్రాంతాలతోపాటూ తమిళనాడుకు చెందిన భక్తులు వాహనాల్లో తరలివచ్చారు. పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు గంటల తరబడి నిల్చున్నారు. పలువురు అన్నదానం చేశారు. ఆలయ ఈవో మునికృష్ణయ్య, సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఎన్టీఆర్ గృహాలకు దరఖాస్తు చేసుకోండి

పుంగనూరు: మున్సిపాలిటీ పరిధిలో ప్రభుత్వం మంజూరు చేసే ఎన్టీఆర్ ఇళ్లకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ కెఎల్. వర్మ కోరారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ పట్టణంలో సొంత స్థలాలు ఉన్న వారు కూడా దరఖాస్తు చేసుకోవడానికి అర్హులన్నారు. స్థలాలు లేనివారికి ప్రభుత్వం అపార్ట్‌మెంట్లు నిర్మించి లాటరీ పద్ధతిలో ఇళ్లను కేటాయించడం జరుగుతుందన్నారు. మున్సిపాలిటీలో అపార్ట్‌మెంట్లుకు 2274 ఇళ్ల మంజూరు చేస్తే 1250మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నారన్నారు. ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని అర్హులైన ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మీజిల్స్, రుబెల్లా టీకాపై అపోహలు వద్దు

పుంగనూరు రూరల్/చౌడేపల్లె/రామసముద్రం/సోమల/సదుం: ప్రాణాంతక వ్యాధులైన మీజిల్స్, రుబెల్లా (ఎంఆర్)టీకాపై ప్రజలకు ఏలాంటి అపోహలు వద్దని పుంగనూరు మున్సిపల్ కమిషనర్ కెఎల్.వర్మ అన్నారు. మంగళవారం పట్టణంలోని కొత్తయిండ్లు మున్సిపల్ పాఠశాలలో విద్యార్థులకు ఎంఆర్ టీకాలను వేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ శోభారాణి మాట్లాడుతూ టీకాలు వేసుకోవడం వల్ల జ్వరాలు వస్తాయని స్థానికులు భయపడుతున్నారని అన్నారు. దీంతో కమిషనర్ మాట్లాడుతూ పోలియో మహమ్మారిని తరిమి కొట్టినట్లు తట్టు, రుబెల్లా వ్యాధుల నివారణకు ప్రభుత్వం కంకణం కట్టుకుందన్నారు. ఈ టీకాలు వేయించుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించి ప్రతి ఒక్కరూ టీకాలు వేయించుకునేలా చైతన్యం తీసుకు రావాలని ఆయన కోరారు. మున్సిపల్ వైస్ ఛైర్మన్ ఆవుల అమరేంద్ర మాట్లాడుతూ 9 నెలల పిల్లల నుంచి 15 ఏళ్ల వయస్సు కలిగిన ప్రతి ఒక్కరూ టీకాలు వేయించుకోవాలన్నారు. సమావేశంలో పాఠశాల హెచ్ఎం. సుబ్రహ్మణ్యం, ఎంఈవో లీలారాణి, కౌన్సిలర్ మనోహర్, కో ఆప్షన్ సభ్యుడు ఖాదర్‌బాషా, డాక్టర్ పవన్‌కుమార్, సూపర్‌వైజర్లు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్త పద్మ, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, విద్యార్థులు పాల్గొన్నారు. ● చౌడేపల్లె జడ్పీ హైస్కూల్‌లో స్థానిక ఆస్పత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మన్, మాజీ ఎంపీపీ ఎం.చంద్రవదన, ఎంఈవో కేశవరెడ్డి ఎంఆర్ టీకా కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో వైద్యాధికారి నిరంజన్ కుమార్, హెచ్ఎం ఈశ్వర్‌రెడ్డి, ఎంపీహెచ్‌వో అంజమ్మ, రాజశేఖర్, వెంకటేశ్వర నాయుడు, ఉపాధ్యాయులు, వైద్యసిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు. ● రామసముద్రం పీహెచ్‌సీలో అభివృద్ధి కమిటీ ఛైర్మన్ బద్రీనాథ్ ఎంఆర్ టీకా కార్యక్రమాన్ని ప్రారంభించారు. మండలంలో డాక్టర్లు గ్రీష్మబిందు, ప్రవీణ్‌కుమార్, సోనియా, కోమల, వైద్యసిబ్బంది పిల్లలకు ఎమ్మార్ టీకాలను వేశారు. కార్యక్రమాల్లో అంగన్‌వాడీ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ● సోమల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వైద్యసిబ్బంది ఎంఆర్ టీకాలు వేశారు. మండలంలోని నంజంపేట, కందూరు, పెద్దఉప్పరపల్లె గ్రామాల్లో టీకా కార్యక్రమాన్ని సర్పంచ్‌ల సంఘ జిల్లా అధ్యక్షుడు యదుశేఖర్‌నాయుడు ప్రారంభించారు. ● సదుం ప్రభుత్వ వైద్యశాలలో సర్పంచ్ సయ్యద్‌బాషా, ఎంపీటీసీ కాలేషా ఎంఆర్ టీకా కార్యక్రమాన్ని ప్రారంభించారు. నడిగడ్డ, యర్రాతివారిపల్లె, సదుం గ్రామాల పరిధిలోని టీకాలు వేశారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ అరవింద్, డాక్టర్ రాధ, ఎంఈవో శ్రీరాములు, డాక్టర్ రూపానంద్, శ్రీధర్‌బాబు, శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.



పుంగనూరు కొత్తయిండ్లు పాఠశాల, రామసముద్రం పీహెచ్‌సీలో టీకాలు ప్రారంభిస్తున్న వైద్యులు

అర్హులందరికీ పింఛన్లు అందజేయండి



పింఛన్లు అందజేస్తున్న మున్సిపల్ వైస్ ఛైర్మన్ అమరేంద్ర

పుంగనూరు: అర్హులందరికీ పింఛన్లు అందజేయాలని మున్సిపల్ వైస్ ఛైర్మన్ ఆవుల అమరేంద్ర అన్నారు. మంగళవారం ఆయన స్థానిక కొత్తయిండ్లు మున్సిపల్ పాఠశాల ఆవరణలో వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో అనేక మంది పింఛన్లు అందక ఇబ్బందులు పడుతున్నారని, వారికి వెంటనే పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కమిషనర్ కెఎల్.వర్మ మాట్లాడుతూ పట్టణ పరిధిలో 3089మందికి పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు మనోహర్, శోభారాణి, అధికారులు పాల్గొన్నారు.

ఇంటి తలుపులు బద్దలుకొట్టి చోరీ

చౌడేపల్లె: తాళం వేసిన ఇంటి తలుపులు బద్దలు కొట్టి చోరీకి పాల్పడిన సంఘటన చౌడేపల్లెలో సోమవారం రాత్రి జరిగింది. స్థానిక శ్రీనివాస కల్యాణమండపం సమీపంలో నివాసమున్న డి.రవి తన కుటుంబ సభ్యులతో కలసి శనివారం తిరుచానూరుకు వెళ్లాడు. ఇంటికి తాళం వేసిఉండడం గుర్తించిన దుండగులు సోమవారం అర్ధరాత్రి ఇంటి తలుపులు బద్దలు కొట్టి బీరువాలోని నగదు రూ.49 వేల నగదు, జత బంగారు కమ్మలు, రెండు ఉంగరాలు ఎత్తుకెళ్లారు. మంగళవారం ఉదయం రవి సోదరుడు దాము గుర్తించి పోలీసులకు, బాధితుడికి సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని చోరీపై ఆరా తీశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



దుండగులు ధ్వంసం చేసిన బీరువా

వర్షం కోసం వలసదేవర



చిన్నతాండాలో వలసదేవర నిర్వహిస్తున్న ప్రజలు

పుంగనూరు రూరల్: మండలంలోని సుగాలిమిట్ట పంచాయతీ చిన్నతాండాలో మంగళవారం వలసదేవర ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే గ్రామంలో ఎవరూ లేకుండా ఇళ్లకు తాళాలు వేసి వలస వెళ్లారు. అందరూ కలసి వనభోజనాలు చేసి సాయంత్రం వరకు ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు దొరస్వామినాయక్, మునస్వామినాయక్, గోపాల్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నెలాఖరులోపు గృహ నిర్మాణాలు పూర్తి చేయండి

రామసముద్రం: ఎన్టీఆర్ గృహ నిర్మాణాలను ఈనెల ఆఖరులోపు పూర్తి చేసేలా సిబ్బంది చర్యలు తీసుకోవాలని మదనపల్లె హౌసింగ్ డీఈ చంద్రశేఖర్ ఆదేశించారు. మంగళవారం మండలంలో నిర్మిస్తున్న గృహాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలో 2014-15, 2015-16 ఏడాదిలో నిర్మించిన ఇందిరమ్మ గృహాలు వివిధ నిర్మాణాల్లో ఉన్నాయని, పెండింగ్‌లో ఉన్న 651 గృహాలను పూర్తిచేయడానికి ప్రభుత్వం అదనంగా రూ.25వేలు ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. మండలంలో 2016-17గాను 163 ఎన్టీఆర్ గృహాలు మంజూరైనట్లు తెలిపారు. ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఆయన వెంట ఏఈ సుబ్బరాయుడు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హౌసింగ్ డీఈ చంద్రశేఖర్

చౌడేపల్లె వాసవీక్లబ్‌కు స్టార్‌క్లబ్ అవార్డు



ఇంటర్నేషనల్ క్లబ్ అధ్యక్షుడు ఆదికేశవన్ నుంచి అవార్డు అందుకుంటున్న క్లబ్ అధ్యక్షురాలు నాగలక్ష్మి

చౌడేపల్లె: స్థానిక ఆర్యవైశ్య వనితా వాసవీక్లబ్‌కు స్టార్‌క్లబ్ అవార్డు లభించినట్లు క్లబ్ అధ్యక్షురాలు నాగలక్ష్మి తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ గతకొంత కాలంగా వాసవీక్లబ్ చేపట్టిన సేవా కార్యక్రమాలను గుర్తించిన ఇంటర్నేషనల్ క్లబ్ అధ్యక్షుడు ఆదికేశవన్ బెంగళూరులో జరిగిన కార్యక్రమంలో స్టార్‌క్లబ్ అవార్డు అందజేసినట్లు తెలిపారు. అవార్డుతో తమకు మరింత బాధ్యత పెరిగిందని, క్లబ్ కార్యక్రమాలు ఉధృతం చేస్తామన్నారు. అవార్డు రావడం పట్ల పలువురు మహిళలు క్లబ్ సభ్యులకు అభినందనలు తెలియజేశారన్నారు.

చలో కలెక్టరేట్‌ను విజయవంతం చేయండి

చౌడేపల్లె: దళితుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 22న తలపెట్టిన చలో కలెక్టరేట్‌ను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కందారపు మురళి పిలుపునిచ్చారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో దళితనాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో దళితులపై దాడులు జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదని అన్నారు. జిల్లాలో పలుచోట్ల దళితులు నివసించే గ్రామాలకు శ్మశానాలు లేవని, పలు ఆలయాల్లో ప్రవేశాలు లేవని, ఇలాంటి వాటిపై అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నెల 22న చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి కార్యకర్తలు కృషి చేయాలన్నారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చైతన్య, డివిజన్ నాయకుడు నారాయణబాబు, కేవీపీఎస్ నాయకులు వాసు, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి సర్వేకు సహకరించండి

సోమల: ప్రభుత్వ ఆదేశాల మేరకు చేపట్టిన ఇంటింటి సర్వే కార్యక్రమానికి ప్రజలు అందుబాటులో ఉండి సహకరించాలని ఎంపీడీవో శ్రీనివాసులు కోరారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు ప్రతిఇంటికీ వెళ్లి ఆధార్‌కార్డుల ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు ప్రక్రియ చేపట్టాలన్నారు. భవిష్యత్‌లో విద్య, ఉద్యోగ, ప్రభుత్వ పథకాలు పొందాలంటే ఈ సర్వేల ఆధారంగా ఆధార్‌కార్డులో అనుసందానం చేయడం జరుగుతుందన్నారు. ప్రజలు తమ ఇంటి వద్దకు వచ్చే సిబ్బందికి సహకరించాలన్నారు.

పేదలకు వరం చంద్రన్న బీమా



బాధిత కుటుంబసభ్యులకు నగదు అందజేస్తున్న టీడీపీ నేతలు

పుంగనూరు రూరల్: చంద్రన్న బీమా పథకం పేదలకు వరమని టీడీపీ నాయకులు అన్నారు. మంగళవారం స్థానిక కొత్తయిండ్లుకు చెందిన జనార్దనరెడ్డి ఇటీవల మరణించగా అతని కుమారుడు భరత్‌కు రూ.25వేలు నగదు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీమా చేయించుకున్న వారు మృతి చెందిన రెండు నెలల వ్యవధిలో బీమాను బాధిత కుటుంబసభ్యులకు అందజేయడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ చంద్రన్న బీమా నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రామయ్య, విజయకుమారి, మాధవరెడ్డి, కట్టెలమండిబాబు, డాక్టర్ అప్పిరెడ్డి, రామరాజు, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ ప్రోటోకాల్ ఉల్లంఘనపై డీఎంఅండ్‌హెచ్‌వోకు ఫిర్యాదు

పుంగనూరు రూరల్: ప్రభుత్వ కార్యక్రమాల గురించి ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వకపోవడంతో పాటు మెడికల్ ఆఫీసర్ పవన్‌కుమార్ ప్రోటోకాల్ పాటించడం లేదంటూ మున్సిపల్ కౌన్సిలర్ మనోహర్ మంగళవారం డీఎంఅండ్‌హెచ్‌వో విజయగౌరికి ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యశాఖ నిర్వహించే కార్యక్రమాలకు ప్రజాప్రతినిధులను పిలిచి అగౌరవపరుస్తున్నారని మండిపడ్డారు. స్థానిక మున్సిపల్ స్కూల్‌లో జరిగిన ఎమ్మార్ టీకాల కార్యక్రమంలో తనను డాక్టర్ అవమానపరిచారని, ప్రోటోకాల్ లేని రూరల్ నాయకులను ఆహ్వానించారని అన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహించే ముందు స్థానిక ప్రజాప్రతినిధులుకు తెలియకుండా నిర్వహించడం సరికాదన్నారు. మున్సిపాలిటీలో 23 వార్డులో జ్వరాలు సోకి ప్రజలు ఇబ్బందులు పడుతున్నా వైద్యశాఖ పట్టించుకోలేదని ఆయన మండిపడ్డారు. ఈవిషయంపై జిల్లా వైద్యాధికారితో బాటు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

17మంది జూదరుల అరెస్టు

పుంగనూరు రూరల్: 17మంది జూదర్లును మంగళవారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ హరిప్రసాద్ తెలిపారు. మండలంలోని నేతిగుట్లపల్లె పంచాయతీ దిగువ కొండకిందపల్లె గ్రామ సమీపంలో జూదం ఆడుతున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో దాడి చేసి 17మందిని అదుపులోకి తీసుకుని రూ.19020 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

సినిమా గైడ్

వెంకటేశ్వర	ఫిదా
తాజ్‌మహల్	గౌతమ్‌నంద
గోకుల్	దండుపాళ్యం-2
ఎంఎస్ఆర్	వాసుకి